RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com



# భారత శక్తి

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN
Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal



సంపుటి: 19 సంచిక:234 హైదరాబాద్, శనివారం, 22 మార్చి 2025 పేజీలు: 12 వెల: 1.00

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులకు టీఎస్ జెన్‌కోలో ఉద్యోగాలు


%హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని యువత పోరాటం చేసిందని, వారి ఆశలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 53 వేల మందికి నియామకపత్రాలు ఇచ్చిందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలోని 112 మంది భూ నిర్వాసితులకు టీఎస్ జెన్‌కో ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది. సంబంధిత నియామక పత్రాలను మాదాపూర్ సైబర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో భట్టి విక్రమార్క అందజేశారు. దామచర్ల మండలం వీర్లపాలెంకు చెందిన 112 మందికి జూనియర్ అసిస్టెంట్లు, ప్లాంట్ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేట్ల ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలిస్తామని గత ప్రభుత్వ నేతలు చెప్పారని, భూ నిర్వాసితులు వృద్ధులైపోయారు కానీ, ఉద్యోగాలివ్వలేదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అలా జరగకుండా భూమి కోల్పోయిన వారికి వెంటనే ఉపాధి కల్పిస్తున్నామన్నారు.



"ప్రభుత్వ ఉద్యోగాలు పొందలేని వారికి ఉపాధి కల్పించే కార్యక్రమం చేపట్టాం. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఉపాధి కల్పించనున్నాం. ఈ పథకానికి రూ.9 వేల కోట్లు కేటాయించాం. ప్రపంచ ప్రసిద్ధి చెందిన కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు చేసుకున్నాం. రాజీవ్‌గాంధీ సూచన మేరకు హైటెక్ సిటీకి నేదురమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాజీవ్ గాంధీ కృషితో నేడు ఐటీ రంగం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది. ఫ్యూచర్ సిటీలో మరిన్ని కంపెనీలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తాం. హైదరాబాద్‌ను విస్తరిస్తే.. మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఉపాధి కూడా పెరుగుతుంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

## తెలంగాణ గ్రూప్ 1 నియామకాలకు తొలగిన అడ్డంకి

దిల్లీ: తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీవో 29 చెల్లుబాటును సవాల్ చేస్తూ గ్రూప్ 1 అభ్యర్థులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న తెలంగాణ ప్రభుత్వం జీవో 29ని జారీ చేసింది. దీనిని రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా పిటిషన్ కొట్టివేతతో గ్రూప్ 1 నియామకాలకు అడ్డంకి తొలగినట్లైంది. ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది. త్వరలో 1:2 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన చేయనుంది.



## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టులో సవాల్ చేసిన కాంగ్రెస్, ఎంఐఎం

దిల్లీ: పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన వక్ఫ్ (సవరణ) బిల్లు-2025పై కాంగ్రెస్, ఎంఐఎం సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్, ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటు అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానంలో అసదుద్దీన్ సవాల్ చేశారు. ఈ బిల్లులో నిబంధనలు ముస్లిం సమాజ ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఏకపక్షంగా ఉందని, ముస్లిం సమాజానికి చెందిన మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని కాంగ్రెస్ ఎంపీ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.



### పలు నగరాల్లో ముస్లింల నిరసనలు

వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్‌లలోని పలు చోట్ల ముస్లింలు నిరసనలు తెలిపారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగారు. తమిళనాడులో సినీనటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం పార్టీ రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో చెన్నై, కోయంబత్తూర్ వంటి ప్రధాన నగరాల్లో టీవీకే కార్యకర్తలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఇదిలా ఉండగా.. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చూసేందుకు దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. పారామిలటరీ బలగాలతో కలిసి శుక్రవారం జామియానగర్, జామియా మిలియా ఇస్లామియాతో పాటు నగరంలోని పలు సున్నితమైన ప్రాంతాల్లో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. పలుచోట్ల పరిస్థితిని సమీక్షించేందుకు డ్రోన్‌లను సైతం రంగంలోకి దించారు.

## రాజీవ్ యువ వికాసానికి రేషన్ కార్డు చాలు: మల్లయ్య బట్టు

%హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు తెలిపారు. దరఖాస్తు ముద్రణ కాపీలను ఎంపీడీవో కార్యాలయాల్లో ఇవ్వాలన్నారు.

## సన్నబియ్యం పంపిణీలో తేడా జరిగితే కఠిన చర్యలు: ఉత్తమ్

హైదరాబాద్: సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయమని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ పథకానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. దాదాపు 80 శాతం మంది పేదలు లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సన్నబియ్యం పంపిణీపై సమీక్షించారు. లబ్ధిదారుల ఇళ్లల్లో ప్రజాప్రతినిధులు భోజనం చేయాలన్నారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలో ఓ లబ్ధిదారుడి ఇంట్లో సీఎం భోజనం చేయనున్నట్లు తెలిపారు. పంపిణీలో అవకతవకలకు ఆస్కారం ఉండొద్దని, తేడా జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులంతా రేషన్ దుకాణాలను సందర్శించాలని కోరారు.



## మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వాహనం రిజిస్ట్రేషన్ 'రద్దు'



హైదరాబాద్: నగరంలో మైనర్ల డ్రైవింగ్ నియంత్రణకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనం యజమానులను కూడా బాధ్యులను చేయనున్నారు. మైనర్లు నడిపిన వాహనం రిజిస్ట్రేషన్ ఏడాది పాటు రద్దు చేస్తామని వెల్లడించారు. అలాగే, మైనర్లు 25 ఏళ్లు వచ్చేవరకు లైసెన్స్ పొందడానికి అనర్హులని తెలిపారు.

## పార్లమెంటులో 'మారథాన్' చర్చలివే



: వక్ఫ్ బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం పార్లమెంటు ఆమోదం లభించింది. తొలుత లోక్‌సభలో.. ఆ తర్వాత రాజ్యసభలో దీనిపై చర్చ జరిగింది. అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు.. విమర్శలు, ప్రతి విమర్శలతో ఇవి కొనసాగాయి. రాజ్యసభలో అర్ధరాత్రి దాటే వరకూ చర్చ జరగడం గమనార్హం. అయితే, ఇలా అనేక బిల్లులపై సుదీర్ఘ చర్చలు జరిపిన చరిత్ర మన పార్లమెంటుకు ఉంది. ఓ బిల్లుపై గతంలో 20గంటల పాటు ఏకధాటిగా లోక్‌సభలో చర్చ జరిగినట్లు మేధోసంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ వెల్లడించింది.

వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో 14 గంటలపాటు చర్చ జరగ్గా.. రాజ్యసభలో చర్చ ప్రారంభమైన మరుసటి రోజు ఉదయం 4.02 గంటల వరకు కొనసాగింది. మొత్తంగా పెద్దల సభలో 17గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగిందని, రాజ్యసభ చరిత్రలోనే ఇదో అరుదైన విషయమని ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. అయితే, 1981లో రాజ్యసభలో ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ బిల్లుపైనా ఉదయం 4.43 గంటల వరకు చర్చ కొనసాగినట్లు నివేదికలు చెబుతున్నాయి.

లోక్‌సభలో 'స్టేట్ ఆఫ్ అవర్ డెమోక్రసీ'పై గతంలో 20.08గంటల పాటు సాగిన చర్చే ఇప్పటివరకు సుదీర్ఘమైనది. ఆ తర్వాత 1993లో రైల్వే బడ్జెట్‌పై 18.35గంటల చర్చ జరిగింది. 1998లో రైల్వే బడ్జెట్‌పైనా 18.04 గంటలు, మైనార్టీల భద్రతకు సంబంధించి బిల్లుపై 17.25గంటలు, 1981లో ఎసెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ బిల్లుపై రాజ్యసభలో 16.58 గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది.

భారత శక్తి
VOICE OF INDIAN

# సజ్జలకు ఏమైంది...

నెల్లూరు ఏప్రిల్ 4,

వైసీపీ కీలక నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కొన్నాళ్లుగా తెరపైకి రావడంలేదు. నిన్న జరిగిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల మీటింగ్ లో కూడా సజ్జల లేరు. వైసీపీలో సహజంగా ఇలాంటి మీటింగ్ లను ఏర్పాటు చేసేది, నిర్వహించేది కూడా ఆయనే, కానీ తాడేపల్లిలో జరిగిన ఈ మీటింగ్ కి ఆయన హాజరు కాలేదు. కొన్నాళ్లుగా అస్సలు తాడేపల్లిలో జరిగే సమావేశాల్లో, బయట జగన్ పాల్గొనే కార్యక్రమాల్లో కూడా సజ్జల కనపడ్డం లేదు. అసలు సజ్జల ఎక్కడున్నారు, పార్టీ కార్యక్రమాలకు ఎందుకు హాజరు కావడంలేదు..వైసీపీ ఓడిపోయిన తర్వాత సజ్జలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆయన వల్లే పార్టీ ఓడిపోయిందని ఓ వర్గం విమర్శలు చేసింది. అయితే జగన్ ఈ మాటల్ని పట్టించుకోలేదు సరికదా సజ్జల ప్రయారిటీని ఆయన ఏమాత్రం తగ్గించలేదు. పార్టీ ఓడిపోయిన తర్వాత జరిగిన నిరసనలు, పార్టీ మీటింగ్ లలో కూడా సజ్జల కీలకంగా వ్యవహరించారు. దీంతో ఆయనను వేలెత్తి చూపించేవారు తర్వాతి కాలంలో సైలెంట్ అయ్యారు. ఇక సజ్జల తనయుడు భార్గవ్ రెడ్డికి పార్టీ సోషల్ మీడియా వింగ్ ని పూర్తిగా అప్పగించేయడం కూడా చాలామందికి ఇష్టం లేనట్టుగా ఉంది. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా చూపించి, జగన్ ని భ్రమల్లో పెట్టి వాస్తవాలు తెలియకుండా చేసి పార్టీకి నష్టం జరిగేలా చేశారంటూ సోషల్ మీడియా వింగ్ పై కూడా విమర్శలు వచ్చాయి. కానీ జగన్ పట్టించుకోలేదు. ఆ తర్వాత పోసాని అరెస్ట్, విచారణలో ఆయన చెప్పిన విషయాలు కొన్ని సజ్జలకు వ్యతిరేకంగా ఉన్నాయి. పార్టీ వీడిన సీనియర్ నాయకుడు విజయసాయిరెడ్డి కూడా జగన్ చుట్టూ కోటరీ ఉందని చేసిన ఆరోపణలు కూడా వైరల్ గా మారాయి. ఆ తర్వాతే సజ్జల పార్టీ వ్యవహారాలకు కాస్త దూరం జరిగినట్టు తెలుస్తోంది. పార్టీ తరపున వాయిస్ వినిపించే ఆయన కొన్నాళ్లుగా మీడియా ముందుకు రావడం లేదు. పార్టీ కార్యక్రమాల్లో కూడా కనపడ్డం లేదు. నిజంగానే జగన్ ఆయన్ను దూరం పెట్టారా లేదా అనేది తేలాల్సి ఉంది.ఒకవేళ తనకు తానే సజ్జల, జగన్ కి దూరంగా ఉన్నారా అనేది కూడా తేలాల్సి ఉంది. సహజంగా ఒక పార్టీలో ఇలాంటి ఆరోపణలు వస్తే.. కొన్నాళ్లు సదరు వ్యక్తి పార్టీకి దూరంగా ఉన్నట్టు సీన్ క్రియేట్ చేస్తారు. ప్రస్తుతం వైసీపీలో కూడా అదే జరుగుతోందా అనేది తేలాల్సి ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడ జగన్ ని అంటిపెట్టుకుని ఉన్న సజ్జల, 2024 ఓటమి తర్వాత కూడా కొన్నాళ్లు పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నారు. సడన్ గా ఇప్పుడు సైలెంట్ అవ్వడం వెనక ఏదో జరుగుతోందనే అనుమానం ఉంది. పరిస్థితులన్నీ చక్కబడిన తర్వాత ఆయన ఎంట్రీ ఇస్తారేమో తెలియాలి.కీలకమైన నేత కొన్నిరోజులుగా కనపడ్డం లేదు. సోషల్ మీడియాలో ఆయనపై వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై



పార్టీ నేతలెవరూ స్పందించకపోవడం విశేషం. ఉద్దేశపూర్వకంగానే వారు స్పందించడంలేదా, లేక వారికి కూడా సరైన సమాచారం లేదా అనేది తేలాల్సి ఉంది. గతంలో పార్టీ చేపట్టే కార్యకలాపాలు, నిరసనలు, ప్రెస్ మీట్లలో మాట్లాడాల్సిన అంశాలు.. ఇలాంటివన్నీ సజ్జల నుంచే బయటకు వచ్చేవి. కానీ ఇప్పుడాయన లేకపోయినా నేతలు మీడియా ముందుకొస్తున్నారు. మరి ఈ ఆదేశాలు ఇచ్చేది ఎవరు, ఎవరి డైరక్షన్లో ఇవన్నీ జరుగుతున్నాయి. నేరుగా జగన్ నేతలతో మాట్లాడే అవకాశం లేదు. కార్యక్రమాల గురించి కబురందించడానికి, వాటిని సమన్వయ పరచడానికి కీలక నేత ఒకరు ఉండాలి. సజ్జల లేనప్పుడు ఆ పని ఎవరు చేస్తున్నారు..? ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి..? మరికొన్నిరోజులాగితే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వక్ఫ్ సవరణలకు మోక్షం

వివాదాస్పద వక్ఫ్ బిల్లుకు పార్లమెంట్ లో ఆమోదం లభించింది. సుధీర్ఘ చర్చలు, వాదనల తర్వాత కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లున బుధవారం దిగువసభ ఆమోదించగా ఎగువ సభ గురువారం ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. రాజ్యసభలో ఈ బిల్లును కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశ పెట్టి చర్చ ప్రారంభించారు. కొందరు విపక్ష ఎంపీలు బిల్లుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి సభకు వచ్చారు. అయితే.. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని, ఏ ఒక్కరి మత విశ్వాసాలను దెబ్బతీసేలా నిబంధనలు ఈ బిల్లులో లేవని కేంద్ర మంత్రి చెప్పారు.సంక్లిష్టతలను తొలగించి, పారదర్శకత తీసుకురావడమే ప్రభుత్వం ఉద్దేశ్యమని అన్నారు. దీంతో పాటు.. వక్ఫ్ ఆస్తులకు సాంకేతికతను ప్రవేశపెట్టి.. బోర్డు పనితీరు మెరుగుపరుస్తామని చెప్పారు. అసలు ఈ బిల్లుకు, మతానికి ఎలాంటి సంబంధం లేదని అన్నారు కిరణ్ రిజూజు. 2004లో 4.9 లక్షలుగా ఉన్న వక్ఫ్ ఆస్తులు ఇప్పుడు 8.72 లక్షలకు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు నెరవేర్చని లక్ష్యాలను తాము నెరవేర్చడానికే ఈ బిల్లు తీసుకొచ్చామన్నారాయన. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ కూర్పుపై వ్యక్తమవుతున్న అనుమానాలకు కూడా ఆయన సమాధానం ఇచ్చారు. ముస్లిమేతరులు ఎక్కువమంది ఉంటారనే భయం అవసరం లేదని చెప్పారు.వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సమాజంలో మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి బీజేపీ ఈ బిల్లు తెచ్చిందని ఆరోపించింది. జేపీసీలో ప్రతిపక్షాలు చేసిన ఏ ఒక్క సిఫార్సును ఈ బిల్లులో ఎందుకు పెట్టలేదని నిలదీసింది కాంగ్రెస్ పార్టీ. ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చడమే ఈ బిల్లు ఉద్దేశ్యమని ఆరోపించింది. వక్ఫ్ బిల్లు ద్వారా ముస్లింలను విభజించడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. దేశంలో నెలకొన్న మతసామరస్యాన్ని దెబ్బతీయవద్దని మల్లిఖార్జున్ ఖర్గే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు.వక్ఫ్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. ఆ తర్వాత అక్కడ కూడా ఆమోదం పొందింది. దీంతో పార్లమెంటు ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించినట్టు అయింది. రాష్ట్రపతి సంతకం కోసం ఈ బిల్లులను ప్రభుత్వం పంపించనుంది.వక్ఫ్ సవరణ బిల్లుపై రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ముస్లింలను అణగదొక్కడం, వారి వ్యక్తిగత చట్టాలు, ఆస్తి హక్కులను ఆక్రమించుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ బిల్లు ముస్లింల హక్కులను కాలరాయడానికి వినియోగిస్తున్న ఆయుధంలా ఉందని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, దాని మిత్రపక్షాలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. ఇప్పుడు ముస్లింలపై జరుగుతున్న దాడి భవిష్యత్‌లో ఇతర వర్గాలపై కూడా జరగొచ్చని అన్నారాయన. వక్ఫ్ ట్రిబ్యునళ్ల నుండి ముస్లిం చట్టంలో నిపుణుడిని తొలగించడం వల్ల వక్ఫ్ సంబంధిత వివాదాల పరిష్కారంపై ప్రభావం పడవచ్చనే ఆందోళన కూడా ఉంది. అలాగే, ఈ బిల్లు కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాంను ఆచరించే వ్యక్తులకు మాత్రమే వక్ఫ్ ఇచ్చేవిధంగా పరిమితం చేస్తుంది. అలాంటి నిబంధన ఎందుకనేది మాత్రం అస్పష్టంగా ఉంది. ఈ విధానం వల్ల ఐదు సంవత్సరాల కంటే తక్కువ కాలం ఇస్లాంను ఆచరించే వ్యక్తులకు.. ఐదు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఉన్న వారికి మధ్య వ్యత్యాసాన్ని సృష్టిస్తుందని కొందరు అంటున్నారు.ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చెప్పే సమానత్వ హక్కును ఉల్లంఘించే అవకాశం వక్ఫ్ బోర్డ్ వద్ద మొత్తం 8.7 లక్షల స్థిర, చరాస్తులు ఉన్నాయి. వీటిలో 9.4 లక్షల ఎకరాల భూమి ఉంది. దీని మొత్తం విలువ రూ.1.2 లక్షల కోట్లు. అంత భారీ ఆస్తులున్న వక్ఫ్ బోర్డ్ విషయంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ చట్టానికి సవరణ తీసుకొస్తోంది. ఈ సవరణ విషయంలో ఇప్పుడు వివాదం నెలకొంది. సవరణ బిల్లు పార్లమెంట్ లో పాసయితే వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు వస్తాయి.ప్రస్తుతం అమలులో ఉన్న వక్ఫ్ చట్టాన్ని 1995లో రూపొందించారు. ఆ తర్వాత ఇప్పుడు సవరణ చేపట్టారు. వక్ఫ్ సవరణ బిల్లు -2024 పార్లమెంట్ ముందుకొచ్చింది. సవరణ బిల్లు పాసయితే ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందని ఆయా సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ప్రతిపక్షాలు కూడా ఈ బిల్లుని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.ఇస్లాం సంప్రదాయం ప్రకారం ముస్లిం సమాజ ప్రయోజనం కోసం చేసే దానాన్ని, ఇచ్చే విరాళాన్ని వక్ఫ్ గా పరిగణిస్తారు. వక్ఫ్ ఆస్తులు భగవంతుడికి చెందుతాయని వారు నమ్ముతారు. ఢిల్లీ సుల్తానులనుంచి వక్ఫ్ సంప్రదాయం మొదలైంది. ఆ తర్వాత దాన్ని కొనసాగిస్తున్నారు. వక్ఫ్ భూముల్ని.. మసీదులు, మదర్సాలు, షాదీమంజిల్ లు, అనాథ ఆశ్రమాలు, శ్మశాన వాటికలకోసం వినియోగిస్తున్నారు. అయితే వక్ఫ్ ఆస్తులు చాలా వరకు అన్యాక్రాంతం అయ్యాయనేది ప్రధాన ఆరోపణ. వక్ఫ్ బోర్డ్ సమర్థంగా వాటిని నిర్వహించలేకపోవడం వల్లే అవి అన్యాక్రాంతం అయ్యాయని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సచార్ కమిటీ వేసింది. ఆ కమిటీ నివేదిక ప్రకారం సుమారు 58,889 వక్ఫ్ స్థలాలు ప్రస్తుతం అన్యాక్రాంతంలో ఉన్నాయి. 13వేల ఆస్తులపై కోర్టు కేసులున్నాయి. ఇక 4.35 లక్షల ఆస్తుల గురించి తగిన సమాచారమే లేదు. సో.. ఇంత నష్టం జరుగుతున్నా చూస్తూ ఊరుకోవాలా అనేది ఎన్డీఏ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్న. వక్ఫ్ ఆస్తుల్ని పరిరక్షించేందుకు కొత్త చట్టం పనికొస్తుందని అంటున్నారు

# కొలిక్కి వస్తున్న పాస్టర్ ప్రవీణ్ కేసు

రాజమండ్రి ఏప్రిల్ 4

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చింది కానీ, ఇంకా పూర్తి కాలేదు. అది కేవలం ప్రమాదమా, లేక ఆయన మరణానికి ఇంకేదైనా కారణం ఉందా అనే విషయంలో పోలీసులు ఫైనల్ జడ్జిమెంట్ ఇవ్వలేదు. ఈలోగా రకరకాల వీడియోలు మీడియాలో, సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సీసీ టీవీ ఫుటేజీలు, ట్రాఫిక్ కానిస్టేబుల్ చెప్పిన మాటలు, టీస్టాల్ ఓనర్ చెబుతున్న మాటలు.. ఇలా ఇవన్నీ క్రోడీకరించి చూస్తే అది కేవలం ప్రమాదమే అనే విధంగా ఈ కేసుకి ఓ ముగింపు వచ్చే అవకాశం ఉంది.సీసీ కెమెరాల ఫుటేజీలను కూడా కొంతమంది నమ్మడం లేదు. అదే సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ చెప్పిన మాటల్ని కూడా కేఏపాల్ వంటి వారు నమ్మడం లేదు. ఒకవేళ ట్రాఫిక్ కానిస్టేబుల్ చెప్పిందే నిజమైతే, పాస్టర్ ప్రవీణ్ మద్యం మత్తులో ఉండి ఉంటే, ఆయన్ను అప్పుడే అరెస్ట్ చేసి ఉండాలి కదా అనేది పాల్ ప్రశ్న. డ్రంక్ అండ్ డ్రైవ్ అనేది నేరం కాబట్టి.. ఆయనను అరెస్ట్ చేసి ఉండాలని, బండి నడిపేందుకు అనుమతించకుడా ఉండాల్సిందని అంటున్నారు పాల్. ఒకవేళ అప్పుడే ప్రవీణ్ ని ట్రాఫిక్ కానిస్టేబుల్ వారించి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదు కదా అని అంటున్నారు పాల్. అది యాక్సిడెంట్ కాదు, ముమ్మాటికీ హత్యేనంటున్నారు పాల్.ప్రవీణ్ పగడాల మృతి విషయంలో నిజాలన్నీ బయటకు రావాలని డిమాండ్ చేస్తున్నారు కేఏపాల్. తాను సుప్రీంకోర్టులో కేసు వేస్తానంటున్నారాయన. ఏపీ హైకోర్టుకి వెళ్తానని, ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టులో ఈ విషయాన్ని రెయిజ్ చేస్తానని, సీబీఐ నుంచి ఎఫ్బీఐ దాకా విచారణ కోరతానని అంటున్నారు. తాను ఇవన్నీ చేయకముందే ఏపీ పోలీసులు నిజానిజాలు బయటపెట్టాలంటున్నారు. ప్రవీణ్ సొంత సోదరి చెప్పిన మాటలు కాకుండా, ఎవరో ట్రాఫిక్ ఎస్సై చెబితే అతను ప్రవీణ్ పగడాల అని నమ్మేస్తారా అని ప్రశ్నిస్తున్నారు పాల్.ఎన్ని సీసీ టీవీ ఫుటేజీలు వచ్చినా నమ్మేది లేదని అంటున్నారు మాజీ ఎంపీ హర్షకుమార్. హర్షకుమార్ ఆరోపణలపై ఇప్పటికే ఓసారి ఏపీ పోలీసులు వివరణ కోరారు. ఆయన ఆరోపణలకు ఆధారాలుంటే చూపాలన్నారు. సీసీ టీవీ ఫుటేజీ బయటకు వచ్చాక ఆందోళన చేస్తున్న చాలామంది వెనక్కు తగ్గారు. కానీ హర్ష కుమార్ మాత్రం ఆ సీసీ టీవీ ఫుటేజీలు అన్నీ ఫేక్ అని అన్నారు. కావాలనే ఈ కేసుని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.అయితే ప్రవీణ్ భార్య, ఆయన సోదరుడు మాత్రం ఈ కేసు విషయంలో బయట వ్యక్తుల ఇన్వెస్టిగేషన్ ఇక ఆపేయాలని సూచించారు. ప్రవీణ్ మరణాన్ని కొందరు తమ సొంత ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నారని అన్నారు. అలాంటి పనులు ఆపేయాలని కోరారు.ఇప్పటి వరకు విడుదలైన సీసీ టీవీ ఫుటేజీలన్నిటిలో ప్రవీణ్ కుమార్ మాస్క్ తోనే ఉన్నారు. ఆయన్ను చూసిన వారు కూడా మాస్క్ ఉండగా చూశారు కానీ, మాస్క్ లేకుండా ఆయన ముమ్మాటికీ ప్రవీణే అని చెప్పేవారు లేరు. పోనీ వైన్ షాప్ లో ఉన్న వీడియోలు ఫేక్ అనుకుందాం. కానీ ఆయన లారీని ఢీకొని కిందపడిపోయిన వీడియోని ఎవరూ రీక్రియేట్ చేయలేరు కదా. అలా చేస్తే వారి ప్రాణాలకే ముప్పు కదా. సో ఆ వీడియోలను మార్ఫింగ్ అని అంత తేలిగ్గా కొట్టిపారేయలేం. ఈ సంఘటనపై మరోసారి ఏపీ పోలీసులు క్లారిటీ ఇచ్చే వరకు ఈ వాద ప్రతివాదాలు జరుగుతూనే ఉంటాయి.

కోదాడలో 650, బెజవాడలో 872, ఏలూరులో 350 ఫోన్ పే

పాస్టర్ ప్రవీణ్ పగడాల కేసులో పోలీసులు చిక్కుముడులు విప్పుతున్నారు. ఈ కేసులో పక్కా సాక్ష్యాలతోనే మీడియా ముందుకు వస్తున్న ఏపీ పోలీసులు.. అతను హైదరాబాద్ నుంచి బయల్దేరిన దగ్గరి నుంచి మరణించే వరకు ఎక్కడెక్కడ ఆగాడు అనే విషయాలు అన్నిటికి సమాధానాలను సీసీ కెమెరా ఫుటేజ్ తో చెప్పేస్తున్నారు. విజయవాడలో ప్రవీణ్ 4 గంటల సేపు ఆగిన విషయాన్ని బయటపెట్టిన పోలీసులు.. అతను ఎక్కడ ఉన్నాడు అనే విషయాలను ఫొటోలు, వీడియోలతో సహా చూపించారు.రాజమహేంద్రవరం చేరుకోవడానికి ముందు ప్రవీణ్ విజయవాడలో ఆగాడని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించిన తర్వాత.. దానిపై పోలీసులు సాంకేతిక ఆధారాలను బయటకు తీసే ప్రయత్నం చేసారు. సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా ప్రవీణ్ ప్రతి కదలికను పోలీసులు బయటపెట్టారు. విజయవాడ, రాజమహేంద్రవరం పోలీసులు మొత్తం 300 కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.అతను విజయవాడలో మద్యం కొన్నాడు అని గుర్తించారు. అంతకంటే ముందే కోదాడలో మద్యం కొన్నట్టు తేల్చేసారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరాడు. అదేరోజు మధ్యాహ్నం సమయంలో కోదాడలోని మద్యం దుకాణంలో రూ.650తో మద్యం సీసా కొనుగోలు చేసి, ఫోన్‌పే ద్వారా చెల్లించాడు అని సాక్ష్యాలను సేకరించారు. ఇక ఏపీలోకి అడుగు పెట్టడానికంటే ముందే అతను మద్యం తాగినట్టు గుర్తించారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల-పరిటాల మధ్య అదుపుతప్పి పడిపోవడంతో బుల్లెట్ హెడ్‌లైట్ పగిలింది. అలాగే బండికి ఉన్న బంపర్ కూడా వంగింది. ప్రవీణ్ చేతులకు కూడా గాయాలయ్యా యి.ఆ తర్వాత విజయవాడ రూరల్ గొల్లపూడిలో పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయిన్చుకున్నాడు. అప్పటికే అతను మాట్లాడలేని పరిస్థితిలో.. ఉండి అక్కడి సిబ్బందికి సైగలు చేసాడు. ఈ విషయాన్ని బంకు సిబ్బంది పోలీసులకు తెలిపారు. అతను 8 వేళ్ళు చూపించగా? రూ.800కు పోయమంటారా అని సిబ్బంది మళ్లీ అడగగా.. కాదు అని తల ఊపాడు. ఎనిమిది లీటర్లు పోయమంటారా అంటే అడిగితే అవునని సంకేతం ఇస్తూ తల పైకి, కిందకు ఊపారట. దీనికి సంబంధించిన డబ్బులను కూడా అతను రూ.872 ఫోన్ పే చేశాడు.అక్కడికి వచ్చే సమయానికే అతని చేతులకు గాయాలు ఉన్నాయని.. బుల్లెట్ హెడ్‌లైట్ ఊడిపోయి ఉందని బంకు సిబ్బంది పోలీసులకు తెలిపారు. పెట్రోల్ బంకు సీసీ కెమెరాల ఫుటేజీని పెట్రోల్ బంక్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకుని విచారించారు. ఆ తర్వాత ఆయన జాతీయ రహదారిపై దుర్గగుడి ఫ్లై ఓవర్, రాజీవ్‌గాంధీ పార్కు, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ మీదుగా బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ ఎక్కి మహానాడు జంక్షన్‌కు చేరుకున్నాడు ప్రవీణ్. ఆ మార్గంలోని అన్ని సీసీ కెమెరాల్లో ప్రవీణ్ బుల్లెట్‌పై వెళ్తున్న దృశ్యాలు పోలీసులకు కనిపించాయి. మహానాడు కూడలి దాటాక రామవరప్పాడు రింగ్ వస్తుంది.ఇక్కడ సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు ప్రవీణ్ కనిపించలేదు. దీనితో ఈ సమయంలో ఏదో జరిగిందని అనుమానించిన పోలీసులు.. రామవరప్పాడు రింగ్‌కు పది మీటర్ల దూరంలోనే వోక్స్ వ్యాగన్ షోరూమ్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై బుల్లెట్‌పై నుంచి ఆయన పడిపోగా అక్కడ ఉన్న ఆటో డ్రైవర్లు అతడిని గుర్తించి అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావుకు విషయం చెప్పగా.. ఆయన అక్కడికి చేరుకొని.. పక్కన ఉన్న రెయిలింగ్ వద్ద కూర్చోబెట్టారు. ఆ తర్వాత పాస్టర్‌ను ఎస్ఐ నెమ్మదిగా నడిపించుకుంటూ వచ్చారు.బుల్లెట్‌ను ఆటోడ్రైవర్లు తోసుకుంటూ రింగ్ వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్ దగ్గరకు తీసుకోవచ్చి.. ముఖం కడుక్కోవడానికి ఆయనకు ట్రాఫిక్ ఎస్ఐ నీళ్లు ఇవ్వగా.. ఆ తర్వాత బూత్ ఎదురుగా ఉన్న గడ్డిలో రాత్రి 8.20 గంటల వరకు పాస్టర్ నిద్రపోయాడు. ఆ తర్వాత మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని ఎస్ఐ కౌన్సెలింగ్ ఇవ్వగా.. తర్వాత ఇన్నోటెల్ హోటల్ పక్కన ఉన్న టీస్టాల్ వద్దకు తీసుకెళ్లి టీ తాగించారు. టీ తాగిన తర్వాత ప్రవీణ్ బుల్లెట్‌పై ఏలూరు వైపు బయల్దేరి వెళ్ళగా.. ట్రాఫిక్ ఎస్ఐ వద్దని వారించినా ఆయన ఆగలేదు.అతను ట్రాఫిక్ ఎస్ఐతో కలిసి టీ తాగడానికి వెళ్లడం, తిరిగి ట్రాఫిక్ బూత్ వద్దకు వచ్చిన దృశ్యాలు ఇన్నోటెల్ హోటల్ సీసీ కెమెరాల్లో రికార్డు కాగా వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇక ఆ తర్వాత టోల్‌గేట్లు దాటుకుని ఏలూరు చేరుకున్నాక అక్కడ టానిక్ వైన్స్‌లో మద్యం కొని, రూ.350 ఫోన్‌పే చేసినట్టు గుర్తించారు. అక్కడి వీడియోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక ప్రయాణానికి పక్కా ఏర్పాట్లతోనే అతను బయల్దేరాడు. తలకు జావా కంపెనీ హెల్మెట్, కాళ్లకు తెలుపు రంగు బూట్లు, బుల్లెట్‌కు వెనుక ఒక బ్యాగ్ పెట్టుకుని బయల్దేరాడు.విజయవాడ వచ్చే వరకు చాలా చోట్ల ఆగినా సరే హెల్మెట్ తీయలేదు. రామవరప్పాడు రింగ్ సమీపంలో పడిన సమయంలో.. అతను ఎవరు అనేది ట్రాఫిక్ పోలీసులకు తెలియదు. బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిపోయి వైరుతో వేలాడుతూ ఉండడం, సేఫ్టీ రాడ్లు వంగిపోవడం, చేతులకు కొట్టుపోయినట్టుగా గాయాలు ఉండటం, హెల్మెట్‌కు సొట్ట పడటంతో వీడియోలు, ఫొటోలు తీసారు. హెల్మెట్ అవగాహన కోసమే తాను ఫొటోలు తీసాను అని ఎస్సై వివరించారు.

సీసీ కెమెరాలు చూపించిన సమయాలు ఒకసారి చూస్తే..

24వ తేదీ సాయంత్రం 4.45 గంటలకు ప్రవీణ్ గొల్లపూడిలో పెట్రోలు బంక్‌కు చేరుకున్నారు.

5.13 గంటలకు మహానాడు కూడలిలో జాతీయ రహదారిపై సీసీ కెమెరాలో కనిపించారు.

5.30 గంటలకు పోలీసులు రామవరప్పాడు రింగ్ వద్ద ట్రాఫిక్ బూత్ వద్దకు తీసుకొచ్చారు.

5.30- 8.20 గంటల వరకు బూత్ ఎదురుగా గడ్డిలో నిద్రపోయారు.

రాత్రి 8.47 గంటలకు రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు వైపు వెళ్లారు.

# సెకండ్ క్యాడర్ పైనే దృష్టంతా..

ఏలూరు, ఏప్రిల్ 4,

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ఇప్పుడు అసలు నాయకులకంటే కొసరు నాయకులే కీలకంగా మారినట్లు కనిపిస్తుంది. పెద్ద పెద్ద నేతలు పార్టీ ఓటమి పాలయిన నాటి నుంచి రోడ్డు మీదకు రావడానికి భయపడుతున్నారు. జగన్ హయాంలో మంత్రి పదవులను పొందిన వారు సయితం పార్టీ ఓడిపోయిన తర్వాత మాత్రం అందుబాటులో లేకుండా పోయారు. గత ఎన్నికల్లోనూ టిక్కెట్లు పొందిన వారిలో కొందరు మాత్రమే యాక్టివ్ గా ఉంటున్నారు. మిగిలిన వారంతా మౌనంగానే ఉంటున్నారు. సీనియర్ నేతలు అని భావించిన వారు సయితం పార్టీ కోసం ముందుకు రాకపోవడంతో వైసీపీ పని ఇక అయిపోయినట్లేనని అందరూ అనుకుంటున్న సమయం వచ్చేసింది. అయితే ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నేతలు బలంగా నిలబడి పదవులను సాధించుకోవడంతో తిరిగి ఫ్యాన్ పార్టీ రైజ్ అవుతుందన్న అంచనాలు వినపడుతున్నాయి. దీంతో పాటు తాము మరోసారి అధికారంలోకి వస్తే ఖచ్చితంగా ఈ సారి క్యాడర్ కు పూర్తి బాధ్యతలతో పాటు పదవులను కట్టబెడతానని జగన్ ఇస్తున్న హామీలు వర్క్ అవుట్ అవుతున్నట్లే కనపడుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ క్యాడర్ లో కొంత అసంతృప్తి అయితే నెలకొంది. అధికారంలో ఉన్ననాళ్లు తమను పట్టించుకోకపోవడంతో పాటు ఎమ్మెల్యేలు కూడా పవర్ లో ఉన్నప్పుడు క్యాడర్ ను పూర్తిగా విస్మరించడంతో ఐదేళ్ల పాటు జెండా కూడా పట్టుకోలేదు. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు వాలంటీర్లకే ప్రాధాన్యత ఇచ్చిన జగన్ క్యాడర్ ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వీర్యం చేశారు. పోలింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చి పార్టీకి అనుకూలంగా ఓటు వేయించడంలో కీలక పాత్ర పోషించే క్యాడర్ తో జనానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అందుకే గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద క్యాడర్ నిలబడలేదు. వాలంటీర్లను నమ్ముకున్న జగన్ నిలువునా మునిగిపోయారు. ఓటమి తర్వాత విషయం అర్థం కావడంతో జగన్ నష్ట నివారణ చర్యలుచేపట్టారు. తనకు కార్యకర్తలు ముఖ్యమని చెబుతూ ఈసారి అధికారంలోకి వస్తే ఖచ్చితంగా వారికి ప్రయారిటీ ఇస్తామని చెబుతూ కొంత వరకూ గాడిలో పెట్టగలిగారు. ప్రస్తుతం నేతలకంటే క్యాడర్ రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారుక్యాడర్ బయటకు వస్తుండటంతో నేతలు కూడా ఇక ఇళ్లు వదిలి బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్ కూడా త్వరలోనే జిల్లాలు, నియోజకవర్గాల వారీగా ముఖ్యమైన కార్యకర్తలతో సమావేశం జరిపి వారి ఫీడ్ బ్యాక్ మేరకు వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం కనిపిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జగన్ అధికారంలోకి వస్తే వాలంటీర్ల వ్యవస్థను తిరిగి తీసుకు వచ్చినా కార్యకర్తల విషయంలో మాత్రం ఈసారి నిర్లక్ష్యం చేయకూడదని నిర్ణయించుకున్నారు. క్యాడర్ ఎంత అవసరమో ఇప్పుడు జగన్ కు తెలిసి వచ్చింది. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కనపడని క్యాడర్ దిగిన తర్వాత మాత్రం వారే దిక్కుయినట్టు కనిపిస్తుంది.

# మచ్చలేని నిస్వార్థ నాయకుడు బాబూ జగ్జీవన్ రామ్

-నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

బాబూ జగ్జీవన్ రామ్ ది ఐదు దశాబ్దాల రాజకీయ జీవితం.. మూడు దశాబ్దాల పాటు కేంద్ర మంత్రి? ఎన్నికల్లో ఓటమి ఎరుగని ధీరుడు,,. దళితుల హక్కుల కోసం పోరాడిన యోధుడు? వివక్ష వ్యతిరేక పోరాటంలో అంబేద్కర్ కు సరిసమానుడు? ఆయనే బాబూ జగ్జీవన్ రామ్.

బాబూజీగా అందరూ పిలుచుకునే జగ్జీవన్ రామ్.. 1908 ఏప్రిల్ 5న బీహార్ లోని చాంద్వాలో జన్మించారు. స్కూలు స్థాయిలోనే.. దళితుగా వివక్షను ఎదుర్కొన్నారు. దీంతో.. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితాన్ని దళితుల హక్కుల కోసమే అంకితం చేశారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో, సామాజిక ఉద్యమాల్లో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా పోరాడారు. పార్లమెంటరీ సెక్రటరీ స్థాయి నుంచి? దేశ ఉప ప్రధాని వరకు అనేక పదవులు నిర్వహించారు. మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర మంత్రివర్గంలో కొనసాగారు. అణగారిన కులాలకు ఓటు హక్కు కోసం, కనీస వేతన చట్టం అమలు కోసం ఆయన కృషి చేశారు. విద్యార్థి దశనుంచే గాంధీజీ అహింసా మార్గాన్ని ఫాలో అయ్యారు జగ్జీవన్ రామ్. 1930లో.. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. 27 ఏళ్ల వయసులోనే 1935 లో.. బీహార్ శాసనమండలి సభ్యుడిగా



పొలిటికల్ కెరీర్ ను ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి ముందు ఏర్పడిన నెహ్రూ ప్రభుత్వంలో.. యంగెస్ట్ మినిస్టర్ గా ఉన్నారు. తర్వాత తొలి కేబినెట్ లో లేబర్ మినిస్టర్ గా పనిచేశారు. 1947లో జెనీవాలో? ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. 1971లో భారత్-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా ఉన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలో హరిత విప్లవం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ కు, ఇందిరాగాంధీకి విధేయుడిగా ఉన్నారు జగ్జీవన్ రామ్. ఎమర్జెన్సీ సమయంలో ఇందిరాగాంధీని సపోర్ట్ చేశారు. 1977లో కాంగ్రెస్ ను విడిచిపెట్టి కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ పార్టీని స్థాపించారు. తర్వాత దాన్ని జనతా పార్టీలో విలీనం చేశారు. 1977 నుంచి 79 వరకు మొరార్జీ దేశాయ్ హయాంలో ఉపప్రధానిగా పనిచేశారు. తొలి దళిత ఉప ప్రధానిగా రికార్డు సృష్టించారు. 1936 నుంచి 1986 వరకు పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగి.. వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేశారు. 30 ఏళ్ల పాటు కేంద్ర మంత్రిగా పనిచేయడం కూడా ఒక రికార్డే. ఎన్ని పదవులు అలంకరించినా? ప్రధాని పీఠాన్ని ఎక్కాలన్న ఆయన కల.. కలగానే మిగిలిపోయింది. చేతికి అందినంత దగ్గరకు వచ్చి.. అంతలోనే పీఎం పోస్టు దూరమైంది. 1979లో.. లోక్ సభలో అవిశ్వాస తీర్మానంతో ప్రధాని పదవి నుంచి మొరార్జీ దేశాయ్ బలవంతంగా తప్పుకోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఉప ప్రధానిగా ఉన్న జగ్జీవన్ రామ్.. ప్రధాని అవుతారని అందరూ భావించారు. అయితే.. కొన్ని కారణాలతో చరణ్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయ్యారు. జనతాపార్టీకి పార్లమెంటరీ పార్టీ నేతగానే జగ్జీవన్ రామ్ మిగిలిపోయారు. 78 ఏళ్ల వయసులో.. 1986 జులై 6న జగ్జీవన్ చనిపోయారు. 50 ఏళ్లకు పైగా రాజకీయ జీవితంలో.. మచ్చలేని నాయకుడుగా పేరున్న ఆయన నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం. నిర్ణయాల్లో పరిపక్వత, కష్టాల్లో మొక్కవోని ధైర్యం, చర్చల్లో మేధావితనం వంటి లక్షణాలే జగ్జీవన్ రాంను విలక్షణ నాయకుణ్ణి చేశాయి. ప్రత్యర్థులతో సైతం ఆకట్టుకోగల రాజనీతజ్ఞత, తర్కం, విషయ పరిజ్ఞానం ఆయన సొంతం. దళితులు జనజీవన స్రవంతికి దూరం కావడానికి ఇష్టపడని జగ్జీవన్ రామ్ సమానత్వం కోసం చివరి వరకు పోరాడిన యోధుడుగా చరిత్రలో నిలిచిపోయారు.

## నాగ సముద్రాల మోడల్ స్కూల్ లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం

కోహెడనాగ సముద్రాల మోడల్ స్కూల్ లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. స్కూల్ లో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి,మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, గాంధీ జ్ఞాన్ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, ఆర్డీవో, ఎమ్మార్వో , ఎంపిడిఓ, ఎంఈవో తదితర అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో బతకాలంటే మూడు అంశాల పై పట్టు ఉండాలి. స్పీకింగ్ స్కిల్స్ మాట్లాడే నైపుణ్యం కలిగి ఉండాలి. రైటింగ్ స్కిల్స్ ఉండాలి. డ్రాఫ్ట్ బాగా రాయగలగాలి. సమస్య వచ్చినప్పుడు ఎలా ఉండాలి అని సమయస్ఫూర్తి కలిగి ఉండాలి. అబ్దుల్ కలాం చెప్పినట్టు కలలు కని వాటిని నిజం చేసుకోండి. స్వాతంత్ర్య పోరాటంలో ప్రజాస్వామికంగా అహింసా పద్ధతిలో ఉద్యమాన్ని నడిపిన బాపూజీ మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని అన్నారు.

విగ్రహాల నుండి మనం స్ఫూర్తి పొందాలి అది మనం సన్మార్గంలో నడవడానికి ఉపయోగపడుతుంది. దానిని భవిష్యత్ జీవితానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోని ముందుకు పోవాలి. గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేస్తున్నాం. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది అందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు 32 మండలాలకు 29 మోడల్ స్కూల్స్ తెచ్చిన.మోడల్ స్కూల్ లో సమస్యలు అన్ని పూర్తి చేస్తాం వాటర్ ప్లాంటు ఏర్పాటు చేస్తాం.

# సొంత టీమ్ ఏర్పాటు చేసే పనిలో లోకేష్

గుంటూరు, ఏప్రిల్ 4,

టీడీపీ అధినేత, చంద్రబాబు నాయుడు త్వరలో 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఆయన వయసు?80 ఏళ్లకు దగ్గర పడుతాయి. 2029 ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తారో లేదో తెలియదు. శరీరం సహకరిస్తే పోటీ చేసే ఛాన్స్ లేకపోలేదు. చంద్రబాబు వయసు దృష్ట్యా?తెలుగుదేశం పార్టీ బలోపేతంపై నారా లోకేశ్ ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీ మొత్తం లోకేశ్ చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఇప్పటికే తెరవెనుక పార్టీకి అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఎంపిక? ఆ తర్వాత కేబినెట్ కూర్పులోనూ లోకేశ్ ముద్ర స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత ఎమ్మెల్సీల ఎన్నిక?నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ లోకేశ్ చెప్పిన వారికి పదవులు వరించినట్లు పార్టీలో చర్చ నడుస్తోంది. అటు ప్రభుత్వంలో?ఇటు పార్టీలో లోకేశ్ చెప్పిందే సాగుతోంది. ప్రస్తుతం పార్టీలో లోకేశ్ కు ఎదురు చెప్పే నేతలే లేరు.2029 ఎన్నికల నాటికి పార్టీలోని పలువురు సీనియర్లకు ఉద్వాసన పలకాలని లోకేశ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. సుదీర్ఘకాలం పార్టీలో ఉండి?అనేక పదవులు అనుభవించిన నేతలను పక్కన పెట్టాలని ఓ అంచనా వచ్చినట్లు పార్టీ వర్గాలు కోడై కూస్తున్నాయి. 2029 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వీలయినంత ఎక్కువ మంది యువకులకు టికెట్లు ఇచ్చేందుకు మంత్రి లోకేశ్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాల వారీగా నేతలను ఎంపిక చేసుకున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు కొత్త ముఖాలకు చోటు కల్పించి?తన మార్క్ ను చూపించుకున్నారు. 2029 ఎన్నికల నాటికి పూర్తి తన ప్రభావం ఉండేలా?ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు మంత్రి లోకేశ్. గత ఎన్నికల్లో అనేక మంది యువతకు టికెట్లు ఇచ్చారు. అందులో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీశ్ మాథుర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, భూమా అఖిలప్రియ, పుత్తా చైతన్య రెడ్డి, టీడీపీ ఐటీ సెల్ ఇన్ చార్జ్, అయ్యన్నపాత్రుడు



తనయుడు విజయ్ పాత్రుడు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది నేతలు ఉన్నారు.మంత్రి అచ్చెన్నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దేవినేని ఉమా లాంటి వారికి?2029లో టికెట్లు ఇచ్చే ఛాన్స్ లేదని సమాచారం. మాజీ మంత్రి యనమలకు?ఆయన కూతురు, అల్లుడి చేసిన ఘనకార్యాలతో చెక్ పెట్టేశారు. దానికి తోడు ఆయన లేఖ రాసి సెల్ఫ్ గోల్ వేసుకున్నారు. ఇదే సమయంలో వయసు మీద పడిన నేతలతో పాటు వరుసగా పదవులు అనుభవించిన నేతలను లోకేశ్ గుర్తించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా సీనియర్ నేతలను?వచ్చే ఎన్నికల్లో దూరం పెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీలో వరుసగా మూడుసార్లు పదవులు అనుభవించిన వారికి?2029 ఎన్నికల్లో టికెట్లు దక్కకపోవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నారు. సీనియర్ నేతల అవినీతి, అక్రమాలపై నివేదికను తెప్పించుకున్నారట లోకేశ్. సుదీర్ఘ కాలంగా పాటు పార్టీలో ఉన్న వారి స్థానంలో కొత్త నేతలు, యువకులకు టికెట్లు ఇవ్వాలని నారా లోకేశ్ ఓ అంచనా వచ్చేసినట్లు తెలుస్తోంది.

# పార్టీకి తలనొప్పిగా మారిన కొలికపూడి

విజయవాడ, ఏప్రిల్ 4,

టీవీ డిబేట్లు చూసి ఎమ్మెల్యే టికెట్లు ఇస్తే ఇలాగే ఉంటుంది. టీవీల్లో ఊకదంపుడు ప్రసంగాలు, సవాళ్లు చూసి ఇంతకంటే పోటుగాడు దొరకడు అనుకోని కొలికిపూడి శ్రీనివాసరావుకి కృష్ణాజిల్లా తిరువూరు టికెట్ ఇచ్చి గెలిపించుకున్నారు చంద్రబాబు. అదే కొలికపూడి తిరువూరులో అందరినీ కెలికి కెలికి వదిలి పెడుతున్నాడు. కూటమి గెలిచిన 164 నియోజకవర్గాల్లో ఎక్కడ ఇలాంటి తలకుమాసిన వ్యవహారాలు చంద్రబాబుకు ఎదురు కాలేదు. ఒక్క తిరువూరు పేరు చెప్తే మాత్రం పార్టీలో అందరూ అమృతాంజనం బాటిల్స్ అందుకుంటున్నారు. అలా చెలరేగిపోయి సీఎం దగ్గర్నుంచి అందరికీ తలనొప్పిగా మారిపోయాడు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.చెప్పింది చేయకపోతే?. రాజీనామా చేసి పారేస్తా ఏదో ఒకటి తేల్చుకొని చెప్పండి అంటూ 40 ఇయర్స్ చంద్రబాబుకే డెడ్ లైన్ ఇచ్చిన ఏకైక ఎమ్మెల్యే కొలిక పూడి. చివరికి విసిగిపోయిఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారంలో చంద్రబాబు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్టు తెలుస్తోంది ప్రతిసారి తిరువూరులో పార్టీకి సంబంధించి తలెత్తే వివాదానికి ఎమ్మెల్యే ప్రధాన కారణం కావడంతో సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే రెండు మూడుసార్లు ఎమ్మెల్యే తీరు మారుతుందని ఎదురుచూసినా ఎమ్మెల్యే తీరు మారకపోగా మరింత వివాదాస్పదంగా వ్యవహరించటంతో చంద్రబాబు సీరియస్ గా తీసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇకపై ఆయన విషయంలో వేచి చూసే ధోరణిలో ఉండకూడదనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్టుగా పార్టీ వర్గాల మాట.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ విషయంలో పార్టీ అధిష్టానం ఇక ఉపేక్షించకూడదని నిర్ణయానికి వచ్చినట్టుగా తెలుస్తోంది నియోజక వర్గం లో పార్టీ నేత మాజీ ఏఎంసీ చైర్మన్ రమేష్ రెడ్డిని పార్టీ నుండి సస్పెండ్ చేయకపోతే 48 గంటల్లోగా రాజీనామా చేస్తానని కొలికపూడి అల్టిమేటం జారీ చేయడం రాజకీయ చర్చకు దారితీసింది దీనితోపాటు కులానికి ఒక న్యాయం పార్టీ చేయటం ఏంటనీ బహిరంగంగానే కోలిక పూడి చేసిన విమర్శలు పార్టీ అధిష్టానానికి ఆగ్రహం తెప్పించాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలను ఎమ్మెల్యే బహిరంగంగా మాట్లాడటం, పార్టీ అధిష్టానానికి డెడ్లైన్ పెట్టడం, పార్టీపై నేరుగా విమర్శలు చేయడం అధిష్టాన సీరియస్ గా తీసుకుంది.ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి కూడా కొలకపూడి శ్రీనివాస్ వల్ల పార్టీ క్యాడర్ ఇబ్బందులు పడటంతో పాటు పార్టీ నాయకత్వం కూడా పలు విధాలుగా ఇబ్బంది పడుతుందని విషయాన్ని చంద్రబాబు దృష్టికి పార్టీ నేతలు



తీసుకెళ్లారు ఇప్పటికే పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు ఆయన వల్ల జరిగిన వివాదాస్పద ఘటనలు పార్టీకి జరిగిన డ్యామేజ్ అన్ని అంశాల పైన పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఎంపీ కేసీనేని చిన్ని అబ్జర్వర్లతో కూడిన కమిటీ చంద్రబాబుకి పరిస్తితి వివరించింది. పార్టీని గెలిపించిన కార్యకర్తల మనోభావాలకు అనుకూలంగా పనిచేయాల్సి ఉందని సభ్యులతో సీఎం అన్నారు. పార్టీ క్యాడర్, కమిటీ సభ్యుల నుండి వచ్చిన ఫిర్యాదులు అన్నిటిని పరిశీలించి కొలికపూడి విషయంలో ఓ నిర్ణయం తీసుకునే ఆలోచనలో అధినేత చంద్రబాబు ఉన్నట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.తిరువూరు నియోజకవర్గానికి చెందిన నేతలు పెద్ద ఎత్తున రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావును కలిసి కోలికపూడి శ్రీనివాస్ వల్ల తాము నియోజకవర్గంలో పడుతున్న ఇబ్బందులను వివరించారు ఆయనకి ప్రత్యామ్నాయంగా నియోజకవర్గంలో ఇన్చార్జిని ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే టిడిపి శ్రేణులను కేడర్ను పట్టించుకోవడంలేదని వైసిపి నాయకులతో కలిసి పని చేస్తున్నారని కులాల వారీగా క్యాడర్ను విభజించి తమ మధ్య వైషమ్యలు ల్యాలు సృష్టిస్తున్నారని కొలికపూడిపై ఫిర్యాదు చేశారు అధిష్టానం తరపున నియోజకవర్గంలో ఒక సమన్వయ కమిటీని కేడర్ కోసం ఏర్పాటు చేయటం పరిశీలించాలని రాష్ట్ర అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాస్ ను కోరారు.

తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులు తాను తెప్పించుకున్న నివేదిక అంశాలు అన్నిటిని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామని పల్లా పార్టీ క్యాడర్కు హామీ ఇచ్చారు దీంతో కొలుకుపూడి శ్రీనివాస్ కు గట్టి వార్నింగ్ ఇవ్వటానికి అధిష్టానం సిద్ధమవుతున్నట్టుగా పార్టీ వర్గాల నుంచి ప్రచారం జరుగుతుంది.లేదా కొలికపోటుకు ప్రత్యామ్నాయంగా ఏమన్నా తిరువూరులో పార్టీ క్యాడర్ కోసం చర్యలు చేపట్టే అవకాశాలు ఉంటాయా అనేది కూడా చర్చ జరుగుతుంది.

# నాసిరకం బియ్యం సరఫరా... ప్రజల మండిపాటు

మండపేట

మండపేట లో ఈ నెల సరఫరా చేసిన పి డీ ఎఫ్ బియ్యం నాసిరకం గా వుందని ప్రజలు ఆరోపించారు. మండపేట 11 వ వార్డు లో ఏప్రిల్ నెల లో సరఫరా చేసిన కోటా బియ్యం కడిగితేనే నూక మాదిరి తయారు అవుతుందని అక్కడి స్థానికులు ఆరోపించారు. ఆ వార్డు కు చెందిన చంద్రు సత్యనారాయణ ఆ బియ్యాన్ని కడిగి మీడియా కు చూపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన బియ్యం ఇచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ సారి కొత్త బియ్యం సరఫరా చేశారని నాణ్యత లేని బియ్యం పేదలకు సరఫరా చేశారని మండి పడుతున్నారు. బియ్యం సరఫరా వాహనం వద్దే అమ్ముకునే వారికి డబ్బులు వచ్చేస్తున్నాయని, పేదలు మధ్యతరగతి ప్రజలకు ఇదే అన్నం అని అవేదన వ్యక్తం చేశారు. బియ్యం నీటి లో కడిగిన వెంటనే నూక మాదిరి గా అవుతుంది. బియ్యం ముద్దగా ఉడుకుతుంది. దీంతో తినే అవకాశం లేకుండా పోతుందని చెబుతున్నారు. నాణ్యత పరిశించాల్సిన అధికారులు తీరు ను ప్రశ్నిస్తున్నారు. పేదల బియన్ని యదేచ్చగా బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న పట్టించుకోవడం లేదని విమర్శలు వున్నాయి. దీనిపై పౌర సరఫరాల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే నెల లో అయినా నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాల కీలక పాత్ర

## మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వ

### చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు

దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, జాతీయ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు,చిత్తూరు పార్లమెంటు సభ్యులు

దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ఈ నేపథ్యంలోనే..

మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీ పార్లమెంటులో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలకు హాజరైన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు..., గురువారం లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో స్వయం సహాయక పొదుపు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, ఉపాధి అవకాశాలు.., దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు పోషిస్తున్న కీలక పాత్ర..గత ఐదేండ్లతో పాటు ఈ సంవత్సరానికి సంబంధించిన వివరాలను కేంద్ర మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి తోహన్ సాహును అడిగి తెలుసుకునే ప్రయత్నం చేసారు. దీనికి సంబంధిత శాఖ సానుకూలంగా స్పందించడమే కాకుండా ..,తాను కోరిన అంశానికి సంబంధించి వివరాలను కూడా లిఖిత పూర్వకంగా అందజేసినట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మీడియాకు వెల్లడించారు. స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలను అన్ని రకాల ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని ఆయన తెలియజేశారు. మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్కు అధిక ప్రాధాన్యత ఇస్తూ.. మహిళలను మహారాణులుగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. అన్ని రకాల రాణిస్తూ.. నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.., సమాజంలో తామేంటో రుజువు చేస్తున్న.. స్వయం సహాయక పొదుపు సంఘాల ద్వారా భారత సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే ధ్యేయంతో పనిచేస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మహిళల శ్రేయస్సు కోసం సంస్కరణలు తీసుకొచ్చి చేయూతనిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మానసపుత్రికగా కొనియాడబడుతున్న స్వయం సహాయక పొదుపు సంఘాలకు ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అందరికీ తెలిసిన విషయమని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు..., చంద్రబాబు నాయుడు కలలను సాకారం చేసే దిశగా కేంద్రం ప్రభుత్వం ఈ బడ్జెట్లో కెటాయింపులు జరపడం ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సితారామన్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారాయన.

# పక్కా ప్లాన్ తో సీబీఎన్

విజయవాడ, ఏప్రిల్ 4,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రస్తుతం రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం సహకారం అవసరం. అందుకే గతంలో ఎన్డీఏతో విభేదించి అనేక సార్లు బయటకు వచ్చినప్పటికీ ఈ సారి మాత్రం అలాంటి సాహసానికి దిగే అవకాశాలు కనిపించడం లేదు. రాష్ట్రం ఎటు చూసినా ఇబ్బందుల్లో ఉంది. ఇటు రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండటం చంద్రబాబు ప్రధాన లక్ష్యం. ఈ రెండు అంశాలు ఒడ్డున పడాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అవసరం. అవసరమైన నిధులతో పాటు రుణాలు కూడా పొందేందుకు కేంద్రం నుంచి సహకారం లభిస్తే తాము అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చున్నది చంద్రబాబు ఆలోచన. అందుకే కేంద్ర ప్రభుత్వానికి తమతో ఉన్న అవసరాల కంటే తనకు కేంద్రంతో అవసరాలు ఎక్కువని చంద్రబాబు నాయుడుకు తెలియంది కాదు. అందుకే వీలయినంత త్వరగా రాజధాని అమరావతి పనులను ప్రారంభించాలని, అందులోనూ ప్రధాని మోదీ చేత శంకుస్థాపనలు చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే రాజధాని అమరావతి నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు నుంచి పదిహేను వేల కోట్ల రూపాయలు, హడ్కో నుంచి పదకొండు వేల కోట్ల రూపాయల నిధులు దాదాపుగా మంజూరయ్యాయి. వీటితో మొదటి దశ పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతుంది చంద్రబాబు సర్కార్. మూడేళ్లలో మొదటి దశ పనులు పూర్తి చేయగలిగితే ఎనభై శాతం అమరావతి విషయంలో విజయం సాధించినట్లేనని చంద్రబాబు భావిస్తున్నారు. ఒకసారి అమరావతి అభివృద్ధి పరంగా ముందుకు వెళితే మిగిలిపోయిన భూములను విక్రయించి రాజధాని అమరావతి కోసం చేసిన రుణాలను సులువుగా తీర్చడమే కాకుండా అధిక ఆదాయాన్ని కూడా పొందవచ్చు. దీని ద్వారా సంపదను పెంచుకోవచ్చని భావిస్తున్నారు. అప్పుడు తాము ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి వీలవుతుంది. అదే చంద్రబాబు అసలు ప్లాన్ గా ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే మూడేళ్లలో ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చడమే కాకుండా కూటమికి మరోసారి విజయం దక్కేందుకు బాటలు వేయవచ్చని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే కేంద్రంతో సయోధ్యతతో మెలుగుతూ, అనుకున్నది రాబట్టుకుంటూ ఈ మూడేళ్ల కాలంలో కొంత అభివృద్ధి, కొన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని భావిస్తున్నారు... మరోవైపు పోలవరం పనులు పరుగులు పెట్టాలన్నా కేంద్ర ప్రభుత్వం సహకారం అవసరం. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయగలిగితే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రైతులు కూడా తమ పక్షాన నిలబడతారన్న భావనలో ఉన్నారు. అలాగే ఈరోజు జరిగే మంత్రివర్గ సమావేశంలో బనకచర్ల పథకంపై కూడా కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు ఆయన ఈరోజు బనకచర్ల ప్రాజెక్టు పై మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇలా అనేక రకాలుగా చంద్రబాబు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. పార్టీకి మరోసారి విజయం అందించేందుకు ప్రయత్నాలు చంద్రబాబు చేస్తున్నారు.

# 5 217 చ.కి.మీల విస్తీర్ణంలో అమరావతి నిర్మాణం?

అమరావతి, ఏప్రిల్ 4,

ఏపీ రాజధాని అమరావతి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలవడంతో నిధుల సమీకరణ ఇప్పటికే కొలిక్కి వచ్చింది. ఏప్రిల్ మూడో వారం లోపు రాజధాని నిర్మాణ పనుల్ని ప్రధానమంత్రి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఎపి సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 217 చ.కి.మీల విస్తీర్ణంతో అమరావతి ప్రజా రాజధానిని నిర్మించేందుకు ఈప్రభుత్వం తిరిగి శరవేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. దానిలో భాగంగానే అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు,పలు ట్రంక్ రోడ్ల నిర్మాణం,ఇతర నిర్మాణాలు,సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులకు పెద్దఎత్తున నిధులు సమీకరించి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినట్టు వివరించారు. ఈనెలలోనే ప్రధానమంత్రి సుమారు లక్ష కోట్ల రూ.ల పనుల పున:ప్రారంభం, పనులు శంఖుస్థాపనలు,ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారని వివరించారు.ఇంకా పలు అంశాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలను సింగపూర్ ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు.ప్రధాని పర్యటనపై సిఎస్ విజయానంద్ సమీక్షించారు.రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభించడంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు శంఖుస్థాపన,ప్రారంభోత్సవాలకు ఈనెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అమరావతికి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు.అమరావతిలో ప్రధాని పర్యటన ఖరారు కావాల్సి ఉంది. ఈలోగా సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటి నుండే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని సిఎస్ అధికారులను ఆదేశించారు.ఇటీవల పి-4 కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రాంతంలోనే ప్రధాని పర్యటన కార్యక్రమం ఉండే విధంగా ఆప్రాంతాన్ని 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో చదును చేయడంతో పాటు తగిన పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉందని ఆదిశగా ఇప్పటి నుండే తగిన కసరత్తు మొదలు పెట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సిఎస్ సూచించారు.డీజీపీ, సిఆర్డిఏ అధికారులు,గుంటూరు జిల్లా కలక్టర్, ఎస్పీ,వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్ తదితర అధికారులు వెంటనే ఆప్రాంతాన్ని సందర్శించి ఒక సమగ్ర నివేదికను సిద్దం చేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు.గతంలో రాష్ట్రంలో ప్రధానమంత్రి పర్యటనలో చురుగ్గా పనిచేసిన అధికారుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించేందుకు ఆయా అధికారుల జాబితాను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు.ప్రస్తుత వేసవి దృష్ట్యా కార్యక్రమానికి వచ్చే వివిఐపి, విఐపిలు,ప్రజలు తదితరులు అందరికీ తగిన పూర్తి వసతులు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాల్సి ఉందని చెప్పారు.ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తి స్థాయిలో మరొక సారి శాఖల వారీ ఏర్పాట్లపై సమీక్షిస్తామని, ఈలోగా తగిన ప్రాథమిక కసరత్తు ప్రారంభించాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు.అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరి గానే సింగపూర్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజ్ఞప్తి చేశారు.2014-2019లో అమరావతి ప్రజా రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం ఒక కీలక భాగస్వామిగా ఉందని అదే స్థితిని ప్రస్తుతం కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈప్రభుత్వం తిరిగి అధికారానికి వచ్చిన రోజు నుండే అమరావతి రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఇప్పటికే అమరావతి రాజధానికి సంబంధించి కేంద్ర నిధులతో పాటు ప్రపంచ బ్యాంకు,హడ్కో,ఎడిబి వంటి సంస్థలతో పెద్దఎత్తున నిధులు టైఅప్ చేసిందని నిధులకు ఎలాంటి సమస్య లేదని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అమరావతి రాజధాని నిర్మణ పనులను పున:ప్రారంభించేందుకు రానున్నారని సిఎస్ తెలిపారు.కావున గతంలో మాదిరే సింగపూర్ ప్రభుత్వం పూర్తిగా సహకరించేందుకు కృషి చేయాలని అన్నారు.గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులతో సమావేశం ఉన్నందున అన్ని అంశాలపై మరింత స్పష్టత వస్తుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు.అమరావతి మాస్టర్ ప్రణాళికను గతంలోనే సిద్ధం చేయడం జరిగిందని గుర్తు చేశారు. అమరావతి రాజధానిని ప్రపంచంలోనే ఒక ఉత్తమ సస్టెయినబుల్ అండ్ అత్యంత లివబుల్ సిటీగా నిర్మించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిపారు.

## జవహర్ నగర్ ఆదర్శనగర్ లో పోలీసులు కార్డన్ సెర్చ్

మేడ్చల్

మేడ్చల్ జిల్లా, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, వికలాంగుల కాలనీ, ఆదర్శనగర్ కాలనీలో, సుమారు 130 మంది పోలీసు బలగాలతో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. మల్కాజ్గిరి డిసిపి, పద్మజా రెడ్డి పాల్గోన్నారు.

డిసిపి మాట్లాడుతూ... రాజ కొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు, ఈ కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగింది. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, నివాసంగా ఇటువంటి ప్రాంతాలను ఎంచుకున్నారని అనుమానంతో తనిఖీలు చేసామని అన్నారు... చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి, కి, ఇండ్లను అద్దెకి ఇవ్వాలన్నా సరే, ప్రజలు ఆలోచించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో ఎటువంటి అనుమతులు లేని 17 ద్విచక్ర వాహనాలను, మద్యం బాటిల్లను సీజ్ చేసారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసిపి మహేష్, వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు మంది సీఐలు, జవహర్ నగర్ పోలీసులు పాల్గొన్నారు.

## బాలీవుడ్ హీరో మనోజ్ కుమార్ మృతి

ముంబై, ఏప్రిల్ 4,

బాలీవుడ్‌లో విషాదం చోటు చేసుకుంది. సీనియర్ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ ఈ ఉదయం కన్నుమూశారు. 87 ఏళ్ల మనోజ్ కుమార్ కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ మరణంపై బాలీవుడ్ తీవ్ర విచారం వ్యక్తంచేస్తోంది. ప్రముఖ నటుడి మరణం అభిమానులు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.మనోజ్ కుమార్ చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. మనోజ్ కుమార్ తన దేశభక్తి చిత్రాలకు ప్రసిద్ధి చెందారు. ఆయన బాలీవుడ్‌లో 'భరత్ కుమార్'గా పిలుస్తారు.మనోజ్ కుమార్ మరణంపై చిత్రనిర్మాత అశోక్ పండిట్ మాట్లాడుతూ, "... దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, మా ప్రేరణ, భారత చలనచిత్ర పరిశ్రమకు 'సింహం' మనోజ్ కుమార్ మనతో లేరు. ఇది పరిశ్రమకు భారీ నష్టం " అని అన్నారు. జూలై 24, 1937న హరికృష్ణ గిరి గోస్వామిగా జన్మించిన మనోజ్ కుమార్ హిందీ చిత్రసీమలోకి ప్రవేశించి చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. అతను "షహీద్" (1965), "ఉప్కార్" (1967), "పురబ్ ఔర్ పశ్చిమ్" (1970), "రోటీ కప్డా ఔర్ మకాన్" (1974) వంటి దేశభక్తి ఇతివృత్తాలతో కూడిన చిత్రాల్లో నటించడమే కాకుండా దర్శకత్వం కూడా చేశారు. ఈ సినిమాల కారణంగా ఆయనను 'భరత్ కుమార్' అని కూడా పిలిచేవారు.దేశభక్తి చిత్రాలే కాకుండా, "హరియాలీ ఔర్ రాస్తా", "వో కౌన్ థీ", "హిమాలయ్ కి గాడ్ మే", "దో బదన్", "పత్తర్ కే సనమ్", "నీల్ కమల్" "క్రాంతి" వంటి ఇతర ముఖ్యమైన చిత్రాల్లో నటించాడు, దర్శకత్వం వహించాడు. 1995లో 'మైదాన్-ఎ-జంగ్' చిత్రం ఆయన నటించిన చివరి సినిమా.

అవార్డులు, గౌరవాలు

మనోజ్ కుమార్ భారతీయ సినిమాకు చేసిన కృషికి గాను 1992లో పద్మశ్రీ, 2015లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు.

## బీజేపీతో కలిసి బాబు, జగన్, పవన్ లు పోలవరం ప్రాజెక్ట్ ను చంపేశారు

### ఫేజ్ 2 అనేది పచ్చి అబద్ధం

### దాదాపు 22 వేల కోట్ల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీ దెబ్బతీసింది

### ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మోసం చేయకండి

### వైఎస్ షర్మిలా రెడ్డి

విజయవాడ రాష్ట్ర విభజన తర్వాత విభజన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదు. బీజేపీ గత 10 ఏళ్లుగా మోసం చేస్తుంది. ప్రత్యేక హోదా ఏపీ కి అతి ముఖ్యమైనది. 2014 లో ప్రత్యేక హోదా 10 ఏళ్లు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారు. పోలవరం మొత్తం కేంద్రమే కడుతుందని చెప్పారు. ఇచ్చిన హామీలు ఒక్కదానికి దిక్కులేదని ఏసీపీపీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. హోదా తో పాటు రాష్ట్రానికి పోలవరం అంతే ముఖ్యం. పోలవరం ఆంధ్ర జీవనాడి. రైతులకు ఊపిరి. ఇవ్వాల్టి వరకు ప్రాజెక్ట్ పూర్తి కాలేదు. దీనికి భాధ్యత ఎవరు? పోలవరం వైఎస్సార్ కల. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక అన్ని అనుమతులు తీసుకు వచ్చి పనులు ప్రారంభించారని అన్నారు.

2014 లో కాంగ్రెస్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ ను జాతీయ ప్రాజెక్టు గా గుర్తించింది. 2019 లో అధికారంలో వచ్చిన బాబు కేవలం 17 శాతం పనులు చేశారు. ప్రాజెక్ట్ అంచనా ను అమాంతం పెంచారు. 50 వేల కోట్లకు పెంచేశారు.జగన్ అధికారం లో వచ్చాకా పోలవరం పనులు 3 శాతం దాటలేదు. తండ్రి ఆశయాన్ని జగన్ ముందుకు తీసుకు వెళ్ళలేదని అన్నారు.

ఇప్పుడు బీజేపీ పోలవరం పై గేమ్ ఆడుతుంది. చంద్రబాబు మళ్ళీ బీజేపీ తో పొత్తు పెట్టుకొని పోలవరం ప్రాజెక్ట్ కి ద్రోహం చేస్తున్నారు. చంద్రబాబు పగలు పడిన గోతిలో రాత్రి పడ్డారు. అందరు కలిసి పోలవరం ప్రాజెక్ట్ స్వరూపం మార్చేశారు. జగన్ ,బాబు ఇద్దరు బీజేపీ కి లొంగిపోయారు. ప్రాజెక్ట్ ఫుల్ స్టోరేజ్ కెపాసిటీ 45 నుంచి 41 మీటర్ల కు కుదించారు. 41 మీటర్ల ఎత్తులో మాత్రమే ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని చూస్తున్నారని అన్నారు.

41.15 ఎత్తులో నిర్మాణం అని కేంద్రం పోలవరం వెబ్ సైట్ లో పెడితే...ఎంపీలు నోరు మూసుకొని కూర్చున్నారు. ప్రాజెక్ట్ బ్యారేజ్ గా...లిఫ్ట్ ఇరిగేషన్ గా మిగిలి పోయే ప్రమాదం ఉంది. ఇది రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న కుట్ర.

## పవన్ ను వెంటాడుతున్న ప్రకాష్ రాజ్...

హైదరాబాద్, ఏప్రిల్ 4, (

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై ప్రకాష్ రాజ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆది నుంచి పవన్ కళ్యాణ్ విషయంలో విభేదిస్తూ వచ్చారు ప్రకాష్ రాజ్. నిత్యం సోషల్ మీడియా వేదిక ద్వారా పవన్ కళ్యాణ్ వైఖరిని ప్రశ్నిస్తూనే ఉన్నారు ప్రకాష్ రాజ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రకాష్ రాజ్ జాతీయ అవార్డులు, రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సమయంలో ప్రజా సమస్యల గురించి మాట్లాడిన పవన్.. అధికారంలోకి వచ్చాక వాటి గురించి పెద్దగా పట్టించుకోవడంలేదని తప్పుపట్టారు. అధికారంలో ఉండి కూడా ప్రజా సమస్యలను పరిష్కరించకుండా టైంపాస్ పనులేంటి అంటూ నిలదీసే ప్రయత్నం చేశారు. మాటలు మార్చడానికి ఇదే సినిమా కాదని కూడా సెటైరికల్ కామెంట్స్ చేశారు ప్రకాష్ రాజ్. ఇప్పుడు అవి సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.తిరుమలలో లడ్డు వివాదం నాటి నుంచి పవన్ కళ్యాణ్ వెంటాడుతున్నారు ప్రకాష్ రాజ్. నాడు లడ్డూ వివాదంపై ప్రకాష్ రాజ్ స్ట్రాంగ్ గా రియాక్ట్ అయిన సంగతి తెలిసిందే. అయితే అది చాలా సున్నితమైన అంశమని.. భక్తుల మనోభావాలకు సంబంధించినదని అప్పట్లో చెప్పారు ప్రకాష్ రాజ్. ఇలాంటి వాటి గురించి మాట్లాడేటప్పుడు సరైన ఆధారాలతో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. నిజంగా లడ్డూ తయారీలో కల్తీ జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రకాప్రాజ్ అప్పట్లో కోరారు. గతంలోనూ పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ప్రకాష్ రాజ్ చాలాసార్లు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. ఇటీవల త్రి భాషా విధానంపై పవన్ మాట్లాడినప్పుడు సైతం ప్రకాష్ రాజ్ స్పందించారు.



జనసేన ఆవిర్భావ సమయంలో పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3 భాషా విధానంపై పవన్ హాట్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం కొందరు హిందీ భాషపై గగ్గోలు పెడుతున్నారు అంటూ పరోక్షంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పై విమర్శలు చేశారు పవన్. హిందీ భాషా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. దానిపై ప్రకాష్ రాజ్ స్పందించారు. మీ హిందీ భాషను మా మీద రుద్దకండి అని చెప్పడం.. ఇంకో భాషను ద్వేషించడం కాదని.. స్వాభిమానంతో తమ మాతృభాషను, తమ తల్లిని కాపాడుకోవడమేనని పవన్ కళ్యాణ్ కు ఎవరైనా చెప్పండి ప్లీజ్ అంటూ.. జస్ట్ ఆస్కింగ్ అంటూ ముగించారు ప్రకాష్ రాజ్.అప్పట్లో తిరుమల లడ్డు వివాదాన్ని జాతీయ సమస్యగా మార్చవద్దని కూడా విజ్ఞప్తి చేశారు. ప్రకాష్ రాజ్. ముందుగా దోషులను కనుగొని వారిని శిక్షించాలని సూచించారు. మీరు డిప్యూటీ సీఎం గా ఉన్న రాష్ట్రంలో ఇది జరిగింది. దయచేసి దర్యాప్తు చేయండి. దోషులను కనుగొని కఠిన చర్యలు తీసుకోండి అని ట్వీట్ చేశారు. ఇప్పుడు అదే మాదిరిగా మరోసారి విరుచుకుపడ్డారు ప్రకాష్ రాజ్. నిత్యం పవన్ కళ్యాణ్ నీడలా వెంటాడుతున్నారు. రాజకీయాన్ని వేడి పుట్టిస్తున్నారు.

## రామానాయుడు స్టూడియో స్వాధీనం...

విశాఖపట్టణం, ఏప్రిల్ 4,

విశాఖ రామానాయుడు స్టూడియో భూములను రియల్ ఎస్టేట్ కు ఉపయోగించడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. విశాఖలోని రామానాయుడు స్టూడియోలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు వేసి విల్లాలు కట్టాలనుకున్న 15.17 ఎకరాలల భూమిని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో వైఎస్ హయాంలో 34.44 ఎకరాలను సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం రామానాయుడు స్టూడియోకు ఏపీ ప్రభుత్వం కేటాయించింది. అయితే అందులో అంతటా స్టూడియో నిర్మించలేదు. నిబంధనల ప్రకారం ఇతర అవసరాలకు ఆ భూమిని ఉపయోగించకూడదు. వినియోగిస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు. అయితే రామానాయుడు స్టూడియో యాజమాన్యం అందులోని 15.17 ఎకరాలను రియల్ ఎస్టేట్ గా మార్చి నివాస ప్రాంతాలుగా వినియోగించుకునేందుకు 2023లో గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇచ్చిన ప్రయోజనం కోసం కాకుండా ఇతర పనులకు ఉపయోగిస్తే స్వాధీనం చేసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. దీంతో రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా.. రామానాయుడు స్టూడియో యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విశాఖ కలెక్టర్ ను ఆదేశించారు. వారు ఇచ్చే వివరణ తర్వాత భూములను వెనక్కి తీసుకుంటూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉది. ఆ భూమి మొత్తాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు మిగతా స్టూడియో నిర్మించిన భూమిపైనా నియంత్రణ ఉంచాలని భావించే అవకాశం ఉంది. సినీ అవసరాలకు తప్ప దేనికి ఉపయోగించినా ఆ భూమిని మళ్లీ వెనక్కి తీసుకుంటారు. మరో వైపు విశాఖ రుషికొండ ప్యాలెస్ ను ఏం చేయాలన్నదానిపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోవాలని అనుకుంటోంది. ఈ అంశంపై కేబినెట్ భేటీలోనూ చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. ఆ భవనం నిరుపయోగంగా ఉంటోందని నిర్వహణ ఖర్చులు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. దీంతో చంద్రబాబునాయుడు ఆ భవనాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నదానిపై పరిశీలన చేయాల్సి ఉందన్నారు. మంత్రులు అంతా.. రుషికొండ ప్యాలెస్ ను చూసి రావాలని చంద్రబాబు సలహా ఇచ్చారు. ఎలా ఉపయోగించుకుంటే బాగుంటుందో సలహాలివ్వాలని సూచించినట్లుగా తెలుస్తోంది.



టూరిజం కాటేజ్ ఉండే ప్రాంతాన్ని కూలగొట్టి విలాసవంతమైన ప్యాలెస్ ను వైసీపీ ప్రభుత్వం నిర్మించింది. స్టార్ హోటల్ అని చెప్పినప్పటికీ అందులో గట్టిగా ఐదు బిల్డింగులో ఒక్కో దానిలో మూడు, నాలుగు బెడ్ రూములు మాత్రమే ఉన్నాయి. హోటల్ గదులు కట్టినట్లుగా కట్టలేదు. కనీసం కాటేజీలు కట్టినట్లుగా కట్టలేదు. జగన్ మోహన్ రెడ్డి తాను మళ్లీ అధికారంలోకి వస్తానని విశాఖ నుంచి పరిపాలించడానికి ప్రజాధనంతో ఆ నివాసాన్ని నిర్మించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పర్యావరణ విధ్వంసం చేసినట్లుగా ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పుడు ఆ భవనాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది ప్రభుత్వానికి కూడా సవాల్ గా మారింది.

## నటుడు మనోజ్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలి

అమరావతిప్రముఖ హిందీ నటుడు, దర్శకుడు మనోజ్ కుమార్ గారు మరణం బాధాకరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పరమేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను. మనోజ్ కుమార్ భారతీయ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. తను రూపొందించిన చిత్రాల్లో జాతీయ భావాలను ప్రస్ఫుటంగా... ప్రేక్షకుల మనసుల్ని హత్తుకొనేలా చూపించారు. 'ఉపకార్' చిత్రం ఈ రోజు చూసినా ? నాటి 'జై జవాన్ జై కిసాన్' నినాద నేపథ్యం, ప్రభావం తెలుస్తాయి. రోటీ కపడా ఔర్ మకాన్, క్రాంతి లాంటి చిత్రాలు కూడా అయిదు దశాబ్దాలకు పూర్వం ఉన్న మన సమాజ పరిస్థితులకు అద్దంపడతాయి. దేశం అంటే ప్రేమాభిమానాలు కలిగిన నటుడు, దర్శకుడు అయన.

## భాగ్యనగరంలో ఆఫీసు స్థలాలకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 4,

పారిశ్రామిక రంగాలకు కీలకమైన నగరాల్లో మన హైదరాబాద్ ఒకటి. ఇక్కడ మల్టీనేషనల్ కంపెనీలు తమ ఆఫీసులను తెరిచేందుకు మొగ్గు చూపుతున్నాయి. నైపుణ్యం గల మానవ వనరులు, మౌలిక వసతులు సరిపడా ఉండడంతో హైదరాబాద్ నగరంలో వ్యాపార విస్తరణకు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి. దీంతో భాగ్యనగరంలో ఆఫీసు స్థలాలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ప్రతి ఏడాది లక్షల చదరపు అడుగుల కార్యాలయాల స్థలాలు లీజుకు వెళ్తున్నాయి. దేశంలోని 8 ప్రధాన నగరాల్లో జనవరి- మార్చి త్రైమాసికంలో చూస్తే ఆఫీసు స్థలాల స్థూల అద్దె ట్రాన్సాక్షన్లు 74 శాతం మేర పెరిగాయి. గత మూడు నెలల్లో 2.82 కోట్ల చదరపు అడు?ల ఆఫీసు స్థలాలు అద్దెకు వెళ్లినట్లు ప్రముఖ స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ నివేదిక తెలిపింది.విదేశీ కంపెనీలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరచడమే డిమాండ్ పెరిగేందుకు కారణమని నివేదిక తెలిపింది. ఈ మేరకు ఇండియా రియల్ ఎస్టేట్: ఆఫీసు అండ్ రెసిడెన్షియల్ నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. 2025 తొలి త్రైమాసికంలో దేశవ్యాప్తంగా ఆఫీసు స్థలాల మార్కెట్‌కు అసాధారణ గిరాకీ ఉన్నట్లు తెలిపింది. జీసీసీ స్థలాల లీజింగ్ కొత్త గరిష్ఠాలను తాకుతున్నట్లు పేర్కొంది. భారత్‌ను దీర్ఘకాలిక పెట్టుబడి గమ్యస్థానంగా ప్రపంచం గుర్తిస్తోందని తెలిపింది.బెంగళూరు నగరంలో ఆఫీసు స్థలాల అద్దె ట్రాన్సాక్షన్లు 3 రెట్లు పెరిగినట్లు నైట్ ఫ్రాంక్ నివేదిక తెలిపింది. గత ఏడాది జనవరి- మార్చి త్రైమాసికంలో 35 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలం అద్దెకు వెళ్లగా ఈసారి 1.27 కోట్ల చదరపు అడుగుల స్థలం అద్దెకు తీసుకున్నట్లు పేర్కొంది. ఆ తర్వాత హైదరాబాద్ మాహనగరం నిలిచిందినట్లు నివేదిక వెల్లడించింది. హైదరాబాద్‌లో గత ఏడాది 30 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాలు అద్దెకు వెళ్లాయి. ఈసారి అది 31 శాతం వృద్ధితో 40 లక్షల చదరపు అడుగులకు చేరినట్లు నివేదిక తెలిపింది. అంటే దాదాపు 9 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాలు అధికంగా అద్దెకు వెళ్లాయి.ఇక పుణె నగరంలో ఆఫీసు స్థలాల అద్దె లావాదేవీల్లో 91 శాతం వృద్ధి కనబడింది. 37 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాలు అద్దెకు వెళ్లాయి. ఇక ముంబై నగరంలో 24 శాతం వృద్ధితో 35 లక్షల చదరపు అడుగులు, చెన్నై నగరంలో 56 శాతం వృద్ధితో 18 లక్షల చదరపు అడుగుల స్థలం అద్దెకు వెళ్లింది. ఢిల్లీ- ఎన్సీఆర్ ప్రాంతంలో గత మూడు నెలల్లో 21 లక్షల చదరపు అడుగులు, అహ్మదాబాద్‌లో 2.2 లక్షల చదరపు అడుగులు, కోల్‌కతాలో 1.6 లక్షల చదరపు అడుగుల స్థలాలు లీజుకు వెళ్లాయి

## తెల్ల రేషన్ కార్డు తో దరఖాస్తు చేసుకోవచ్చు

హైదరాబాద్,

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వర్గాల వారికి రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు ఆర్థిక సహాయంను ప్రభుత్వం అందించనుంది.

రాయితీలు, బ్యాంకు రుణాల ద్వారా సొంతంగా వ్యాపారాలు ప్రారంభించడానికి ప్రభుత్వం సహాయం చేస్తుంది. దీంతో ఈ పథకానికి భారీ దరఖాస్తులు వస్తున్నాయి. రాజీవ్ యువ వికాసం పథకంకు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 1వ తేదీ వరకు తొలుత ప్రభుత్వం అవకాశం కల్పించింది.

అయితే, ఈ గడువును ఏప్రిల్ 14వ తేదీ వరకు పొడిగించింది. ఈ పథకం కింద ఏప్రిల్ 3వ తేదీ వరకు 7లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు సర్వర్ బిజీగా మారడంతో ధ్రువ పత్రాల జారీ చాలా నెమ్మదిగా కొనసాగుతుంది. ఆదాయ ధ్రుపవత్రాల కోసం దరఖాస్తుదారులు ఇబ్బందులు తలెత్తుతున్న సందర్భంలో స్పందించిన ప్రభుత్వం.

తెల్లరేషన్ కార్డుతో దరఖా స్తులు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. రాజీవ్ యువ వికాసం పథకంపై బీసీ కా ర్పొరేషన్ ఎండీ మల్లయ్య భట్టు మాట్లాడుతూ కీలక విషయాన్ని చెప్పారు.

# సుప్రీం చీవాట్లతో .

# నష్టనివారణా చర్యల్లో సర్కార్

హైదరాబాద్, ఏప్రిల్ 4

కంచ గచ్చిబౌలి భూముల వివాదం కోర్టులు, ప్రతిపక్షాలు చుట్టుముట్టడంతో ప్రభుత్వం ఓ అడుగు వెనక్కి వేసింది. వివాద పరిష్కారానికి మార్గం కనుక్కునేందుకు వ్యూహరచన చేస్తోంది. అందుకే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. మంత్రులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆందోళనకారులతో చర్చలు జరపనుంది. రోజు రోజుకు మరింత వివాదాస్పదమవుతున్న 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములపై కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కమిటీ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆందోళ వ్యక్తం చేస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు, ప్రజాసంఘాలతో సంప్రదింపులు జరపనున్నారు. ఈ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఉదయం నుంచి గచ్చిబౌలి భూ వివాదంలో చాలా పరిణామాలు జరిగాయి. ఓవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడుతుంటే... మరో వైపు కోర్టులు వెంటాడాయి. హైకోర్టు, సుప్రీం కోర్టు రెండూ న్యాయస్థానాలు కూడా ప్రభుత్వం తీరు, అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఉదయం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్పాట్‌కు వెళ్లి ఏం జరుగుతుందో తెలుసుకొని మధ్యంతర నివేదిక ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. మధ్యాహ్నం 3.30కల్లా పూర్తి వివరాలు అందజేయాలని సూచించింది. ఈ నివేదిక అందిన వెంటనే విచారణ ప్రారంభించింది సుప్రీంకోర్టు. ఇందులో సీఎస్‌ను ప్రతివాదిగా చేర్చింది కోర్టు. అభ్యంతరాలు ఉన్నప్పుడు అత్యవసరంగా పనులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీసింది. తమ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఈ ప్రశ్నలపై అఫిడవిట్ దాఖలు చేయాలని విచారణను 16కు వాయిదా వేసింది. ఇది చాలా సీరియస్ అంశంగా చెప్పిన సుప్రీంకోర్టు వచ్చే వాయిదా వరకు పనులు పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేసింది.

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై హైకోర్టులో కూడా విచారణ సాగింది. ఇప్పటికే పనులు నిలిపివేయాలని ఆదేశించిన కోర్టుదాన్ని పొడిగించింది. విచారణ ఏడుకు వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు కూడా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

విద్యార్థుల సంబరాలు

కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టులో వచ్చిన ఆదేశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. నిరసన తెలియజేస్తున్న విద్యార్థులంతా సంబరాలు చేసుకున్నారు. న్యాయస్థానాల కామెంట్స్‌తోనైనా రేవంత్ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు.సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై బీఆర్ఎస్ కూడా హర్షం వ్యక్తం చేసింది. రేవంత్ రెడ్డి దూకుడుకు కళ్లెం పడిందని కేటీఆర్, హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. ఇది విద్యార్థుల విజయంగా అభివర్ణించారు. ఈ ఉద్యానికి మద్దతు ఇచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు

ఏఐ అడవులపై సోషల్ మీడియాలో సెటైర్లు

అది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూమి అని.. దానిని రియల్ ఎస్టేట్ సంస్థలకు అమ్మేస్తారా అని ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ ఆరోపిస్తుంటే.. లేదు లేదు ఆ భూములు చదును చేసి అభివృద్ధి చేసి.. 50 వేల కోట్ల ఆదాయం వచ్చేలాగా చేస్తామని అధికార కాంగ్రెస్ చెబుతోంది. ఇప్పటికే ఈ వివాదం న్యాయస్థానాల దాకా వెళ్ళింది. గౌరవ తెలంగాణ హైకోర్టు ఇప్పటికే ఈ వివాదంపై తీర్పును రిజర్వ్ చేసినట్టు వార్తలు వస్తున్నాయి. హైకోర్టు రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో పడగొట్టిన చెట్లను పరిశీలించాలని.. తమకు నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఇక హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కంచ గచ్చిబౌలి ప్రాంతంలో భూమి చదును చేసే పనులు ఆగిపోయాయి. ఈ భూములకు సంబంధించి భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ 400 ఎకరాల భూములను ఎవరు కొనుగోలు చేసినా.. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని తిరిగి తీసుకుంటామని హెచ్చరించారు. ఇక ఇదే నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనుకూల నెటిజన్లు సోషల్ మీడియాలో విచిత్రమైన ప్రచారానికి దిగారు.కంచ గచ్చిబౌలి భూముల విషయంలో నానా యాగీ చేస్తున్న భారత రాష్ట్ర సమితి నాయకులకు కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో కౌంటర్ ఇస్తున్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో డైనోసార్లు, ఏనుగులు, జింకలు, సింహాలు ఉన్నట్టు.. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలు అవి అడవిగా మారినట్టు.. అందువల్లే హైటెక్ సిటీ ప్రాంతంలో అరుదైన జంతువులు జీవిస్తున్నట్టు.. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఓ ఫోటోను రూపొందించారు. "కెసిఆర్ హయాంలో హైటెక్ సిటీలో అడవి ఏర్పడింది. ఆ అడవిలోనే జంతువులు మొత్తం జీవిస్తున్నాయి. 10 సంవత్సరాల కాలంలో విపరీతంగా మొక్కలు నాటారు కాబట్టి హైటెక్ సిటీ ప్రాంతం మొత్తం అడవిగా మారిపోయిందని" కాంగ్రెస్ నాయకులు సెటైర్లు వేస్తున్నారు. వాస్తవానికి సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు చాలా యాక్టివ్ గా ఉంటారు. కానీ ఇటీవల కాలంలో కాంగ్రెస్ నాయకులు కూడా బలం పెంచుకున్నారు. సోషల్ మీడియాలో భారత రాష్ట్ర సమితి నాయకులకు దీటుగా బదులిస్తున్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులకు ఈ విధంగా కాంగ్రెస్ నాయకులు కౌంటర్ ఇస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఆకస్మాత్తుగా ఇలాంటి ఆర్టిఫిషియల్ యుద్ధానికి దిగడంతో ఒక్కసారిగా భారత రాష్ట్ర సమితి నాయకులు డిఫెన్స్ లో పడ్డారు. అయితే వారు తదుపరి అడుగులు ఎలా వేస్తారో తెలియదు కాని.. ప్రస్తుతానికైతే కాంగ్రెస్ నాయకులు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇమేజ్ సోషల్ మీడియాలో తెగ సందడి చేస్తోంది. కాంగ్రెస్ నాయకులు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇమేజ్ లో కారు ఫోటోను కూడా జత చేయడం విశేషం.

## ఏపీ సచివాలయం రెండవ బ్లాక్ వద్ద అగ్నిప్రమాదం

అమరావతి

ఏపీ సచివాలయం రెండవ బ్లాక్ వద్ద అగ్నిప్రమాదం సంభవించింది.రెండో బ్లాక్ లో ఉన్న బ్యాటరీలు ఉంచే ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అంచనా . విషయం తెలిసిన వెంటనే ఫైర్ సేఫ్టీ సిబ్బందికి ఎస్పీఎఫ్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఫైర్ సేఫ్టీ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరగడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదానికి గల కారణాల పై భద్రతాధికారులు ఆరా తీస్తున్నారు.

## బద్వేల్ లో కీచక టీచర్

బద్వేలు

బద్వేలు ఏవీఆర్ స్కూలులో కీచక టీచర్ కు దేహశుద్ధిజరిగింది. ఆరవ తరగతి విద్యార్థినుల పట్ల కంప్యూటర్ టీచర్ పెంచలయ్య అసభ్యంగా ప్రవర్తించాడు. విషయాన్ని విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పుకున్నారు. స్కూలు కు చేరుకున్న తల్లిదండ్రులు, బంధువులు స్కూల్ ఆవరణంలోనే కంప్యూటర్ టీచర్ ను చితకబాదారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు మీద బైక్ స్టంట్ ఇద్దరిపై కేసు నమోదు

రాయచోటి

రాయచోటి మదన పల్లె రూట్లో బైక్ పై స్టంట్ చేసిన ఇద్దరి యువకులపై కేసు నమోదు అయింది. గురువారం నం సాయంత్రం రాయచోటి మదనపల్లి రూట్లో స్కూటీపై వేగంగా, నిర్లక్ష్యంగా స్టంట్ లు చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని యువకులకు బండిని ఇచ్చిన యజమానిని కూడా నిందితుడిగా చేర్చారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాళ్లకు ఎలాంటి బైక్స్ ఇవ్వకూడదని పోలీసులు సూచించారు.

## అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించుకుందాం.

## కాంగ్రెస్ నేత దుద్దిల్ల శీను బాబు.

కమాన్ పూర్‌రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలి అని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ కాంగ్రెస్ నేత దుదిల్ల శీను బాబు అన్నారు. ఏఐసీసీ టీపీసీసీ మరియు శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు వివిధ గ్రామాల్లో శీను బాబు విశ్వతంగా పర్యటించారు. గురువారం రాత్రి కమాన్ పూర్ మండలం సిద్ది పల్లె గ్రామాల లో శీను బాబు వీధిలో తిరుగుతూ విజయ్ బాబు జై భీమ్ జై సమిధన్ అభియాన్ యొక్క సందేశం ప్రజలకు వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ జై బాబు జై భీమ్ జై సమిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

అలాగే ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు ఆకుల ఓదెలు, జెమిని గౌడ్, గాండ్ల మోహన్ రాజు రెబల్, బిల్లా కృష్ణ, భద్రపు శంకర్, కుచన రవి, కోల నరసయ్య గౌడ్, చొప్పరి శేఖర్, లల్లు, ఇరుగు రాళ్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో రూ.600 కోట్లతో ఎన్టీఆర్ ఐకాన్

అమరావతి :

ఏపీ రాజధాని అమరావతిలో మరో కీలక నిర్మాణానికి ముందడుగు పడింది. ప్రవాసాంధ్రుల కోసం ఏపీఎన్ఆర్టీ సొసైటీ సంస్థ 'ఎన్ఆర్ ఐకాన్' పేరుతో మూడు దశల్లో (5 ఎకరాల విస్తీర్ణం) 36 అంతస్తుల భారీ భవనానికి సంబంధించి ఫౌండేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. దాదాపు రూ.600 కోట్ల అంచనా వ్యయంతో జంట టవర్లుగా దీన్ని నిర్మించనున్నారు. ఇందులో నివాస ఫ్లాట్లను, కార్యాలయ ప్రాంతాన్నీ వారికే విక్రయిస్తారు

====================

## టీటీడీకి రెండు మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వ్యాన్లు విరాళం

తిరుమల, ఏప్రిల్ 04

తిరుమల శ్రీవారికి శుక్రవారం బెంగళూరులోని ఎం.ఎస్.రామయ్య విద్యా సంస్థలకు చెందిన ఎం.ఎస్.సుందర్ రామ్ అనే భక్తుడు అన్న ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు రూ.45 లక్షల విలువైన అశోక్ లేల్యాండ్ కంపెనీకి చెందిన రెండు బడా దోస్త్ మొబైల్ ఫాస్ట్ ఫుడ్ వ్యాన్లను విరాళంగా అందించారు. ముందుగా అలయం వద్ద ఈ వాహనానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనం తాళాలను టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ ఈ అత్యాధునిక వాహనాలు భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో కూడా క్యూలైన్ల వెంబడి ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేసేందుకు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఈ వాహనాలతో ఒకేసారి 03వేల మందికి అన్న ప్రసాదాలు పంపిణీ చేయవచ్చన్నారు. ఈరోజు నుండి ఈ వాహనాలను వినియోగించనున్నట్లు వెల్లడించారు. దాతలు ప్రస్తుతం రెండు వాహనాలను విరాళంగా ఇచ్చారని, మరో వాహనం డిజైనింగ్ లో ఉన్నందున త్వరలో అందివ్వనున్నారని తెలియజేశారు.

# మల్ రెడ్డి రాజీనామా ఆఫర్

హైదరాబాద్, ఏప్రిల్ 4,

తెలంగాణ కాంగ్రెస్ లో మంత్రి వర్గ విస్తరణ హీట్ కనిపిస్తోంది. హైకమాండ్ నుంచి పేర్లు రాకపోవడంతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. ఉగాది రోజు అనుకున్నారు. కానీ జరగలేదు. ఆ రోజు సీఎం రేవంత్.. గవర్నర్ ను కలవడంతో మూడో తేదీన మంత్రి వర్గ విస్తరణ జరుగుతుందని అనుకున్నారు. మూడో తేదీ వచ్చినా కాంగ్రెస్ లో ఎలాంటి సందడి కనిపించడం లేదు. అయితే ఆశావహులు మాత్రం తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు. తాజాగా ఇబ్రహీపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే రాజీనామా చేస్తానని ప్రకటించారు.రెడ్డి సామాజికవర్గం అయినందున అవకాశం ఇవ్వలేకపోతే.. ఏ సామాజికవర్గానికి అవకాశం ఇస్తారో చెబితే ఆ సామాజికవర్గం నేతను తన నియోజకవర్గం ఇబ్రహీపట్నం ను?ంచి నిలబెట్టి గెలిపిస్తానని ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వచ్చే రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ కు వచ్చిన సీట్లలో ఇబ్రహీంపట్నం ఒకటి. గ్రేటర్ లో ఇంకెక్కడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేరు. ఈ సమీకరణాలతో తనకు అవకాశం వస్తుందని మల్ రెడ్డి అనుకుంటున్నారు. అయితే మొత్తం భర్తీ చేసే సీట్లలో రెడ్డి సామాజికవర్గానికి ఒకటే ఇస్తారని భావిస్తున్నారు. ఇది .. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డికి ఇంకా.. ఒత్తిడి ఉంటే.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఇస్తారని భావిస్తున్నారు. ఇప్పటికి నల్లగొండ నుంచి ఇద్దరు రెడ్డి సామాజికవర్గ మంత్రులు ఉన్నారు. అందులో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోదరుడు కూడా ఒకరు.ఒకే జిల్లాకు మూడు రెడ్డి సామాజికవర్గ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇస్తే .. అదీ కూడా సోదరులిద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తమ పరిస్థితి ఏమిటని ఇతర రెడ్డి సామాజికవర్గం ఎమ్యేల్యేలు అంటున్నారు. అందుకే రాజీనామా చేస్తానని మల్ రెడ్డి రంగారెడ్డి అంటున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై 40,127ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 38 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందారు. . కాంగ్రెస్ మద్దతుతో సీపీఎం అభ్యర్థి ఒక్కసారి గెలిచినప్పటికీ నేరుగా కాంగ్రెస్ నేతలు గెలుపొందలేదు. 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఏజీ కృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన వరుస ఎన్నికల్లో సీపీఎం, తెలుగుదేశం, టీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు.అసాధ్యం అనుకున్న చోట భారీ విజాయన్ని సాధించి పెట్టానని అందుకే తనకు మంత్రి దవి ఇవ్వాలని మల్ రెడ్డి కోరుతున్నారు. మల్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2014లో కాంగ్రెస్ టికెట్‌కోసం ప్రయత్నించినప్పటికీ ఆయనను మహేశ్వరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా



ఎన్నికల బరిలో నిలిపారు. 2018లో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించగా.. టికెట్ రాకపోవటంతో 2018లో ఆయన బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. 2023లో విజయం ఆయన సొంతమైంది

సురేఖ స్థానంలో విజయశాంతి

తెలంగాణలో క్యాబినెట్ విస్తరణలో భాగంగా కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే కసరత్తు చేస్తున్న హై కమాండ్.. సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టిలతో చర్చలు జరిగింది. సుదీర్ఘ చర్చల తరువాత కొత్తగా నలుగురు ఎమ్మెల్యేకు మంత్రి పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, విజయశాంతి, సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, వాకిటి శ్రీహరి పేర్లను హై కమాండ్ దాదాపు ఖరారు చేసింది. ఇందులో నలుగురు వ్యక్తులకు మంత్రి పదవి, ఇద్దరు వ్యక్తులకు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.ఈ లిస్ట్‌లో రాజగోపాల్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి పేర్లు మంత్రులుగా దాదాపు ఖరారయ్యాయి. ఇక ఇప్పటికే ఉన్న మంత్రి వర్గం నుంచి ఇద్దరు మంత్రులకు ఉద్వాసక కల్పించే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ లిస్ట్‌లో మంత్రి కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు పేర్లు ప్రముఖంగా వినిస్తున్నాయి. వీళ్లిద్దరినీ మంత్రి పదవి నుంచి తొలగించి వీళ్ల స్థానంలో కొత్త మంత్రులను నియమించబోతున్నారని టాక్. ఉగాది పూర్తైన తరువాత వీళ్లలో ఎవరెవరికి ఏ మంత్రిత్వశాఖ ఇవ్వబోతున్నారు అనేది ఫైనల్ చేయబోతోంది కాంగ్రెస్.

## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి గెస్ట్‌హౌస్ స్థలం ప్రభుత్వానిదే.. తేల్చిన అధికారులు

ధర్మవరం:

వైకాపా నేత, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి గెస్ట్‌హౌస్ స్థలం రాష్ట్ర ప్రభుత్వ భూమిగా అధికారులు గుర్తించారు.

గుర్రాల కొండపై కేతిరెడ్డి గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారు.

గెస్ట్‌హౌస్ నిర్మించిన స్థలం ప్రభుత్వ భూమి కాదని గతంలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సవాల్ చేశారు.

రెండున్నర ఎకరాల అసైన్డ్ భూమిని కుటుంబసభ్యుల పేరుతో రిజిస్టర్ చేసినట్లు తాజాగా అధికారులు గుర్తించారు.

భూమిని స్వాధీనం చేసుకోవడానికి వీఆర్‌వోలు వెళ్లగా.. కొండపైకి వెళ్లే మార్గంలో గేటు వేసి ఉండడంతో వీఆర్‌వోలు వెనుదిరిగారు.

## ఈ మూల మలుపు ప్రమాదాలకు పిలుపు.

## ఏం ఆఫీస్ మూలమలుపు అంటేనే అందరికీ భయం.

## నాలుగు లైన్ల రోడ్ల పైన నిత్యం ప్రమాదాలే.

గోదావరిఖని :

జి ఎం కాలనీ మూలమలుపు నిత్యం ప్రమాదాలకు నిలయమైంది. నాలుగు లైన్ల రాజీవ్ రహదారి అయినప్పటికీ ఎప్పుడు నిత్యం ఇక్కడ ప్రమాదాలు ఏర్పడతాయి. సంబంధిత అధికారులు నాలుగు లైన్ల రోడ్ల అయినప్పటికీ ఏలాంటి రక్షణ చర్యలు విస్మరించడంతో ఈ ప్రాంతం డేంజర్ జోన్ గా మారింది. గత కొద్ది రోజులుగా మూలమలుపు దగ్గర ప్రమాదాల జరుగుతు ఉండడంతో గోదావరిఖనిలో హాట్ టాపిక్ గా మారింది.

ఈ మూల మలుపు అంటేనే భయం.

గోదావరిఖని జిఎం కాలనీలోని మూల మలుపు పేరు వినగానే స్థానిక ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. గోదావరిఖని నుండి మంచిరాల వైపు మరియు మహారాష్ట్ర నిత్యం భారీ వాహనాలు బస్సు, లారీలు, ఆటోలు, బైకులు నిత్యం రోడ్డు రద్దీగా ఉండే ఈ ప్రాంతం. రాజీవ్ రహదారి అయిన ఫోర్ లైన్ల పై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు ఏలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. జిఎం కాలనీ మూల మలుపు వద్ద ఏ ప్పటికి ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడ లేదని స్థానిక ప్రజలు అంటున్నారు. ఈ జిఎం కాలనీ మూల మలుపు ఎంత ప్రమాదకరమైందంటే గతంలో ఒక వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మొత్తం మాంసం ముద్దలు అయిన సంఘట గోదావరిఖనిలో కలకలం సృష్టించిన సంఘటనలు ఉన్నాయి. మహారాష్ట్ర మంచిర్యాల, నుండి వచ్చే భారీ వాహనాలు మూలమలుపు మీద బోల్తాపడే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. జిఎం కాలనీ మూల మలుపు వద్ద ఎంతోమంది ప్రాణాల తో పాటు ఆస్తి నష్టం కూడా ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాద నివారణ రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

==============================

## స్థానిక సంస్థల ఎన్నికలు - బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్ రావు

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డా.ఎన్.గౌతమ్ రావును బరిలో నిలపాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది.

సోషియాలజీలో డాక్టరేట్ పొందిన గౌతమ్ రావు విజ్ఞాన భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛైర్మన్ గా ఉన్నారు. గతంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రెసిడెంట్ గా పనిచేశారు.

ఈ స్థానానికి ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుండగా, 25న ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. కాగా ఓటర్లు 110 మంది. ఇందులో ఎంఐఎం బలం 49.పోటీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటివరకు ప్రకటన జారీ చేయలేదు. దీంతో బీజేపీ నేతలు ఎన్.గౌతంరావును పోటీకి నిల్పి ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంకు తొత్తులనే సందేశం ఇవ్వాలనే భావనతో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

==============================

## జగన్మాత కు ప్రత్యేక పుష్పార్చన'

## వసంత నవరాత్రుల్లో ఆరవ రోజైన

శుక్రవారం శ్రీ కనక దుర్గ అమ్మవారికి ప్రత్యేక పుష్పార్చన వైభవంగా జరిగింది.

కాగడా మల్లెలు, జాజులు, మరువములతో నూతనంగా నిర్మించిన పూజా మండపం ( నటరాజ స్వామి ఆలయ ప్రాంగణం)లో ఉదయం 9 గంటల నుండి పుష్పార్చన వైభవంగా ప్రారంభం అయింది.

శ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రధాన ఆలయం నుండి పుష్పాలతో మంగళ వాయిధ్యాలు, వేద మంత్రాలు నడుమ ఆలయ అర్చకులు, సిబ్బంది అర్చన ప్రాంగణంకి వెదురు బుట్టలతో పుష్పాలు తీసుకొని విచ్చేసిన అనంతరం ప్రత్యేక పూజలు ప్రారంభం అయ్యాయి.

ఈ పుష్పార్చన కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# వరంగల్ చిల్లీకి జియో గుర్తింపు

వరంగల్, ఏప్రిల్ 4,

వరంగల్ చపాటా మిర్చికి జియోగ్రాఫికల్ ఐడెంటిటీ లభించింది. ఈ మేరకు భౌగోళిక గుర్తింపు సంస్థ (జియోగ్రాఫిక్ ఇండికేషన్స్ రిజిస్ట్రీ) సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో తెలంగాణ నుంచి 18వ ఉత్పత్తిగా చపాటా మిర్చి జీఐ ట్యాగ్ పొందినట్లయ్యింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘంతో పాటు మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త కె.భాస్కర్, శ్రీకొండా లక్ష్మన్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ సహకారంతో చపాట మిర్చికి భౌగోళిక గుర్తింపు లభించింది. 2022లోనే చెన్నైలోని ఇండియన్ పేటెంట్ సంస్థకు దరఖాస్తు చేశారు. దీంతో దాదాపు మూడేళ్లకు టపాట మిర్చికి ఆ సంస్థ జీఐ ట్యాగ్ సర్టిఫికేట్ జారీ చేయగా.. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. చపాట మిర్చికి అంతర్జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉంది. చపాట మిర్చి టమాట ఎరుపు రంగులో ఉండి, తక్కువ కారంతో ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటుంది. ఇందులో ఒలియోరెసిన్ ( మిరప నుంచి తీసే నూనే) కంటెంట్ 6.37 శాతం నుంచి 6.75 శాతం వరకు ఉండి ఘాటు తక్కువగా ఉంటుంది. ఈ ఆయిల్ ను ఇంటర్నేషనల్ ఫుడ్స్ తోపాటు ఖరీదైన స్వీట్లు, కాస్మోటిక్స్, వివిధ రకాల డ్రింక్స్, మెడిసిన్ తయారీలో దీనిని వినియోగిస్తున్నారు. దీంతోనే చైనా, యూకే, యూఎస్, జర్మనీతో పాటు ఇరత యూరోపియన్ కంట్రీల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ చపాటా మిర్చి ఇదివరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నడికూడ మండలంలోనే ఎక్కువగా సాగయ్యేది. అక్కడి రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసి ఇతర ప్రాంతాల రైతులకు అందించడంతో ఉమ్మడి వరంగల్ తో పాటు కరీంనగర్ జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటం, బహిరంగ మార్కెట్ లో డిమాండ్ కూడా బాగానే ఉండటంతో రైతులు చాలావరకు చపాటా వైపు మొగ్గు చూపుతున్నారు. కాగా వరంగల్ జిల్లా దుగ్గొండ మండలంలోని తిమ్మంపేట రైతు ఉత్పత్తిదారుల సంఘంతో ఈ చపాటా మిర్చికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కినట్లయ్యింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామంలో దాదాపు 300 మంది రైతులు తిమ్మంపేట మిరప రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకుని.. గ్రామంలో పండించిన మిర్చికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చారు. ఇప్పుడు జీఐ ట్యాగ్ తో చపాటా మిర్చికి మరింత డిమాండ్ పెరగనుంది. ఫలితంగా రైతులకు కూడా మరింత లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో దాదాపు 20 వేల మంది రైతులు చపాటా మిర్చి 6,738 ఎకరాలకుపైగా సాగు చేస్తుండగా.. తిమ్మంపేట రైతుల కృషితో ఈ చపాటా మిర్చికి మంచి గుర్తింపు దక్కినట్లయ్యింది. దీంతో రైతులు నేరుగా వివిధ రాష్ట్రాలు, దేశాలకు పంట ఉత్పత్తిని ఎగుమతి చేసుకునే అవకాశం కలిగినట్లయ్యింది. బహిరంగ మార్కెట్ లో ప్రస్తుతం చపాటా మిర్చి ధర కిలో రూ.300 వరకు ఉంది. జీఐ ట్యాగ్ వల్ల కిలోకు రూ.450 నుంచి రూ.500 వరకు ధర లభించనుంది. అంతేగాకుండా రైతులు తమ సొంత లోగో, బ్రాండ్ ఏర్పాటు చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేసే అవకాశం కలగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## చపాట మిర్చికి జి ఐ లభించడం గర్వించదగ్గ విషయం.... పెద్ది

నర్సంపేట ఏప్రిల్ 4చాపాట మిర్చికి అంతర్జాతీయ స్థాయి జి ఐ సర్టిఫికెట్ రావడం గర్వించదగ్గ విషయమని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నాడు. శనివారం తిమ్మంపేట చిల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కంపెనీ లిమిటెడ్ సంఘం ఎఫ్ పి ఓ డైరెక్టర్లు, సభ్యులు పెద్దిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం పెద్ది మాట్లాడుతూ, చపాట మిరపకు జిఐ ట్యాగింగ్ కోసం దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలో 2019 లో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ వారు రెండేళ్ల క్రితం దరఖాస్తు చేయగా ఐ పి ఓ ఇండియన్ పేటెంట్ ఆఫీస్ తాజాగా జి ఐ సర్టిఫికెట్ ను జారీచేయడం జరిగిందన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో నల్లబెల్లి, దుగ్గొండి మండలాలలో చపాటారకం మిర్చిని ప్రత్యేక పంటగా పండిస్తున్నారని తెలిపారు. మన ప్రాంతంలో పండించిన చపాట రకం మిర్చికి అంతర్జాతీయ స్థాయిలో ప్రామాణికం కలిగినదిగా, అధిక ధర లభిస్తుందాన్నారు. గతంలో మిర్చి పంటకు నల్లి పురుగు ఇతర వ్యాధులు వచ్చినప్పుడు ముంబాయి, బెంగళూరు నుంచి సైంటిస్ట్ లను పిలిపించి నేషనల్ ల్యాబ్స్ ద్వారా పరీక్షలు చేపించడం జరిగిందని అన్నారు. 2019 నుండి నర్సంపేట ప్రాంతంలో ఎఫ్ పి ఓ లను ఏర్పాటు చేసి మిర్చి రైతులు యూనిట్ గా అనేక పరిశోధన సంస్థలను సంప్రదించి నర్సంపేట ప్రాంతంలో పండిస్తున్న ఈ చపాట రకం మిర్చి కి జి ఐ గుర్తింపు లభించడం కోసం ప్రయత్నించేసామన్నారు. జి ఐ ట్యాగ్ సర్టిఫికెట్ తో ఈ రకం మిర్చి ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు అయ్యిందని, తెలంగాణ నుంచి జిఐ ట్యాంక్ సాధించిన 18 ఉత్పత్తిగా చపాట వరంగల్ నర్సంపేట మిర్చి నిలిచిందన్నారు. 2019 సంవత్సరంలో ఆలోచించినటువంటి ఆలోచనల ఫలితం, అప్పటి ఆలోచనలు ఇప్పుడు ఫలితాలు వచ్చాయన్నారు. అప్పటి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వ్యవసాయ నిపుణులను, ఇతర బ్యాంకు అధికారుల అనుభవాలను పరిశీలించిన తర్వాత సమీక్షించి ఆనాడు నర్సంపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధికంగా 89 ఎఫ్ పి ఓ లను ఏర్పారు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా 24 ఎఫ్ పి ఓ లకి ప్యాడి కొనుగోలు కేంద్రాలు ప్రత్యేక జీవో ద్వారా అనుమతులు తీసుకురావడం జరిగిందని తెలిపాడు. మిర్చి ,టర్మరిక్ , వెజిటేబుల్, ప్యాడి తో పాటు ఇతర పంటల సంబంధించి ప్రత్యేక ఎఫ్ పి ఓ లు ఏర్పాటు చేసామని, దళిత రైతుల సంబందించిన, గిరిజన రైతులకు సంబంధించిన ఎఫ్ పి ఓ అనేక రకాలైన ఎఫ్ పి ఓ లు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆనాడు అన్నీ పరిశీలించి రైతులను ఈ ఎఫ్ పి ఓ సంగాల కిందికి తీసుకురావడం జరిగిందన్నారు. నర్సంపేట నియోజకవర్గం లో 32,000 మంది రైతులను 89 ఎఫ్ పి ఓ ల ద్వారా ఏకం చేసామన్నారు.

# తెలంగాణలో బర్డ్ ఫ్లూ కలకలం

హైదరాబాద్, ఏప్రిల్ 4,

లంగాణలో బర్డ్ ఫ్లూ మళ్లీ భయపెడుతోంది. బుధవారం హైదరాబాద్ నగర శివార్లలోని ఓ ఫౌల్ట్రీ ఫారమ్ లో బర్డ్ ఫ్లూ వైరస్ నిర్ధారణ కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేగింది. గత నాలుగు రోజుల క్రితం నగర శివారులోని ఓ ఫౌల్ట్రీలో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. అధికారులు చనిపోయిన కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించారు. ల్యాబ్ నుంచి వచ్చిన టెస్టు ఫలితాల్లో బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కావడంతో పౌల్ట్రీ ఫామ్స్ ను అధికారులు సీజ్ చేశారు. అందులో పనిచేస్తున్న వారందరి శాంపిల్స్ సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ నేపథ్యంలో కోళ్లతోపాటు కోడి గుడ్లను కూడా ఎవరికీ అమ్మొద్దని ఫౌల్ట్రీ యాజమానులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంలోని అధిక శాతం చికెన్ దుకాణాలకు కోళ్లు, కోడి గుడ్లు నగర శివార్లలోని, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫౌల్ట్రీ ఫామ్ ల నుంచి సరఫరా అవుతుంటాయి. ప్రస్తుతం నగర శివార్లలోని ఫౌల్ట్రీ ఫామ్ లో బర్డ్ ఫ్లూ కలకలం రేగడంతోపాటు.. పలు ఫామ్ లలోని కోళ్లు బర్డ్ ఫ్లూ కారణంగానే మరణించినట్లు నిర్ధారణ కావడంతో నగరంలోని చికెన్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ప్రస్తుతం బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయిన అబ్దుల్లా పూర్ మెంట్ ఫౌల్ట్రీ ప్రాంతాన్ని అధికారులు రెడ్ జోన్ గా ప్రకటించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా నల్గొండ జిల్లా గుండ్రాంపల్లి, దోతిగూడెంలోని మూడు ఫౌల్ట్రీ ఫామ్స్ లో బర్డ్ ఫ్లూ సోకినట్లు అధికారులు గుర్తించారు. ఆయా ఫామ్స్ లో ఉన్న కోళ్లను అధికారులు జాగ్రత్తగా పూడ్చిపెట్టారు. ఆ ప్రాంతంలో ఐదు కిలో మీటర్లు వరకు రెడ్ జోన్ గా ప్రకటించారు. ఇదిలాఉంటే.. బాగా ఉడికించిన చికెన్, కోడిగుడ్లు తినడం వల్ల వ్యాధి సోకే అవకాశాలు ఏమాత్రం లేవని వైద్య నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు.



సాధారణంగా ఈ వైరస్ లు మనుషుల్లోకి ప్రవేశించవు. కానీ, కొన్నిసార్లు జలుబు నుంచి తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు కలిగిస్తాయి. ప్రాణాలు కోల్పోవడమూ సంభవమే. కోళ్లు ఇతర ఫౌల్ట్రీ పక్షుల వ్యర్థాలను ముట్టుకోవడం ద్వారా వ్యాధి మనుషులకు వ్యాపించే అవకాశాలు ఎక్కువ. ఒకవేళ ఈ వ్యాధి వస్తే జలుబు, జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందితోపాటు కడుపు నొప్పి, వాంతులు, అతిసారం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

బర్డ్ ఫ్లూ వైరస్ సోకకుండా ఉండాలంటే.. బాగా ఉండికించిన తరువాత మాత్రమే చికెన్, గుడ్లు వంటివి తినాలి. ఉడికించని పక్షి మాంసాన్ని ఇతర ఆహార పదార్థాలకు దూరంగా ఉంచడం మేలు. ఫౌల్ట్రీ రంగంలో పనిచేసేవారు వ్యక్తిగత శుభ్రత కచ్చితంగా పాటించాలి. కోళ్ల ఫారమ్ లలో పనిచేసేటప్పుడు చేతులకు కచ్చితంగా తొడుగులు వేసుకోవటం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవటం, ఎన్ 95 మాస్కులు ధరించడం, పీపీఈ కిట్లు, కళ్లజోళ్లు వాడటం ద్వారా వైరస్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చు.

# ఎర్రబంగారానికి మంచి రోజులు

ఖమ్మం, ఏప్రిల్ 4,

మిర్చి పంటకు సరియైన మద్దతు ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. సాగు సమయంలో చీడపీడలు, ప్రకృతి విపత్తుల నుంచి వంటలను కాపాడుకొని ఆశించిన దిగుబడులు సాధించినప్పటికీ పంట విక్రయించే సమయంలో ధర లేక దివాలు తీస్తున్నారు. అయితే, ఇన్నాళ్లు స్తబ్దతగా ఉన్న మిర్చీ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్ లో కదలికల వల్ల మిర్చి యార్డులో ధరలు కొంతమేర పుంజుకుంటున్నాయి. మిర్చి రకాన్ని బట్టి క్వింటాల్ కు సగటున రూ.300 నుంచి రూ.500 వరకు ధరలు అదనంగా చెల్లించి వ్యాపారులు కొనుగోళ్లు జరుపుతున్నారు. దీంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్ మార్కెట్లతోపాటు ఏపీలోని గుంటూరు నుంచి విదేశాలకు మిర్చి ఎగుమతులు క్రమంగా ఊపందుకుంటున్నాయి. దీంతో మిర్చీకి డిమాండ్ కొనసాగోంది. మిర్చి ధరలు పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైంది.. మన రైతులు పండించిన మిర్చి రకాలు చైనా, మలేషియా, థాయిలాండ్, వియాత్నాం, ఇండోనేషియా దేశాలకు ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీనికితోడు ఇటీవల వరకు ధరలు తక్కువగా ఉండటంతో దేశీయంగా కారంపొడి తయారీ కంపెనీలు మిర్చీ నిల్వలు పెంచుకుంటున్నాయి. దీంతో మిర్చికి డిమాండ్ ఉంటోంది. ఫలితంగా మార్కెట్లకు వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్మకాలు జరుగుతున్నాయని, ఈ పరిణామాలు ఇన్నాళ్లు ధరలు లేక ఇబ్బంది పడు~~తున్న రైతులకు ఊరట~~నిచ్చే అంశమని వ్యాపారులు



చెబుతున్నారు. ప్రస్తుతం తేజా రకం మిర్చి ఖమ్మం మార్కెట్ కు రోజువారీగా 19వేల నుంచి 20వేల క్వింటాళ్ల వరకు వస్తోంది. గత నెల వరకు క్వింటా రూ.11వేల నుంచి 12వేల వరకు పలికి ధరలు.. ప్రస్తుతం రూ.13వేల నుంచి రూ.13500 వరకు పలుకుతోంది. వరంగల్ మార్కెట్ కు రోజువారీగా తేజా రకం మిర్చి 6వేల క్వింటాళ్లకు పైగా వస్తుంది. రూ.13వేల వరకు క్వింటా ధర పలుకుతుంది. అదేవిధంగా వండర్ హాట్ రకం రూ. 14వేల నుంచి రూ.15,500 వరకు ధర పలుకుతుంది.

# జూన్ 2 నుంచి ఇంటర్ క్లాసులు

## క్యాలెండర్ రిలీజ్ చేసిన ఇంటర్ బోర్డు

హైదరాబాద్, ఏప్రిల్ 4,

తెలంగాణలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి జూనియర్ కాలేజీల అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పనిదినాలు, తరగతులు, సెలవులు, పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య కొత్త అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. దీనిప్రకారం.. వచ్చే విద్యాసంవత్సరం మొత్తం 226 పనిదినాలుగా ఇంటర్ బోర్డు నిర్ణయించింది. వేసవి సెలవుల తర్వాత జూన్ 2 నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభంకానున్నాయి. 2026 మార్చి 31 తేదీని విద్యాసంవత్సరం చివరి పనిదినంగా నిర్ణయించారు. ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాది సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు దసరా సెలువులు ఇవ్వనున్నారు. దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 6న కాలేజీలు పునఃప్రారంభంకానున్నాయి. అదేవిధంగా.. వచ్చే ఏడాది(2026) జనవరి 11 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు.

మార్చి మొదటి వారంలో ఇంటర్ పరీక్షలు..

? జనవరి 19 నుంచి 24 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు, ఫిబ్రవరి మొదటి వారంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అడకమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. మార్చి మొదటి వారంలో ఇంటర్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు క్యాలెండర్‌లో పేర్కొన్నారు. ఇక 2026 మే చివరి వారంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

- విద్యార్థులకు నవంబర్ 10 నుంచి 15 వరకు అర్ధ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది.

వేసవి సెలవులు ఎప్పుడంటే?

విద్యాసంవత్సరంలో వేసవి సెలవులు 2026 ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు ఇవ్వనున్నట్లు క్యాలెండర్‌లో ఇంటర్ బోర్డు స్పష్టంచేసింది. వచ్చే ఏడాది జూన్ 1వ తేదీన జూనియర్ కాలేజీలు పునః ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు ప్రకటించింది.

ఇంటర్ అకడమిక్ క్యాలెండర్..

- ఇంటర్మీడియేట్ తరగతులు ప్రారంభం: 02.06.2025.
- దసరా సెలవులు: 28.09.2025 - 05.10.2025.
- అర్ధ సంవత్సరం పరీక్షలు: 10.11.2025 - 15.11.2025.
- సంక్రాంతి సెలవులు: 11.01.2026 - 18.01.2026.
- ప్రీ ఫైనల్ పరీక్షలు: 19.01.2026 - 24.01.2026.
- ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు: 2026, ఫిబ్రవరి మొదటి వారంలో.
- ఇంటర్ వార్షిక పరీక్షలు: 2026 మార్చి మొదటి వారంలో
- విద్యాసంవత్సరం చివరి పనిదినం: 31.03.2026.
- వేసవి సెలవులు: 01.04.2026 - 31.05.2026.
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు: 2026, మే చివరి వారంలో.

# కరీంనగర్ మాస్టర్ ప్లాన్ రెడీ

కరీంనగర్, ఏప్రిల్ 4,

కరీంనగర్ పట్టణంతో పాటు పరిసరాల్లో ఉన్న 62 గ్రామాల పరిధిలో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసేందుకు శాతవాహన అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (సుడా) రూపొందించిన మాస్టర్ ప్లాన్-2041ను అధికారులు సిద్ధం చేశారు. అమృత్ స్కీమ్ గైడ్లైన్స్, అర్బన్ డెవలప్మెంట్ ప్లాన్స్ ఫార్ములేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్(యూడీపీఎఫ్) మార్గదర్శ కాలను అనుసరించి ఈ మాస్టర్ ప్లాన్ ను అభివృద్ధి చేశారు. ఇందుకు ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ కూడా మొదలుపెట్టారు. మాస్టర్ పై ఏమైనా అభ్యంతరాలుంటే 90 రోజుల్లో తెలియజేయవచ్చని ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్లో సుడా చైర్మ న్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెల్లడించారు. దీనిపై స్థానికంగా పలువురు తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారుప్రస్తుతం అమలులో ఉన్న సుడా మాస్టర్ ప్లాన్-2019ను అప్పటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్ ప్రకారం కొత్త సరిహద్దులు నిర్ణయించారు. దీని ప్రకారం సుడా పరిధి తూర్పున తాహెర్ కొండాపూర్, ఈశాన్య మూల నుంచి మొదలై చెర్లభూత్కూర్, ముగ్దుంపూర్ చేగుర్తి. లింగాపూర్, అన్నారం, ఈదులగట్టెపల్లి గ్రామ సరిహద్దుల వెంబడి చెంజర్ల సరిహద్దు వరకు ఉంటుంది. పడమర వైపు గునుకుల కొండాపూర్ సరిహద్దు నైరుతి మూల నుంచి మొదలై ఉత్తరం దిక్కువెళ్తూ జంగపల్లి, మాదాపూర్, కాశీంపేట, పారువెల్ల, కాజీపూర్, ఒద్యారం. నాగులమాల్యాల, వెలిచాల, వెదిర, కిష్టాపూర్ సరిహద్దు వెంబడి వాయువ్య మూల వరకు మాస్టర్ బౌండరీగా నిర్ధారించారు. దక్షిణాన చెంజర్ల సరిహద్దు ఆగ్నేయ మూల నుంచి మొదలై పడమర వైపునకు వెళ్తూ మన్నెంపల్లి, నుస్తులాపూర్, కొత్తప ల్లి (పీఎన్), రేణికుంట, గునుకుల కొండాపూర్, సరిహద్దు నైరుతి మూల వరకు హద్దులుగా నిర్ణ యించారు. ఉత్తరాన కిష్టాపూర్ సరిహద్దు, దేశరాజ్ పల్లి, కోనేరుపల్లి, రుక్మాపూర్, కొలిమికుంట చాకుంట, చామనపల్లి తాహేర్ కొండాపూర్ ఈశాన్యం మూల వరకు సరిహద్దుగా ఉంది. వాణిజ్యం, మిశ్రమ, పరిశ్రమల జోన్లు కరీంనగర్లోని ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ప్రాంతాన్ని వాణిజ్య అవసరాలకే వినియోగిస్తున్నప్పటికీ అవి రెసిడెన్షియల్ జోన్ పరిధిలో ఉన్నాయి. అందుకే నగరంలోని ప్రధాన రహదారులను వాణిజ్య జోన్ల పరిధిలోకి తీసుకొచ్చారు. నివాసప్రాం తాలు, వాణిజ్య కేంద్రాలు కలిసి ఉన్న ఏరియాలను మిశ్రమజోన్లుగా ప్రతిపాదించారు. కరీంనగర్ భవిష్యత్ ఆర్థిక అభివృద్ధి కోసం స్పెషల్ ఇండ స్ట్రీయల్ జోన్లను మాస్టర్ ప్లాన్ లో ప్రతిపాదించారు. 2.289 హెక్టార్లలో ఇండస్ట్రీయల్ జోన్ గా నిర్ధారించారు. ఈ జోన్ పరిధిలోకి ఆసిఫ్ నగర్, ఒద్యారం, నాగులమల్యాల (కొంతభాగం), చెంజర్ల(కొంత భాగం), ఎలగందల్(కొంత భాగం), బద్ధిపల్లి(కొంత భాగం) రానున్నాయి. కరీంనగర్ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించామని సుడా చైర్మెన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. సుమారు 30ఏళ్ల క్రితం నాటి మాస్టర్ ప్లాన్ అమలవుతోందని నగరం చాలా విస్తరించిన నేపద్యంలో రాబోయే అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. నగరం ఇంకా చాలా విస్తరించే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపద్యంలో పాత సుడా పరిధి యూనిట్ గా కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యిందని చెప్పారు. దీంతో ఒక ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి జరుగుతుందని, ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ జోన్, రెసిడెన్షియల్ జోన్, సెమీ కమర్షియల్, సెమీ రెసిన్షియల్ గా గుర్తించి వాటిని మాస్టర్ ప్లాన్లో పొందుపరిచామని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, వరంగల్ తరహాలో కరీంనగర్ కు రింగు రోడ్డును ప్రతిపాదించారు. ఇది సుమారు 20 గ్రామాల సరిహద్దుల మీదుగా పోనుంది. 200 ఫీట్ల వెడల్పుతో 138 కిలో మీటర్ల పొడవైన ఔటర్ రింగ్ రోడ్ ను నిర్మిస్తారు. కరీంనగర్-హైదరాబాద్ రాజీవ్ రహదారిని కలుపుతూ ఓఆర్ఆర్ లో ఒక భాగం గనుకుల కొండాపూర్, జంగపల్లి, మాదాపూర్, ఖాసింపేట, పారువెల్ల, ఒద్యారం, నాగుల మల్యాల, కొక్కెరకుంట, వెలిచాల శివారు మీదుగా వెళ్లి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిని కలుస్తుంది. కొత్తపల్లి పట్టణం దాటిన తర్వాత కరీంనగర్- జగిత్యాల రహదారి నుంచి కొక్కెరకుంట, జూబ్లీనగర్, ఎలబోతారం, ఇరుకుల్ల, దుర్శేడు, బొమ్మకల్ గ్రామ శివారు నుంచి మానేరు నది మీదుగా మానకొండూరు, ముంజంపల్లి పోరండ్ల, నుస్తులాపూర్ వద్ద రాజీవ్ రహదారితో కలుస్తుం ది. హైదరాబాద్ ను కలిపే కొత్తపల్లి-మనో హరాబాద్ రైల్వేలైన్ పూర్తయితే నగరం కనెక్టివిటీ మరింత విస్తారంగా మారుతుంది.

# వైద్యధికారిని విధుల నుండి తొలగించాలి

నర్సంపేట ఏప్రిల్ 4

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆశాపోస్టుల నియామకంలో అవినీతికి పాల్పడినట్టు వచ్చిన వార్త కథనాలపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి విధుల నుండి బహిష్కరించాలని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు.

కొత్తగా ఆశాలను రిక్రూట్ చేసుకోవాలంటే హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నుండి నోటిఫికేషన్ జారీ అయిన తర్వాతే ఆశాల నియామకాలు చేపట్టాలని సర్కిలర్ ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా అధికారి చేతివాటం తీసుకొని వరంగల్ జిల్లాలో సుమారు 20 మంది ఆశాలను ఎలా రిక్రూట్ చేశారని ప్రశ్నించారు.

ఇన్చార్జి జిల్లా నర్సింగ్ అధికారిగా తప్పించి తను గతంలో నిర్వహించిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విధులను అప్పగించడం శాఖా పరమైన చర్యలు తీసుకున్నట్లు ఎలా అవుతుందని, దీని వెనకాల రాజకీయ ఒత్తిడిలు ఉన్నాయని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా ఉన్న అధికారి ఆశా వర్కర్ల పైన గతంలో కూడా మానసిక ఒత్తిడికి గురిచేసి అనేక ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, హమాలి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

====================================

# రైతులు నేరుగా రైతుబజార్ లో కూరగాయలు అమ్ముకునేలా చర్యలు: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు



భారత శక్తి, ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ -3 :రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా రైతు బజార్ లో అమ్ముకునేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఖమ్మం నగరం 44వ డివిజన్ శ్రీరామ్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు 58.50 లక్షలతో షెడ్లు, ప్లాట్ ఫాంలను నిర్మించి రైతు బజార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులు సొంతంగా నేరుగా అమ్ముకునేందుకు సౌకర్యంగా ఉండాలని గతంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ లో నేడు ఫ్లాట్ ఫాం, షెడ్లు నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. పేద రైతుల కోసం కలెక్టర్ మంచి హృదయంతో ఈ పనులు పూర్తి చేశారని తెలిపారు. మార్కెట్ లో పంట పండించే రైతులకు మాత్రమే స్థానం ఇవ్వాలని, దళారులకు ఎట్టి పరిస్థితిలో అవకాశం ఇవ్వకూడదని, ఖమ్మం చుట్టుపక్కల ఉన్న రైతులు నేరుగా వచ్చి అమ్ముకోవాలని, అప్పుడు రైతులకు ఒక రూపాయి మిగలడంతో పాటు స్థానిక ప్రజలకు తాజా కూరగాయలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను త్వరలోనే ప్రారంభించేలా మార్కెటింగ్ శాఖ సంచాలకులకు ఆదేశాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రైతుకు వచ్చే లాభాలు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రైతు బజార్ ప్రారంభించామని అన్నారు. రైతులు ఏ పంటలు పండించాలి, ఎలా పండించాలి అనే అంశాలపై దృష్టి సారించి లాభసాటి సాగు గురించి జిల్లాలో మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని కలెక్టర్ తెలిపారు. మధ్యవర్తులను నివారిస్తూ రైతులకు అధిక లాభం లభించేలా రైతు బజార్ లను ఏర్పాటు చేశామని, 35 లక్షలతో గాంధీ చౌక్ వద్ద మరో మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, మరో నెల రోజులలో ఆ మార్కెట్ సిద్ధం చేస్తామని అన్నారు. ఈ రైతు బజార్ వద్ద రైతులు నుంచి నేరుగా వినియోగదారులు కూరగాయలను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా వేగవంతం చేయాలి: రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి

**-13 వేల కోట్లు ఖర్చు చేసి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉచిత సరఫరా**

**-నూతన రేషన్ కార్డు దరఖాస్తుల స్క్రూటిని వేగవంతం చేయాలి**

**-సన్న బియ్యం సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్, సి.ఎస్.**






ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), ఏప్రిల్ 04:రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి, సన్న బియ్యం సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 40 రూపాయలు పైగా కిలో బియ్యానికి వెచ్చించి ప్రజలకు ఉచితంగా దొడ్డు బియ్యం సరఫరా చేశామని, చాలా పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ప్రజలకు బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీ 70 నుంచి 80 శాతం వరకు ఆ బియ్యాన్ని ప్రజలు తినేవారు కాదని, రీసైక్లింగ్ ద్వారా కోళ్ల ఫారాలకు, ఇతర అవసరాలకు తరలి వెళ్లేదని తెలిపారు. మన రాష్ట్రంలో అత్యధిక జనాభా దొడ్డు బియ్యం తినడం ఆపేసారని, దీనిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టామని అన్నారు. సన్న బియ్యం సరఫరా పంపిణీ విజయవంతం అవుతుందని, పేదలు, ప్రజలు సన్న బియ్యం సంతోషంతో స్వీకరిస్తున్నారని అన్నారు. రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా రవాణా వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్న బియ్యం రవాణాపై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. 13 వేల కోట్లు ఖర్చు చేసి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, సన్న బియ్యం సరఫరా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా లాంచ్ చేయడం జరిగిందని, దీనికి కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కారణంగా రేషన్ షాపుల వద్ద ఒకేసారి డిమాండ్ పెరిగి పోతున్నందున బియ్యం రవాణా వేగవంతం చేయాలని, రేషన్ షాపుల వద్ద అవసరమైన మేర బియ్యం అందుబాటులో పెట్టాలని అన్నారు. పేదల ఇంటికి సన్న బియ్యం సరఫరా అతి గొప్ప విజయమని అన్నారు. నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల స్క్రూటిని వేగవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాల లక్ష్యాలను అధిగమించాలి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి




వైయస్సార్ జిల్లా, ఏప్రిల్ 4(భారత శక్తి) : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించాల్సిన ప్రగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించి జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో డివిజన్ల వారీగా టార్గెట్లు కేటాయించి సాగుబడి విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులు పాటించేలా అవగాహన పెంచాలన్నారు. ప్రధానంగా విత్తనాల ఉత్పత్తి , పంటల మార్పులు, మైక్రో న్యూట్రియన్స్ పై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల పంటల సాగుబడిని పెంపొందించాలని ఆ దిశగా రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. అలాగే ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తూ మండలం,గ్రామాల వారీగా ఆయా ప్రాంతాల్లో పండ్లు, పూలు సాగుకు అనుకూలమైన తోటల పెంపకాన్ని చేపట్టేలా రైతులకు అవగాహన పెంచాలన్నారు. మార్కెట్ లక్ష్యాలకు అనుగుణంగా చీని, అరటి పంటల కొత్త రకాలను ప్రోత్సహిస్తూ సాగు చేసే విధంగా రైతులను సిద్ధం చేయాలన్నారు. అలాగే మండలాల్లో ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించేలా రైతుల్లో అవగాహన పెంచాన్నారు. ఎపిఎంఐపీ ద్వారా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖను మరింత విస్తృతం చేస్తూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. మత్స్య శాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని రిజర్వాయర్లు, నీటి వనరు ఉన్న ప్రాంతాల్లో చేపల ఉత్పత్తిని పెంపొందించాలన్నారు. ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులు ఆయా రంగాలలో నిర్దేశించిన లక్ష్యాలను యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టం పై రిపోర్ట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జీడి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారదా, ఉద్యాన శాఖ జిల్లా అధికారిని సుభాషిని,ఏపీఎంఐపి పీడీ వెంకటేశ్వర రెడ్డి, మార్కెటింగ్ శాఖ, మత్స్యశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి







ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), ఏప్రిల్ 04:ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రోడ్డు నిర్మాణ పనులను 10 రోజులలో ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి, నేలకొండపల్లి మండలం కట్టుకాచారంలో పర్యటించి ప్లాన్ నిధులు 3 కోట్లతో చేపట్టిన రాయగూడెం - తక్కెళ్లపాడు వయా కట్టుకాచారం రహదారి వరకు చేపట్టిన రోడ్డు అభివృద్ధి, పటిష్ట పరచు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత సెప్టెంబర్ నెలలో రికార్డు స్థాయిలో కురిసిన వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, రోడ్లు దెబ్బతిన్నాయని, తాత్కాలిక రోడ్ల మరమ్మత్తు, విద్యుత్ లైన్ లు పునరుద్ధరణ, ఇండ్లలోకి నీరు వచ్చిన కుటుంబాలకు పరిహారం, ఇసుక మేటలు వచ్చిన పొలాలకు సైతం నష్ట పరిహారం అందించామని అన్నారు. పాలేరు నియోజకవర్గం పరిధిలో 950 కోట్ల పైగా రోడ్డు పనులు మంజూరు చేశామని అన్నారు. జంక్షన్ నుంచి కట్టుకాచారం వరకు 3 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులకు టెండర్లు పూర్తి చేశామని, రాబోయే 10 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కట్టుకాచారం నుంచి బుట్లగుంట వాగు వరకు 2.5 కోట్లతో రోడ్డు పనులు మంజూరు చేశామని అన్నారు. కట్టుకాచారం నుంచి తక్కెలపాడుకు 2 కోట్లు, గ్రామంలో అంతర్గత సిసి రోడ్లకు 41.5 లక్షలు మంజూరు చేశామని, రోడ్డు నిర్వహణకు కోటి 68 లక్షలు, గ్రామం మొత్తం మీద 6 కోట్ల 61 లక్షల పనులు మంజూరు చేశామని, వీటిని 10 నుంచి 15 రోజుల వ్యవధిలో ప్రారంభిస్తామని అన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే బస్సు మంజూరు చేస్తామని అన్నారు. రాబోయే వారం రోజుల్లో రేషన్ కార్డులను మంజూరు చేస్తామని అన్నారు. రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. శ్రీరామ నవమి తర్వాత బహు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. 25 లక్షల 65 వేల మంది రైతులకు 20 వేల 671 కోట్ల రూపాయల 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రైతు బంధు నిధులను చెల్లించామని అన్నారు. వానాకాలం పంటలో సన్న రకం పండించిన ధాన్యానికి బోనస్ అందించామని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పెట్టుబడి కంటే అధికంగా ఎకరానికి 12 వేల రూపాయలు రైతు భరోసా నిధులు అందిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో ధాన్యం పండిస్తున్నారని అన్నారు. యాసంగి లో కూడా రైతులు పండించిన ధాన్యానికి బోనస్ చెల్లిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నేలకొండపల్లి మండల తహసీల్దార్ మానిక్ రావు, ఎంపిడివో ఎర్రయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్, కోదాడ అభివృద్ధి పనులపై సమీక్ష

**ఆలస్యాలపై అధికారులను గట్టిగా హెచ్చరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,**



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 04: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మరియు కోదాడ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జలసౌధలో జరిగిన సమీక్ష సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సాగునీటి మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నటకాణి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమగ్ర సమీక్ష సందర్భంగా, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూ స్వాధీనం పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆలస్యాలుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంట సీజన్ ముగిసిన నేపథ్యంలో, అధికారులు ఈ విరామ సమయంలో భూస్వాధీనం ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. భూస్వాధీనం యుద్ధప్రాతిపదికన పూర్తవ్వాలి మరియు సంబంధిత ఏజెన్సీలకు భౌతిక హక్కు అప్పగించాలి. పమ్‌హౌస్ నిర్మాణం మరియు పైపులైన్లు వేసే పనులు సమాంతరంగా జరగాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట గడువును నిర్ణయించాలన్నారు. వేళలల్లో ఎటువంటి ఆలస్యం ఉంటే తీవ్ర చర్యలు తీసుకుంటాను. తరువాతి సమీక్షలో పురోగతి కనపడకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మంత్రి అధికారులను గట్టిగా హెచ్చరించారు. ప్రజా ప్రయోజనమే మన ప్రయోజనం అని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్ మరియు కోదాడలోని ప్రాజెక్టులపై సమీక్షలో భాగంగా, ముక్త్యాల బ్రాంచ్ కాలువకు సంబంధించి భూస్వాధీనం పూర్తై, పైపులైన్లు వేయడం జరుగుతోందని అధికారులు తెలిపారు. జనపాడు బ్రాంచ్ కాలువ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై మంత్రి పైపులైన్లు వేయడం త్వరగా పూర్తి చేయాలని, హెడ్‌వర్క్స్‌ను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టును అధికారికంగా జవాహర్ జానపాడు ఎల్‌ఐఎన్ గా పిలవాలని సూచించారు. బెట్టేతండ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, నక్కగూడెం ఎల్‌ఐఎస్, రాజీవ్ గాంధీ ఎల్‌ఐఎస్, రెడ్లకుంట ఎల్‌ఐఎస్, ఉత్తమ్ పద్మావతి ఎల్‌ఐఎస్ తదితర ప్రాజెక్టుల పురోగతిని కూడా సమీక్షించారు. ప్రతి పనికి తాత్కాలిక గడువులు సూచించి, ప్రస్తుత స్థితి, సవాళ్లు, పూర్తి చేసే అంచనా తేదీలపై అధికారులను ప్రశ్నించారు. ప్రధానంగా పాత ప్రాజెక్టుల్లో అలైన్‌మెంట్ మార్పుల వంటి సవాళ్లు ఉన్నాయని అధికారులు తెలియజేశారు. వాటిని ముందే గుర్తించి సాంకేతిక, చట్టపరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే సవరిస్తూ అంచనాలు పంపించాలని, పనులు చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను సానుభూతి చూపకుండా రద్దు చేయాలని ఆదేశించారు. ఒక్కో నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి శాఖ మధ్య సమర్థవంతమైన సమన్వయం అవసరమని అన్నారు. ఇరిగేషన్ కాకుండా ఇతర మౌలిక సదుపాయాల పనులపై కూడా సమీక్ష జరిగింది. కోదాడలో 100 పడకల ఆసుపత్రి, హుజూర్‌నగర్‌లో ఐటీఐ బిల్డింగ్, టౌన్ హాల్, మినీ స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ పురోగతిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సమీక్ష నిర్వహించారు. కోదాడ మరియు హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో నిర్మించాల్సిన వ్యవసాయ కళాశాల మరియు జవాహర్ నవోదయ విద్యాలయాల కోసం తగిన స్థలాలను గుర్తించాలన్నారు. వ్యవసాయ కళాశాల కోసం 100 ఎకరాలు, నవోదయ విద్యాలయం కోసం 25 ఎకరాలు అవసరమని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు ప్రతిష్టాత్మకమైనవిగా పేర్కొంటూ, ప్రభుత్వ భూమి, సాగునీటి శాఖ భూమి లేదా ఇతర అనుకూల భూములను వారం రోజుల్లో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రతి రేషన్ కార్డుదారుడికి ఉచితంగా 6 కిలోల సన్న బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన పథకం గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని నాయకులను కోరారు. ఇది విప్లవాత్మకమైన పథకమని పేర్కొంటూ, రాష్ట్ర జనాభాలో సుమారు 84 శాతం అయిన 3 కోట్ల మందికి భద్రతా ఆహారాన్ని అందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. అన్ని అర్హులైన వారికి వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పంట సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, ఎక్కువ ప్రాంతాలకు నీటిని అందించగలగాలనే లక్ష్యంతో అత్యవసరంగా పనులు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఆర్డీవోలు, కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ జర్నలిస్టుల వేతనాలు, సౌకర్యాల కోసం రాష్ట్రస్థాయి ఉద్యమం





కరీంనగర్, ఏప్రిల్ 4 (భారత శక్తి):గ్రామీణ జర్నలిస్టులకు వేతనాలు,కల్పించాల్సిన సౌకర్యాల సాధనకై రాష్ట్రస్థాయిలో ఉద్యమం చేపట్టనున్నట్టు బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ లు స్పష్టం చేశారు.శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా డబ్ల్యూజేఐ కన్వీనర్ పులి శరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సన్నాహక కమిటీ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా డబ్ల్యూజేఐ నేతలు మాట్లాడుతూ పత్రికా రంగానికి మూల స్తంభాలాంటి గ్రామీణ జర్నలిస్టులు యాజమాన్యాల వెట్టిచాకిరి కోరల్లో నలిగిపోతున్నారని ఆరోపించారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనాలు,పనివేళలు, పీఎఫ్,ఈఎస్ఐ లాంటి సదుపాయాలు ఉండగా,గ్రామీణ జర్నలిస్టులు ఈ సదుపాయాలకు నోచుకోలేకపోవడం శోచనీయమన్నారు.పత్రికా యాజమాన్యాలు గ్రామీణ జర్నలిస్టులను వ్యాపార వస్తువుగా మార్చి వేశాయని,ఆ పరిస్థితుల నుండి వారిని బయటపడేయాల్సిన జర్నలిస్టు సంఘాలు చోద్యం చూస్తూ వచ్చాయని విమర్శించారు. తెలంగాణలో 30 వేలకు పైగా గ్రామీణ జర్నలిస్టుల దుర్భర పరిస్థితులకు ఇంతకాలం వారికి ప్రాతినిధ్యం వహించిన సంఘాల వైఫల్యమే ప్రధాన కారణమని ధ్వజమెత్తారు.విలేకరులకు నయా పైసా వేతనాలు చెల్లించకుండా పనులు చేయించుకుంటున్న పత్రికల యాజమాన్యాలు, దానికే పరిమితం కాకుండా వారిపై ప్రకటనలు, పత్రికల చందాల పేరుతో అంతులేని భారం మోపుతున్నాయని అన్నారు.తెలంగాణ ఏర్పాటు అనంతరం జర్నలిజం వృత్తిలో పరిస్థితులు మెరుగుపడడం మాట అటుంచి, మరింత దిగజారిపోయాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాలలో విలేకరులు,పట్టణ ప్రాంతాల్లో స్ట్రింగర్ల జీవితాలు మరింత దుర్భరంగా మారిపోయాయన్నారు.2014 నుండి ఇప్పటివరకు రాష్ట్రంలో సంభవిస్తున్న జర్నలిస్టుల అకాల మరణాలే వారి పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. 2014 జూన్ నుండి ఇప్పటివరకు 500 మందికి పైగా జర్నలిస్టులు మరణించారని, ఇందులో అత్యధికం గుండెపోటుతో జరిగినవి కాగా, ఆ తర్వాతి స్థానాన్ని కరోనా కాలం ఆక్రమించిందన్నారు. ప్రమాదాలు, లివర్ సంబంధిత వ్యాధులతో మరణించిన జర్నలిస్టులు ఉన్నారని చెప్పారు. వృత్తిలో ఎదురవుతున్న తీవ్ర మానసిక ఒత్తిళ్ళే ఇందుకు ప్రధాన కారణమని, ఆర్థిక సమస్యలు కూడా జర్నలిస్టుల మరణాలకు దోహదం చేస్తున్నాయని చెప్పారు.మీడియా సంస్థల యాజమాన్యాలు విలేకరులపై మోపుతున్న భారం వల్ల వారు తీవ్రంగా కుంగిపోతున్నారని,జిల్లా స్టాపర్లు మొదలుకొని మండల స్థాయి విలేకరుల వరకు సర్క్యులేషన్, అడ్వర్టైజ్మెంట్ల టార్గెట్లను నెరవేర్చాల్సి వస్తున్నదన్నారు.పండుగలు, సంస్థ వార్షికోత్సవాలు, క్యాలెండర్ల ముద్రణ పేరుతో యాజమాన్యాలు పెడుతున్న స్పెషల్ టార్గెట్లు విలేకరులపై మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని,వారిని ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా కుంగదీస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చే అక్రిడిటేషన్ లను కూడా కొన్ని సంస్థల యాజమాన్యాలు తమ చేతుల్లోకి తీసుకొని పాత బకాయిల వసుళ్ళ కోసం వాడుకుంటున్న పరిస్థితులు ఉన్నాయన్నారు.రాష్ట్రంలో ఒకటి, రెండు మినహా మిగతా పత్రికలేవీ వేతన ఒప్పంద సిఫార్సులను అమలు చేయడం లేదని, వేజ్ బోర్డ్ వేతనాలు చెల్లించాల్సి వస్తుందన్న కారణంతో అనేక పత్రికలు విలేకరులకు ఎలాంటి గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని చెప్పారు.అనేక పత్రిక యాజమాన్యాలు న్యూస్ ఏజెన్సీల పేరిట సిబ్బందిని రిక్రూట్ చేసుకుంటున్నాయన్నారు.వేజ్ బోర్డు సిఫార్సులు అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అయిన దానిని పట్టించుకునే నాధుడే కరువయ్యారని వారు విమర్శించారు. వేజ్ బోర్డు సిఫార్సులు పత్రికా యాజమాన్యాలు అమలు చేసి తీరాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పత్రికా సిబ్బందికి సైతం ఇవి వర్తిస్తాయని సుప్రీంకోర్టు ధర్మాసనం 2017 జూన్ 19న తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.అయినప్పటికీ యాజమాన్యాలు ఈ తీర్పును ధిక్కరిస్తూ వస్తున్నాయన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు, గ్రామీణ జర్నలిస్టుల సౌకర్యాలు, హక్కుల సాధనకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం నిర్మించక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గ్రామీణ విలేకరులు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాల్సిన అవసరం ఉందని, అందుకోసం తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో డబ్ల్యూజేఐ నాయకులు యంసాని శ్రీనివాస్, ఆరెల్లి రాధాకృష్ణ, తెలంగాణ ధ్వని జనగాం బ్యూరో చీఫ్ సంగ కిరణ్ ప్రసాద్, రడపాక ప్రదీప్, బండ్ల కరుణాకర్, వల్లాల శివ, కృష్ణమూర్తి, సంగోజు శ్రీనివాస్, జావిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి






కడప, ఏప్రిల్ 4(భారత శక్తి) : జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ పార్కుల ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాలు, లీగల్ క్లియరెన్స్ ప్రక్రియలను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పెండెన్సీపై శుక్రవారం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితి సింగ్, డిఎఫ్ఓ వినీత్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబందిత తహాశీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగుళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి.. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. అలాగే జిల్లాలో ఏర్పాటు చేస్తున్న.. మూడు రకాలైన సోలార్ అనుబంధ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను, ఇతర అనుమతులను క్లియర్ వెంటనే.క్లియర్ చేయాలన్నారు. రోడ్డు విస్తరణ, నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనర్జీ ప్రాజెక్ట పనులకు సంబంధించిన ప్రతిపాధనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు.ఈ ప్రక్రియలో ఎదురయ్యే ఫారెస్ట్, పర్యావరణ అభ్యంతరాలు, సవాళ్లు, కోర్టు కేసులు సంబందిత అంశాలను దాదాపుగా అధిగమించామన్నారు. కాగా ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహాదారుల అభివృద్ధి పనులు, భూసేకరణ పనులకు సంబందించి ఇప్పటికే రిలీజ్ చేసిన అవార్డు వివరాల గురించి సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు సాయిశ్రీ, చిన్నయ్య, ఎన్ హెచ్ఏఐ ఎస్డీసి వెంకటపతి, పీడి అశోక్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు వేణుగోపాల్, సుదర్శన్ కుమార్, ఆర్%డ%బి నేషనల్ హైవే ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, నెడ్ క్యాప్ జిల్లా అభివృద్ధి అధికారి ఎల్లారెడ్డి, వివిధ సోలార్ పవర్ ప్రాజెక్టుల ప్రనిధులు, ఫారెస్ట్, భూసేకరణ, రెవెన్యూ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కడపను డయేరియా డయేరియా రహిత జిల్లాగా మార్చాలి: జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



కడప, ఏప్రిల్ 4(భారత శక్తి): వైఎస్ఆర్ జిల్లాను డయేరియా రహిత, ఆరోగ్యసహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి ఏప్రిల్ 15 నుండి డయేరియా (అతిసార) నియంత్రణ క్యాంపెన్ పై జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ విస్తృతంగా చేపట్టి విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు మైక్రో ప్లాన్ అమలు చేయాలన్నారు. జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ/ మానిటరింగ్ మెకానిజం అత్యంత ముఖ్యంగా అమలు చేయాలన్నారు. ఈ విషయమై వర్క్షాప్ నిర్వహించాలని, డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ఆశా వర్కర్ ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఐఈసి యాక్టివిటీలను చేపట్టాలన్నారు. అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య పరిరక్షణా చర్యలు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ అధికారులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు/జింక్ కార్నర్ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం మరియు తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. ఎక్కడా అతిసార, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అనుబంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం క్యాంపెయిన్ కు సంబంధించిన గాడ్ పత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. నాగరాజు, ఇంచార్జ్ డిపివో ఖాదర్ బాషా, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. రమాదేవి, ఎపిడమాలజిస్ట్ ఖాజా మోహిద్దీన్, ఐఎంఏ వైద్యులు, డిఆర్డీఏ, ఐసిడిఎస్, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డబ్ల్యు ఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 6 యేండ్ల లోపు వారిని అంగన్వాడీల్లో చేర్పించాలి

## -మహిళలందరికీ వైద్య పరీక్షలు పరీక్షలు పూర్తి చేయాలి

## -శుక్రవారం సభలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి






కరీంనగర్, ఏప్రిల్ 4(భారత శక్తి):ఆరు సంవత్సరాలలో పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తల్లిదండ్రులకు సూచించారు.తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చదువుతోపాటు ఆరోగ్యం పై శ్రద్ధ వహిస్తారని అన్నారు. నూతన సిలబస్ తో ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లతో అంగన్వాడీల్లో బోధిస్తున్నామని అన్నారు.

పిల్లలు ఎత్తుకు తగిన బరువుతో ఆరోగ్యంగా ఉండేలా అంగన్వాడీల్లో శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. పిల్లలందరిని అంగన్వాడీలకు పంపించాలని సూచించారు.ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పర్లపెల్లి గ్రామంలోని మహిళలందరూ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 50 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఇదివరకే ఈ గ్రామంలో రెండు సార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించామని, వచ్చే నెలలో మరో సారి క్యాంపు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేసే ఈ క్యాంపును నూరు శాతం మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు కూడా ఇక్కడ ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. ఆరోగ్య మహిళ పరీక్ష ద్వారా ప్రమాదకరమైన వ్యాధులను ముందుగా గుర్తించి నివారించవచ్చని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మహిళలు, పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలు, సేవల గురించి శుక్రవారం సభలో తెలియజేస్తామని అన్నారు.

మహిళలు తమ సమస్యలను ఈ సభలో అధికారుల దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. శుక్రవారం సభ ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మహిళల్లో రక్తహీనతను నివారించగలుగుతున్నామని అన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, సిడిపిఓ శ్రీమతి పాల్గొన్నారు.

# స్మార్ట్ కిడ్జ్ లో సంబురం గా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు.

## జాతీయ సైన్స్, మ్యాథ్స్, రంగోత్సవ్ విజేతలకు బహుమతుల ప్రధానం.




ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), ఏప్రిల్ 04:స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం ఐదో తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సంబురంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. నర్సరీ తరగతి నుంచి 5వ తరగతి వరకు గత ఎనిమిది సంవత్సరాలుగా తమ పాఠశాలలో విద్యను అభ్యసించి ఐదవ సంపూర్ణ విద్యాభ్యాసాన్ని ముగించుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ఉత్సవంలో సాంప్రదాయ సిద్ధంగా పట్టాలను అందించారు . ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల నిర్వహించిన దశాబ్ద కాలంలో విద్యార్థులకు బాల్య విద్యాభ్యాసాన్ని శతాబ్ది కాలం గుర్తుండేలా విద్యార్థులను ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తమ పాఠశాలలో నర్సరీలో చేరి ప్రస్తుతం ఐదవ తరగతి విద్యాభ్యాసాన్ని ముగించుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించడం వారికి చిరస్థాయిలో గుర్తుండేలా చేస్తున్నదని పేర్కొన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల విద్యను, సహా పాఠ్యాంశాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక విద్యా ప్రణాళికతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడులో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య అందజేశారు. రంగోత్సవ్ సెకండ్ లెవెల్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.



# అత్యంత ఖరీదైన ఆటగాడు... దానర్థం అది కాదు: వెంకటేశ్ అయ్యర్




ఐపీఎల్ 2025 సీజన్‌లో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో మూడో క్రికెటర్ వెంకటేశ్ అయ్యర్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న వెంకటేశ్ తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై హాఫ్ సెంచరీ సాధించాడు. కేవలం 29 బంతుల్లోనే 60 పరుగులు చేశాడు. అయితే, తొలి రెండు మ్యాచుల్లో 9 పరుగులు మాత్రమే చేశాడు. ఐపీఎల్ వేలంలో వెంకటేశ్ అయ్యర్‌ను కేకేఆర్ రూ.23.75 కోట్లకు దక్కించుకుంది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్ అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ.. అత్యధిక పెయిడ్ క్రికెటర్ అయినంత మాత్రాన ప్రతి మ్యాచ్‌లోనూ పరుగులు చేయాలనేమీ లేదని వ్యాఖ్యానించాడు.

‘‘ఒక్కసారి ఐపీఎల్ మ్యాచులు ప్రారంభమైతే.. ప్లేయర్ అమ్ముడైంది రూ.20 లక్షలకా? రూ.20 కోట్లకా?అనేది అవసరం లేదు. ఇక్కడ డబ్బు మన ఆటను నిర్దేశించదు. మా జట్టులో రఘువంశీ యువ క్రికెటర్.. అద్భుతంగా ఆడాడు. ఇక్కడే హై పేమెంట్, అంచనాలపై ప్రశ్నలు వస్తాయి. అయితే, నేను జట్టు విజయంలో ఎప్పుడూ భాగస్వామ్యం అయ్యేందుకు ప్రయత్నించే క్రికెటర్‌ను. కొన్ని బంతులే ఉన్నప్పుడు దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తా. అప్పుడు పరుగులు చేయలేకపోయినా.. వేగంగా ఆడే ప్రయత్నం మాత్రం ముఖ్యం. నా జట్టు కోసం ఏదైనా చేస్తా. ఇక్కడ నేను అత్యధిక మొత్తం అందుకొనే క్రికెటర్‌నైనా ప్రతి మ్యాచ్‌లోనూ పరుగులు చేయాలని దానర్థం కాదు. ఐపీఎల్ మ్యాచ్ అంటేనే ఒత్తిడి ఉంటుంది. జట్టు విజయం కోసం ఏం చేశామనేదే కీలకం. అందులో నేనెప్పుడూ వెనకడుగు వేయను’’ అని వెంకటేశ్ తెలిపాడు. బౌలింగ్ ఎవరని చూడను..

సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో చివరి 12 బంతుల్లో వెంకటేశ్ అయ్యర్ రెండు బంతులు, రెండు సిక్స్‌లు బాదాడు. ఇన్నింగ్స్ 19వ ఓవర్‌ను పాట్ కమిన్స్ వేయగా.. 20 పరుగులు రాబట్టాడు. దీనిపై అయ్యర్ స్పందిస్తూ.. ‘‘అక్కడ ఎవరు బౌలింగ్ చేస్తారనేది పట్టించుకోను. ఎలా బౌలింగ్ చేస్తాడనే దానిపై దృష్టిపెడతా. ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్‌ను చూసి హిట్టింగ్ చేయడానికి ప్రయత్నిస్తా’’ అని వ్యాఖ్యానించాడు.

# చాహల్‌తో డేటింగ్ రూమర్స్.. తన రిలేషన్ గురించి చెప్పేసిన మహ్‌వశ్

భారత క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ ( రేడియో జాకీ మహ్‌వశ్ ప్రేమలో ఉన్నారని గత కొంతకాలంగా రూమర్స్ వస్తున్నాయి. ఈ క్రమంలో తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి మహ్‌వశ్ స్పందించింది. ఈ మేరకు ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడింది.

‘‘నేను ఇప్పుడు సింగిల్‌గా, సంతోషంగా ఉన్నాను. వివాహానికి సంబంధించిన ప్రస్తుతం ఉన్న భావన నాకు అర్థం కాలేదు. నేను ఎవరినైనా పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు వారితో మాత్రమే డేటింగ్‌కు వెళ్లే వ్యక్తిని. ఏదో అలా డేటింగ్‌కు వెళ్లే మనిషిని కాదు. ప్రస్తుతం నేను పిల్లలు, భవిష్యత్తు గురించి ఊహించుకోవడం మొదలుపెట్టాను’’ అని మహ్‌వశ్ వెల్లడించింది.

ఇంతకుముందు కూడా ఆమె ఈతరహా పోస్టు పెట్టింది. ‘‘నా జీవితంలోకి ఏ అబ్బాయి అయితే వస్తాడో.. అతనే ఏకైక వ్యక్తి అవుతాడు. అతడే నాకు స్నేహితుడు. అతనే నా ప్రియుడు. అతనే నా భర్త. నా జీవితం అతడి చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. నాకు అవసరం లేని వ్యక్తులు వద్దు.

# ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

## -పరిష్కరించని యెడల నిరసన తప్పవు

## -జేపీసీ జిల్లా ఛైర్మన్ దారం ఆధ్వర్యంలో సూడా ఛైర్మన్ కు వినతి

కరీంనగర్, ఏప్రిల్ 4(భారత శక్తి):ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం ప్రకటించాలని, లేని పక్షంలో నిరసనలు తప్పవని ఎంప్లాయిస్ జే ఏ సి ఛైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళి చరణ్ లు అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోని సూడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఛాంబర్లో ఆయనను మర్యాదపూర్వకంగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ కాళి చరణ్ లు సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి తో ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావల్సిన జీతభత్యాలు, పెన్షనర్ బేనిపిట్స్, పెండింగ్ బిల్లులు, ఎంప్లాయిస్ హెల్త్ కార్డు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితిలో వస్తాయని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమ గురించి ఆలోచించాలని మి ద్వారా కోరుతున్నామని చెప్పారు. ప్రజలను, ప్రజా ప్రతినిధులను కంటికి రెప్పలా కాపడుకునేది మా ప్రభుత్వ ఉద్యోగులే అని నరేందర్ రెడ్డికి వివరించారు. తుపాకులకు భయపడే రోజులు పోయాయని, తుమ్మితే భయపడే రోజులు వచ్చినపుడు తమ ప్రాణాలు పణంగా పెట్టీ కరోనా కష్టకాలంలో ప్రజలందరినీ కాపడుకున్నమని చెప్పారు. విష జ్వరాలు ప్రబలినప్పుడు ప్రజలకు విద్యాబుద్ధులు చెప్పేది ఉద్యోగులే అన్నారు. రాత్రనక, పగలనక, ఎండనక, వననక పీకటింగులు, బందోబస్తులు, ప్రజల ఆస్తులను మాన ప్రాణాలను కాపాడేది మా పోలీసు ఉద్యోగులేనని చెప్పాడు. మాకు న్యాయ బద్ధంగా రావల్సిన ఐదు డీ ఎ లు, కుబేర్ ద్వార కాకుండా జిల్లా ట్రెజరీ నుంచి ఇప్పించాలని కోరారు. మాకు రావని ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగమే జీవనాధారంగా జీవించి బ్రతికే మా ఉద్యోగులకు జీవం పోసి బ్రతికించండీ కానీ మా జీవం తీయకండి, మా ఆర్తనాదాలు, ఆక్రందనను సమస్యలను ప్రభుత్వానికి విన్నవించనాలని కోరారు. కొంత మంది ఆకతాయిలు చేసే అల్లరి చేష్టలకు మా ఉద్యోగులు బలవుతున్నారని చెప్పారు. వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో అంకితభావంతో మా ఉద్యోగులు పనిచేసిన మా ఉద్యోగులపై పనికట్టుకుని బురద చల్లుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం



చేయాలని కోరారు.

వెంటనే మా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతారని ఆశిస్తున్నామని చెప్పారు. ప్రజలను ప్రజా ప్రతినిధులను కడుపులో పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడుకునేది మా ప్రభుత్వ ఉద్యోగులే... తుపాకులకు భయపడే రోజులు పోయి తుమ్మితే భయపడే రోజులు వచ్చినప్పుడు.. తమ ప్రాణాలను పణంగా పెట్టి కరోనా కష్టకాలంలో ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడింది మా ప్రభుత్వ ఉద్యోగులే... విష జ్వరాలు ప్ర ఉద్యోగమే జీవనాధారంగా జీవించి బ్రతికే మా ఉద్యోగులకు జీవం పోసి బ్రతికించండి కానీ మా జీవం తీయకండి అని చెప్పారు. కొంతమంది ఆకతాయిలు చేసే అల్లరి చేష్టలకు మా ఉద్యోగులు బలవుతున్నారని, వృత్తినే దైవంగా భావించి విధి నిర్వహణలో అంకితభావంతో మా ఉద్యోగులు పనిచేసిన కొంతమంది మా ఉద్యోగులపై బట్ట కాల్చి మీద వేస్తున్నారని ఇలాంటి వారిని గుర్తించి మా ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు, మీ వంతు బాధ్యతగా మా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి మా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు అవుతారని ఆశిస్తున్నాం... ఛైర్మన్ నరేందర్ రెడ్డి సానూకులంగా స్పందించి ఉద్యోగుల సమస్యకు జిల్లా మంత్రుల దృష్టికి తీసుకుపోతానని తమకు హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మన్ రావు, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహ స్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మేందర్ సింగ్, కిరణ్ కుమార్, రామస్వామి, రాజేష్ భరద్వాజ్, సుమంత్ రావు, శంకర్, శారద, సునీత, తిరుపతి, గంప చంద్రశేఖర్, కరుణాకర్ రెడ్డి, మర్రి జయపాల్ రెడ్డి, వెలిచాల వెంకటస్వామి, ఎల్ కనకయ్య, జి శ్రీనివాస్ కుమార్, ప్రేమ్ సాగర్, హర్ ప్రీత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నేరుగా రైతుబజార్ లో కూరగాయలు అమ్ముకునేలా చర్యలు: రాష్ట్ర మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు



భారత శక్తి, ఖమ్మం బ్యూరో, ఏప్రిల్ 4:రైతులు తాము పండించిన కూరగాయలను నేరుగా రైతు బజార్ లో అమ్ముకునేందుకు వీలుగా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ఖమ్మం నగరం 44వ డివిజన్ శ్రీరామ్ నగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు 58.50 లక్షలతో షెడ్లు, ప్లాట్ ఫాంలను నిర్మించి రైతు బజార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులు సొంతంగా నేరుగా అమ్ముకునేందుకు సౌకర్యంగా ఉండాలని గతంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ లో నేడు ఫ్లాట్ ఫాం, షెడ్లు నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. పేద రైతుల కోసం కలెక్టర్ మంచి హృదయంతో ఈ పనులు పూర్తి చేశారని తెలిపారు. మార్కెట్ లో పంట పండించే రైతులకు మాత్రమే స్థానం ఇవ్వాలని, దళారులకు ఎట్టి పరిస్థితిలో అవకాశం ఇవ్వకూడదని, ఖమ్మం చుట్టుపక్కల ఉన్న రైతులు నేరుగా వచ్చి అమ్ముకోవాలని, అప్పుడు రైతులకు ఒక రూపాయి మిగలడంతో పాటు స్థానిక ప్రజలకు తాజా కూరగాయలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను త్వరలోనే ప్రారంభించేలా మార్కెటింగ్ శాఖ సంచాలకులకు ఆదేశాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రైతుకు వచ్చే లాభాలు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రైతు బజార్ ప్రారంభించామని అన్నారు. రైతులు ఏ పంటలు పండించాలి, ఎలా పండించాలి అనే అంశాలపై దృష్టి సారించి లాభసాటి సాగు గురించి జిల్లాలో మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని కలెక్టర్ తెలిపారు. మధ్యవర్తులను నివారిస్తూ రైతులకు అధిక లాభం లభించేలా రైతు బజార్ లను ఏర్పాటు చేశామని, 35 లక్షలతో గాంధీ చౌక్ వద్ద మరో మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, మరో నెల రోజులలో ఆ మార్కెట్ సిద్ధం చేస్తామని అన్నారు. ఈ రైతు బజార్ వద్ద రైతులు నుంచి నేరుగా వినియోగదారులు కూరగాయలను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 6 నుంచి బిజెపి ఆవిర్భావ వేడుకలు,పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశనం చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని

కరీంనగర్, ఏప్రిల్ 4(భారత శక్తి):భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల లో భాగంగా ఈనెల 6 నుండి 12 వరకు జరుగుతాయని, బిజెపి శ్రేణులు చేపట్టాల్సిన 9 అభియాన్ ప్రోగ్రాం వివరాలను మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 6 పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున జిల్లాలోని అన్ని పార్టీ కార్యాలయాల్లో , (మండలాలు, గ్రామాలు, పోలింగ్ బూత్ కేంద్రాలు ) కార్యకర్తల ఇళ్లలో పార్టీ జెండాను ఎగురవేసి, ఫోటోలు సెల్ఫీలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. 6 నుండి 12వ తేదీ వరకు పార్టీ సూచించిన 9 అభియాన్ కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టాలన్నారు. దేవాలయం ,ఆస్పత్రులు, పాఠశాలలు లేదా వీధులలో స్వచ్ఛత అభియాన్ .వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలకు చెందిన పదిమంది లబ్ధిదారుల నివాసాలను సందర్శించి , సంభాషించడం, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, పశు వైద్యశాల , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీ కార్యాలయం లేదా ఏదైనా ఇతర ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించడం సరస్సులు, చెరువులు, కుంటలు వంటి నీటి



వనరుల్లో పరిశుభ్రత కార్యక్రమాలు బిజెపి జెండాలు పట్టుకుని పార్టీ కార్యకర్తలతో కలిసి అన్ని వీధుల్లో ఊరేగింపు కుల పెద్దల ఇళ్ళ సందర్శన సీనియర్ బిజెపి కార్యకర్తలు, ఎమర్జెన్సీ కాలంలో అరెస్ట్ అయిన వాళ్లకు, కర సేవకులకు సన్మానాలు బూత్ కమిటీ సమావేశం గ్రామస్తులు లేదా బస్తీ వాసులతో సాయంత్రం రచ్చబండ కార్యక్రమాలు చేపట్టాలని ఇట్టి ప్రకటన ద్వారా సంకినేని వెంకటేశ్వరరావు సూచించారు.

# లఖ్‌నవూకు అది చాలా ఇబ్బందికర అంశం.. పంత్ ఫామ్‌పై మాజీ స్పిన్నర్ ఆందోళన

ఈ ఐపీఎల్ లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ పేలవ ప్రదర్శన ఆ జట్టు అభిమానులను నిరాశపరుస్తోంది. ఇప్పటి వరకూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒకటి మాత్రమే గెలిచింది. ఇక ఆ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ ఆటతీరు గురించి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. ఐపీఎల్ మెగా వేలంలో రికార్డు (రూ.27 కోట్లు) మొత్తానికి అతడిని దక్కించుకుని కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది యాజమాన్యం. అయితే ఆడిన మూడు మ్యాచ్‌ల్లో పూర్తిగా విఫలమయ్యాడు.ల

ఈ సీజన్‌లో పంత్ మూడు మ్యాచ్‌ల్లో చేసిన మొత్తం పరుగులు 17 మాత్రమే. తొలి మ్యాచ్‌లో డకౌట్ కాగా.. మిగతా రెండు మ్యాచ్‌ల్లో చేసిన పరుగులు 15, 2. ఈ విషయమే తనకు ఆందోళన కలిగిస్తోందని మాజీ స్పిన్నర్ హర్భజన్‌సింగ్ పేర్కొన్నాడు. పంత్ వరుసగా విఫలమవుతుండటంపై విమర్శలు గుప్పించాడు. ఆ జట్టు ప్లేఆఫ్స్‌నకు చేరుకోవాలంటే యాజమాన్యం ఈ విషయంలో వీలైనంత త్వరగా ఏదో ఒకటి చేయాలని సూచించాడు.




‘‘పంత్ ఇప్పటి వరకూ చేసిందేమీ లేదు. బ్యాట్‌తో పెద్దగా రాణించలేకపోయాడు. అతడి పేలవ ఫామ్‌ను అధిగమించేందుకు జట్టు యాజమాన్యం సహాయం చేయాలి. ఈ అంశం జట్టుకు పెద్ద ఇబ్బందిగా మారింది’’ అని హర్భజన్ పేర్కొన్నాడు.

ఈ సీజన్‌లో లఖ్‌నవూ ఆడిన తొలి మ్యాచ్‌లో దిల్లీపై ఓడిపోగా.. రెండో మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై గెలిచింది. ఇక పంజాబ్ కింగ్స్‌పై 8 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. నేడు ముంబయి ఇండియన్స్‌తో పోరుకు సిద్ధమైంది. మరి ఈ మ్యాచ్‌లోనైనా పంత్ ఆటతీరు మెరుగుపడుతుందా.. చూడాలి!. మరోవైపు లఖ్‌నవూ తరఫున పూరన్ ఒక్కడే స్థిరంగా ఆడుతున్నాడు. మిచెల్ మార్ష్, డేవిడ్ మిల్లర్ కూడా రాణిస్తే ఈ జట్టుకు తిరుగుండదు. ఫామ్‌లో ఉన్న శార్దూల్ ఠాకూర్, రవి బిష్ణోయ్ విజృంభిస్తే ఎల్‌ఎస్‌జీ గెలుపుబాట పట్టే అవకాశం ఉంది.

# రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు విశేష ఆదరణ : సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఏప్రిల్ 4(భారత శక్తి):రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించిన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం గ్రామాలలో సాయంత్రం డివిజన్లలో పాదయాత్ర కొనసాగుతుందని 3,22,24,25 డివిజన్లలో కొనసాగి సుభాష్ నగర్ బుద్ధ విగ్రహం వద్ద ముగుస్తుందని తెలిపారు. గాంధీ మహాత్ముడు వంద సంవత్సరాల క్రితం జాతీయ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా పనిచేసిన విషయం ఈ తరానికి తెలుపుకుంటూ అదే విధంగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించుకుంటూ బిజెపి నాయకులు అంబేద్కర్ ను అవమాన పరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజలలోకి వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో నియోజక వర్గ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్,స్థానిక డివిజన్ల భాద్యులు గంట కళ్యాణి శ్రీనివాస్,దండి రవీందర్,జిడి రమేష్,కల్వల రామచంద్రం,కుర్రపోచయ్య,కీర్తి కుమార్,ముల్కల కవిత,యనమల మంజుల, మెండి చంద్రశేకర్, కర్ర రాజాశకర్,ముక్క భాస్కర్,రాజకుమార్,రోళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# పాన్‌కు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ ఇచ్చారా? అయితే మీకో అలర్ట్

పాన్‌కార్డు హోల్డర్లకు అలర్ట్. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని ఉపయోగించి శాశ్వత ఖాతా సంఖ్య తీసుకున్నవారు తమ కార్డును ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసుకోవాలని కేంద్రం తెలిపింది. ఇందుకోసం 2025 డిసెంబర్ 31ను గడువుగా నిర్దేశించింది. ఈ మేరకు తాజాగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోరునోటిఫికేషన్ జారీ చేసింది. 2024 అక్టోబర్ 1, అంతకంటే ముందు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని ఇచ్చి పాన్ పొందిన వారు నిర్దేశిత గడువులోపు ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

పాన్- ఆధార్ అనుసంధానానికి అనుసరించిన ప్రక్రియనే దీనికీ ఫాలో అవ్వాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ పోర్టల్‌లోకి వెళ్లి పాన్-ఆధార్ లింకింగ్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎలాంటి పెనాల్టీ చెల్లించాల్సిన అవసరం లేదు. లేదంటే పాన్ సర్వీసు సెంటర్‌కు వెళ్లి కూడా ఈ ప్రక్రియను పూర్తి చేయెుచ్చు. అయితే, సాధారణ వినియోగదారులు పాన్- ఆధార్ కార్డు అనుసంధానం చేయాలంటే పెనాల్టీ పడుతుంది. పాన్- ఆధార్ లింక్‌కు ఇచ్చిన గడువు 2023 జూన్ 30తో ముగియడంతో పెనాల్టీ విధిస్తున్నారు. ఎన్‌రోల్‌మెంట్ ఐడీ ఇచ్చిన వారికి దీన్నుంచి మినహాయింపు ఉంది. ఒకవేళ గడువులోగా అనుసంధానం పూర్తి చేయకపోతే పెనాల్టీతో పాటు, పాన్ నిరుపయోగంగా మారే అవకాశం ఉంటుంది.

# ట్రేడ్ వార్ భయాలు: భారీ నష్టాల్లో సూచీలు.. ?9.5 లక్షల కోట్లు ఆవిరి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో భారీ నష్టాలు చవిచూశాయి. ట్రంప్ విధించిన టారిఫ్‌ల కారణంగా వాణిజ్య యుద్ధ భయాలు నిన్నటి అమెరికా మార్కెట్లతో పాటు నేటి ఆసియా మార్కెట్లనూ కుదిపేశాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ, ఫార్మా స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో సెన్సెక్స్ 900 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 23వేల దిగువకు చేరింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.9.5 లక్షల కోట్లు క్షీణించి రూ.403 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఈ ఉదయం 76,160.09 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,295.36) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,240.55 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 930.67 పాయింట్ల నష్టంతో 75,364.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.65 పాయింట్ల నష్టంతో 22,904 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.85.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, అదానీ పోర్ట్స్ ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ భారీగా క్షీణించి 67.15 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3118 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవే..

వాణిజ్య యుద్ధ భయాలు: వివిధ దేశాల నుంచి అమెరికా చేసుకునే దిగుమతులపై సుంకాలు విధించడం ద్వారా వాణిజ్య యుద్ధానికి తెరతీశారు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇప్పటికే కెనడా టారిఫ్‌లను ప్రకటించగా.. చైనా, యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రతీకార సుంకాలకు సిద్ధమవుతున్నాయి. వాణిజ్య యుద్ధాలు ప్రపంచ ఆర్థికంపై ప్రభావం చూపుతాయని, దాని ప్రభావం భారత్‌పైనా ఉంటుందన్న ఆందోళనలు మన మార్కెట్‌లను పడేశాయి.

మాంద్యం భయాలు: ప్రతీకార సుంకాల మూలంగా అగ్రరాజ్యం మాంద్యంలోకి వెళుతుందన్న భయాలు నెలకొన్నాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో అమెరికా మార్కెట్లు భారీ కుదుపునకు లోనయ్యాయి. 2020 తర్వాత భారీ పతనాన్ని చవిచూశాయి. ప్రధాన సూచీలు భారీగా క్షీణించడంతో పాటు దాదాపు 2.3 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ సంపద ఆవిరైంది. దీని ప్రభావం మన ఐటీ స్టాక్స్‌పై పడింది.

FONT SIZE



ఫార్మా స్టాక్స్: భారత్‌పై సుంకాల ప్రకటన వేళ ఫార్మాను మినహాయించడంతో నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో ఫార్మా స్టాక్స్ రాణించాయి. ట్రంప్ అంతలోనే మాట మార్చారు. ఫార్మా రంగంపై మునుపెన్నడూ చూడని విధంగా టారిఫ్‌లు ఉండబోతున్నాయంటూ విలేకరులతో పేర్కొన్నారు. దీంతో అరబిందో ఫార్మా, లారస్ ల్యాబ్స్, లుపిన్ వంటి స్టాక్స్ క్షీణించాయి.

అన్ని రంగాల షేర్లలో: ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ (6 శాతం), నిఫ్టీ ఫార్మా (4 శాతం)తో పాటు ఐటీ, ఆటో, రియాలిటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్‌టీ, ఇన్ఫోసిస్, టాటా స్టీల్ వంటి ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి.

# మన స్టార్టప్‌లు చిప్స్, ఐస్‌క్రీమ్‌ల దగ్గరే ఆగిపోకూడదు: పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

భారత్ స్టార్టప్ లను ఉద్దేశించి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ( కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని పలు అంకుర సంస్థలు ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా దృష్టి సారించాయన్నారు. కానీ చైనాలోని స్టార్టప్‌లు మాత్రం ఇందుకు భిన్నమైన రంగాలను ఎంచుకుంటున్నాయని చెప్పారు.



"దేశంలో ప్రస్తుతం ఉన్న స్టార్టప్‌ల పరిస్థితి చూస్తే.. మనం ఫుడ్ డెలివరీ యాప్స్‌పై దృష్టిసారించాం. ఇలాంటి వాటి వల్ల దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారు. ఇదే సమయంలో చైనా సంస్థలు ఏఐ, ఈవీలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయి. భారత్‌లో డీప్-టెక్ స్టార్టప్‌లు పరిమిత సంఖ్యలోనే వస్తున్నాయి. ఆ రంగంలో కేవలం 1,000 స్టార్టప్‌లు మాత్రమే ఉండటం ఆందోళనకర పరిస్థితి. ఇక్కడి యువతరం గొప్ప ఆలోచనలు రూ.25 లక్షలు, రూ.50 లక్షలకు విదేశీ కంపెనీలకు అమ్ముడుపోతున్నాయి. కొత్త అంకుర సంస్థలు భవిష్యత్ తరాల కోసం దేశాన్ని సిద్ధం చేయాలి. మనం ఐస్‌క్రీం, చిప్స్ అమ్మడం దగ్గరే ఆగిపోకూడదు. డెలివరీ బాయ్స్/గర్ల్స్‌గానే మిగిలిపోదామా? అదే భారత్ లక్ష్యమా..? అది అంకురాల ఉద్దేశం కాదు" అని స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

విమర్శించడం తేలిక: జెప్టో సీఈఓ

పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సీఈఓ అదిత్ పలిచా స్పందించారు. విమర్శించడం తేలిక అంటూ మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు. "యూఎస్, చైనాలోని డీప్ టెక్ నైపుణ్యంతో పోల్చి, భారత్‌లోని కన్స్యూమర్ ఇంటర్నెట్ స్టార్టప్‌లను విమర్శించడం చాలా తేలిక. ప్రస్తుతం జెప్టోలో 1.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. 3.5 సంవత్సరాల క్రితం అసలు ఆ సంస్థే లేదు. మేం పన్నులు చెల్లిస్తున్నాం. దేశంలోకి విదేశీ పెట్టుబడులు వచ్చాయి. సరఫరా గొలుసులను నిర్వహించేందుకు వందల కోట్ల పెట్టుబడులు పెట్టారు. భారత ఆవిష్కరణల్లో ఇదొక అద్భుతం కాకపోతే.. మరి దీన్ని ఏమంటారో నాకు తెలియదు.

భారత్‌కు భారీస్థాయిలో ఏఐ మోడల్ ఎందుకు లేదు..? ఎందుకంటే, అమెజాన్, ఫేస్‌బుక్, అలీబాబా, గూగుల్ వంటి పెద్ద ఇంటర్నెట్ సంస్థలు ఇక్కడ లేవు. అవి కూడా కన్స్యూమర్ ఇంటర్నెట్ కంపెనీలుగా ప్రస్థానం మొదలుపెట్టినవే. అవే ఏఐ వంటి ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్తున్నాయి. వాటి వద్ద విస్తృత డేటా, టాలెంట్, పెట్టుబడులు ఉన్నాయి. అందుకే అది సాధ్యమైంది. స్టార్టప్ ఎకోసిస్టమ్, ప్రభుత్వం, మూలధనాన్ని కలిగి ఉన్న యాజమాన్యాలు.. ఈ స్థానిక ఛాంపియన్లకు మద్దతు ఇవ్వాలి. అంతేగానీ ఎదగడానికి ప్రయత్నిస్తున్నవారిని అణచి వేయకూడదు" అని పలిచా అన్నారు. భారత స్టార్టప్‌లను తక్కువ చేయెుద్దని, డీప్‌టెక్ సంస్థల వృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి సహాయం అందిస్తోందని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ ప్రశ్నించారు.

# ట్రంప్ ఎఫెక్ట్: ఐఫోన్ ధరలకు రెక్కలు..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం దెబ్బకు యాపిల్ సంస్థ విలవిల్లాడనుంది. ఐఫోన్ ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మోడల్‌ను బట్టి వీటి ధరలు 30-40శాతం వరకు పెరగవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఐఫోన్లు చైనాలో తయారవుతాయి. దీంతో ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు వీటిపై పడతాయి. ఈనేపథ్యంలో సంస్థ వీటిని భరించడమా.. లేక వినియోగదారులపై మోపడమా అనేది యాపిల్ నిర్ణయించాల్సి ఉంది.



చాలామందికి అందుబాటులో ఉండే ఐఫోన్ 16 మోడల్ ధర 799 డాలర్లు (రూ.68 వేలు). యాపిల్ కనుక పన్నుల భారం వినియోగదారుల పైకి బదలాయిస్తే.. ఇది 1,142 డాలర్లకు (రూ.97వేలు)కు చేరవచ్చని అంచనా. ఇక ప్రీమియం మోడల్ ఐఫోన్ 16 ప్రోమ్యాక్స్ (1టెరాబైట్ మోడల్) 2,300 డాలర్లకు (రూ.2 లక్షలకు) చేరవచ్చు. గతంలో యాపిల్ అదనపు పన్నులు తప్పించుకొనేందుకు ప్రత్యేక మినహాయింపులు పొందింది. కానీ, ఈసారి అవేవీ లభించేలా లేవు.

అమెరికా వ్యాపార సంస్థలు చైనా నుంచి తమ ఫ్యాక్టరీలను తరలించేలా ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ అదనపు పన్నులు విధించారు. ఇప్పటికే ఐఫోన్ల విక్రయాలు ప్రధాన మార్కెట్లలో అనుకున్న స్థాయిలో లేవు. దీనికితోడు తాజా పన్నుల కారణంగా ధరలు పెరిగితే.. వాటిపై మరింత ప్రతికూల ప్రభావం పడొచ్చు. దీంతో కస్టమర్లు ఇతర ఆప్షన్లపై దృష్టిపెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా యాపిల్ ప్రధాన పోటీదారు శామ్‌సంగ్ లబ్ధిపొందే అవకాశం ఉంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిన్న సుంకాల ఢంకా మోగించిన సంగతి తెలిసిందే. అమెరికాకు దిగుమతయ్యే ప్రతి వస్తువు పైనా కనిష్ఠంగా 10శాతం నుంచి గరిష్ఠంగా 49శాతం వరకు సుంకాలు విధించారు. మన దేశంపై 26 శాతంతో విరుచుకుపడ్డారు. చైనాపై 34% బాదేశారు. ఐరోపా దేశాలపై 20% విధించారు.

# టీవీఎస్ అపాచీకి 20 ఏళ్లు.. 60 లక్షలు దాటిన విక్రయాలు



దేశీయ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ ( సరికొత్త మైలురాయిని నమోదు చేసింది. తన ఫ్లాగ్‌షిప్ మోటార్‌సైకిల్ అపాచీ  అమ్మకాల్లో దుమ్మురేపింది. ప్రపంచవ్యాప్తంగా 6 మిలియన్ల (60 లక్షల)కు పైగా బైక్‌లను విక్రయించింది. అపాచీ బైక్‌లను ప్రవేశపెట్టి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న వేళ టీవీఎస్ ఈ ఘనతను సొంతం చేసుకోవడం విశేషం. 2005లో టీవీఎస్ అపాచీ 150 (పేరిట తొలి బైక్‌ను లాంచ్ చేసింది. అప్పటి నుంచి బైక్ పనితీరులో విప్లవాత్మక మార్పులు చేస్తూ, అధునాతన ఫీచర్లను ఎప్పటికప్పుడు అందిస్తూ వచ్చింది.

అపాచీ ఆర్‌టీఆర్, అపాచీ ఆర్‌ఆర్ (ట్రాక్-ఫోకస్ట్) సిరీస్ బైక్‌లను పరిచయం చేసింది. అత్యాధునిక రేసింగ్ టెక్నాలజీతో ఈ బైక్‌లను తీసుకొచ్చింది. వీటిలో ఫ్యూయల్ ఇంజక్షన్, మల్టిపుల్ రైడ్ మోడ్స్, అడ్జెస్టబుల్ సస్పెన్షన్, స్లిప్పర్ క్లచ్ వంటి ఫీచర్లు జోడించింది. డ్యూయల్ ఛానల్ ఏబీఎస డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి భద్రతా పరమైన సదుపాయాలను అందించింది. వివిధ మోడళ్లలో స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, క్రూయిజ్ కంట్రోల్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ వంటి సాంకేతికతను తీసుకొచ్చింది. భారత్ సహా కొలంబియా, బంగ్లాదేశ్, నేపాల్, మెక్సికో, ఆఫ్రికాతో పాటు 60కి పైగా దేశాల్లో అపాచీ బైక్‌లను విక్రయిస్తోంది. ఇటీవల ఇటలీతో పాటు యూరప్‌లోని మరిన్ని దేశాల్లో విక్రయాలు ప్రారంభించింది. అపాచీ ఈ మైలురాయిని చేరుకోవడంపై టీవీఎస్ మోటార్ ఎండీ సుదర్శన్ వేణు ఆనందం వ్యక్తం చేశారు.

# బయటవారే ఆ ఇండస్ట్రీని తిరిగి నిలబెడతారు..: బాలీవుడ్‌పై విజయ్ దేవరకొండ కీలక వ్యాఖ్యలు



హిందీ చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటోన్న తాజా ఇబ్బందులను ఉద్దేశించి నటుడు విజయ్ దేవరకొండ (%ఎఱయిఖఎ ణవజవతీఖనశీఅఋ%) కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పరిశ్రమ త్వరలోనే తిరిగి పూర్వ వైభవాన్ని సొంతం చేసుకుంటుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు దక్షిణాది సినిమాలకు విశేష ఆదరణ లభిస్తోందని ఆయన గుర్తు చేశారు. తెలుగు సినిమా ఈ స్థాయికి చేరడం వెనక ఎంతోమంది శ్రమ, కృషి ఉందన్నారు. 'బాహుబలి' సినిమాని ఉదహరిస్తూ విజయ్ దేవరకొండ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

"దక్షిణాది చిత్రపరిశ్రమ ఇప్పుడు ఉన్నతస్థాయిలో రాణిస్తోంది. ఇప్పుడైతే ఈ చిత్ర పరిశ్రమకు దేశవిదేశాల్లో గుర్తింపు ఉంది. ప్రేక్షకులు మా సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ, ఒకానొక సమయంలో ఇక్కడి సినిమాలకు సరైన గుర్తింపు ఉండేది కాదు. కాబట్టి, ఇదొక సర్కిల్ లాంటిది. రానున్న ఐదు లేదా పదేళ్లలో పరిస్థితులు మరోవిధంగా మారొచ్చు. బాలీవుడ్‌లో ఇప్పుడు ఒక లోటు ఏర్పడింది. ఆ లోటును తీర్చేందుకు త్వరలోనే కొత్త దర్శకులు పుట్టుకొస్తారు. హిందీ చిత్రపరిశ్రమ గొప్ప దర్శకులను ప్రేక్షకులకు అందించనుందని నమ్ముతున్నా. కాకపోతే వారు.. ముంబయికి సంబంధం లేకుండా బయటవారే అయి ఉంటారని అనిపిస్తోంది'' అని విజయ్ దేవరకొండ అన్నారు.

అనంతరం ఆయన 'బాహుబలి'ని ఉదాహరణగా చెబుతూ.. "తెలుగు సినిమా ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో రాజమౌళి 'బాహుబలి'ని రూపొందించారు. భారీ మొత్తంలో ఖర్చు పెట్టారు. ఇక్కడ ఇలాంటి గొప్ప సినిమా రూపొందుతుందని బాలీవుడ్ వాళ్లకు అప్పుడు తెలిసి ఉండకపోవచ్చు. అదే కనుక వర్కౌట్ కాకపోతే ఎంతోమంది కెరియర్స్ ముగిసిపోయేవి. నిర్మాతలు చిక్కుల్లో పడేవారు. నటీనటులు ఒక్కొక్కరు సుమారు 5 ఏళ్లు ఈ సినిమా కోసం వర్క్ చేశారు. కాబట్టి, పోటీ అనేది అన్నిచోట్లా ఉంది. ప్రతిఒక్కరూ తమ స్థానం కోసం పోరాటం చేయాలి. హిందీ చిత్ర పరిశ్రమ కూడా తమ దారులను కనుగొని, ఉన్నతంగా ముందుకుసాగుతుందని నమ్ముతున్నా" అని వివరించారు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్‌డమ్' కోసం వర్క్ చేస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు.





# సల్మాన్, రష్మికల మధ్య ఏజ్ గ్యాప్.. స్పందించిన మరో నటి

'సికందర్'తో పలకరించారు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ( ఇందులో ఈ అగ్ర కథానాయకుడి సరసన రష్మిక నటించారు. అయితే వీరిద్దరి మధ్య 31 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉండడం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో ఎన్నో విమర్శలు వచ్చాయి. తాజాగా ఈ విషయంపై నటి అమీషా పటేల్ స్పందించారు. సినిమాల్లో నటీనటుల మధ్య ఏజ్‌గ్యాప్ ఒక విషయమే కాదన్నారు.

"నేను కూడా నాకంటే వయసులో చాలా పెద్ద హీరోలతో కలిసి వర్క్ చేశాను. 'గదర్ 2'లో సన్నీదేవోల్‌తో కలిసి నటించాను. ఆయనకు, నాకు మధ్య 20 ఏళ్ల వ్యత్యాసం ఉంది. కానీ, మా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులకు నచ్చింది. ఆ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలానే సల్మాన్, రష్మికల జోడిని కూడా ఆడియన్స్ ఆదరిస్తున్నారు. నాకూ 'సికందర్' నచ్చింది. మంచి విజయాన్ని సొంతం చేసుకుంటోంది. కారణం లేకుండా ఏ సినిమా విజయం సాధించదు. ఆ సినిమాలో కంటెంట్ ఉంది" అని తెలిపారు.

ఇక 'సికందర్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్లోనూ సల్మాన్‌ఖాన్ ఏజ్ గ్యాప్ గురించి మాట్లాడారు. "హీరోయిన్‌కు గానీ, ఆమె తండ్రికి గానీ లేని సమస్య మీకెందుకు? రష్మికకు పెళ్లై పాప పుడితే ఆమె కూడా బిగ్ స్టార్ అవుతుంది. కలిసి నటిస్తాం. అప్పుడు కూడా.. తల్లిగా రష్మిక అనుమతి తప్పనిసరిగా తీసుకుంటా" అని సమాధానమిచ్చారు.





# దర్శకుడికి రామ్ చరణ్ దంపతుల గిఫ్ట్.. ఎందుకంటే

దర్శకుడు బుచ్చిబాబుకు రామ్‌చరణ్ దంపతులు ప్రత్యేక బహుమతి పంపారు. ఈవిషయాన్ని తెలుపుతూ ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ బహుమతి తనకెంతో ప్రత్యేకమని పేర్కొన్నారు.

ఇటీవల రామ్‌చరణ్ (40వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. ఆయన పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబుకు చరణ్ దంపతులు హనుమాన్ చాలీసా పుస్తకాన్ని, హనుమంతుడి ప్రతిమను గిఫ్ట్‌గా పంపారు. 'నా మనసులో నీకెప్పుడూ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఆ హనుమంతుడి ఆశీస్సులు నీపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను' అని రాసి ఉన్న నోట్, శ్రీరాముని పాదుకలను కూడా పంపారు. ఆ ఫొటోలను పంచుకున్న బుచ్చిబాబు ఈ బహుమతి మీ ప్రేమను తెలియజేస్తుందంటూ రామ్ చరణ్, ఉపాసనను ట్యాగ్ చేస్తూ పోస్ట్ పెట్టారు.

ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'పెద్ది'( సినిమా తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. ఇటీవలే ఈ సినిమా హీరో ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా అది ఆదరణను సొంతం చేసుకుంది. క్రీడా నేపథ్యంలో, మూలాల్ని ఆవిష్కరించే ఓ గ్రామీణ కథగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. గుర్తింపు కోసమే పెద్ది పోరాటం చేస్తాడని రామ్‌చరణ్ సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.


# స్విమ్మింగ్ రాకపోయినా.. 'వన్' మూవీ కోసం మహేశ్‌బాబు సాహసం



అటు యువతతో పాటు, ఇటు మాస్‌లోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న స్టార్ హీరో మహేశ్‌బాబు సుకుమార్ ( దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ '1: నేనొక్కడినే'. బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన ఈ సినిమా టెక్నికల్‌గా హై స్టాండర్డ్‌లో తెరకెక్కించారు. సుకుమార్ టేకింగ్ విమర్శకులను సైతం మెప్పించింది. అయితే, ఈ సినిమా కోసం మహేశ్‌బాబు రియల్ స్టంట్ చేశారు. ఇదే విషయాన్ని గతంలో ఒకసారి సుకుమార్ కూడా పంచుకున్నారు. మహేశ్‌బాబు విలన్ గ్యాంగ్ నుంచి తప్పించుకునేందుకు బోటు తీసుకుని సముద్రంలోకి వెళ్తారు. అందులో నటించిన ఆర్టిస్టులందరూ ప్రొఫెషనల్ స్విమ్మర్స్ కాగా, మహేశ్‌బాబుకు ఈత సరిగా రాదట. మిగిలిన వాళ్లందరూ లైఫ్ జాకెట్లు వేసుకొని నటిస్తే, మహేశ్ అవేవీ లేకుండా రిస్క్ చేసి మరీ ఆ సీన్‌లో నటించారు. అంతేకాదు, ఒక ప్రొఫెషనల్ డ్రైవర్ బోటును ఎలా నడుపుతారో అంతే వేగంతో నడిపారట. ఆ సీన్ తీస్తున్నప్పుడు చిత్ర బృందం చాలా కష్టపడిందని సుకుమార్ అప్పట్లో చెప్పారు.

అంతేకాదు, హిట్ అవ్వాల్సిన సినిమా ఫ్లాప్ అయిందన్న బాధ ఎప్పుడూ తనని వెంటాడుతూ ఉంటుందని సుకుమార్ అంటుంటారు. "హిట్ అయ్యే సినిమాను ఫ్లాప్ చేశానే అనిపిస్తుంది. ఒక సీన్‌తో వెర్షన్ మార్చేయొచ్చు. హీరో ఒక మానసిక సమస్యతో బాధపడుతూ ఉంటాడు. అది నిజం కాదని, అతను డ్రామా ప్లే చేస్తున్నాడని ఒక వెర్షన్ అనుకున్నాను. కానీ, నేను ఎమోషనల్ సైడ్ వెళ్లిపోయా. మొదటి వెర్షన్ చెప్పినప్పుడు ప్రొడ్యూసర్ రామ్ ఆచంటకి బాగా నచ్చింది. ఆయన మెచ్చుకున్నారు కూడా. కానీ, సినిమా తీసే సమయానికి అది కాస్తా మారిపోయి, ఇప్పుడు మీరు చూస్తున్న వెర్షన్ వచ్చింది. ఇంకో రెండు సీన్లు తీసి, ఎడిటింగ్ టేబుల్‌పై చూసుకోవాల్సింది. నిడివి పెరిగిపోవడంతో చాలా సీన్లు తీసేశా. అందుకే ప్రేక్షకులకు అర్థం కాలేదేమో" అని అన్నారు. ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు ఓ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్‌లో నటిస్తున్నారు. ఇటీవల ఒడిశా షెడ్యూల్ పూర్తయింది. ఇక సుకుమార్ 'పుష్ప2' సక్సెస్ తర్వాత తన తదుపరి సినిమాల కోసం స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుంటున్నారు.

# బయోపిక్‌లో అవకాశం దక్కించుకున్న శివానీ రాజశేఖర్






రాజశేఖర్-జీవితల కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకుంటున్నారు నటి శివానీ రాజశేఖర్ ( తాజాగా మరో ప్రతిష్ఠాత్మకమైన సినిమాలో ఆమె అవకాశం సొంతం చేసుకున్నారు. దర్శకుడు కృష్ణకుమార్ రామకుమార్ తెరకెక్కించనున్న జీడీ నాయుడు బయోపిక్‌లో ఆర్ మాధవన్‌తో పాటు స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ( తో ఇస్రో శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితాన్ని తెరపైకి తీసుకొచ్చిన మాధవన్ ఇప్పుడు మరో బయోపిక్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు.

# ఇంకో పదేళ్లు ఇలాగే ప్రయాణం చేస్తా

"కథానాయికగా నాకు 'కుమారి 21 ఎఫ్' గుర్తింపుని తీసుకొస్తే... నాలోని నటిని ఆవిష్కరించింది 'ఓదెల రైల్వేస్టేషన్'. ఈ సినిమాకి కొనసాగింపు ఈ స్థాయిలో ఉంటుందని, అందులోనూ నేను నటిస్తానని ఊహించలేదు" అన్నారు కథానాయిక హెబ్బా పటేల్. 'ఓదెల రైల్వేస్టేషన్'లో రాధ అనే యువతిగా నటనకు ప్రాధాన్యమున్న పాత్రని పోషించి మంచి గుర్తింపుని తెచ్చుకుంది. ఆ సినిమాకి కొనసాగింపుగా రూపొందిన చిత్రమే.. 'ఓదెల 2' ఇందులో తమన్నా ప్రధాన పాత్ర పోషించారు. తొలి భాగంలో నందడి చేసిన హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహ ఇందులోనూ నటించారు. సంపత్ నంది పర్యవేక్షణలో... అశోక్‌తేజ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 17న రానుంది. ఈ సందర్భంగా హెబ్బా పటేల్ గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"దర్శకుడు సంపత్ నంది నన్ను నమ్మడంతోనే 'ఓదెల రైల్వేస్టేషన్' చేశా. ఆ సినిమా నా కెరీర్‌కి ఓ మలుపు. ఆ కథ, అందులో నా పాత్ర చెప్పినప్పుడు నేను ఇలాంటి పాత్రని చేయగలనా? అని అడిగా. కానీ సంపత్ నంది ప్రయత్నించి చూడమని చెప్పారు. ఆయన నమ్మకం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ సినిమాలోని రాధ పాత్ర నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అయితే దానికి కొనసాగింపుగా మరో సినిమా ఉంటుందని అప్పట్లో ఊహించలేదు. తొలి భాగం కంటే భారీగా 'ఓదెల 2' రూపొందడం ఎంతో తృప్తినిచ్చింది.

# శానిటైజర్‌ను అతిగా వాడుతున్నారా..? అయితే మీ మెదడు ప్రమాదంలో పడినట్లే..!

హ్యాండ్ శానిటైజర్‌దీని గురించి తెలియని వారు ఉండరు. కరోనా పుణ్యమా అని ఇప్పుడు అంతా దీన్నే ఎక్కువగా వాడుతున్నారు. ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా చేతులకు శానిటైజర్ రాసుకోవడం మాత్రం రోజూ కార్యకలాపాల్లో భాగంగా మారిపోయింది. దేన్ని పట్టుకున్నా వెంటనే జేబు లేదా పర్స్‌లో నుంచి శానిటైజర్ బాటిల్‌ను తీసుకుని వెంటనే చేతులపై రాసేసుకుంటున్నారు. అయితే, అనవసరంగా, అతిగా శానిటైజర్



వాడటంవల్ల చాలా దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం లేకపోలేదు.

హ్యాండ్ శానిటైజర్ అతిగా వాడటం వల్ల మన బ్రెయిన్ దెబ్బతింటుందని ) తాజా అధ్యయనంలో తేలింది. ఒహియో కేస్ వెస్ట్రన్ రిజర్వ్ యూనివర్సిటీలోని మాలిక్యులర్ బయాలజీ డిపార్ట్‌మెంట్ చేసిన సర్వేలే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. హ్యాండ్ శానిటైజర్ వల్ల మెదడులోని కణాలు దెబ్బతింటాయని ఈ అధ్యయనంలో తేలింది. మనుషుల మెదడులో ఒలిగోడెండ్రోసైట్స్ అనే కణాలు ఉంటాయి. ఈ కణాలు మెదడులోని నరాల చుట్టూ వ్యాపించి ఉంటాయి. మెదడు వేగంగా, చురుగ్గా పనిచేసేందుకు ఈ కణాలు సహాయపడతాయి. ముఖ్యంగా మన బుర్రకు వేగంగా సంకేతాలు పంపించడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. అయితే, ప్రస్తుతం మనం వాడే శానిటైజర్లలో ఉన్న కొన్ని రసాయనాల కారణంగా ఈ కణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం చెబుతోంది.

మనం వాడే శానిటైజర్ కారణంగా అందులోని రసాయనాలు ముక్కు (వాసన), చేతులు, చర్మం ద్వారా శరీరంలోకి వెళతాయి. అలా వెళ్లిన శానిటైజర్‌లోని రసాయనాలు.. మెదడులోని నరాల చుట్టూ వ్యాపించి ఉన్న ఒలిగోడెండ్రోసైట్స్ కణాలను దెబ్బతీస్తాయని.. దీని వల్ల క్రమంగా మెదడు చురుగ్గా పనిచేయడం మానేస్తుందని అధ్యయనంలో వెల్లడైంది. ఒక్క హ్యాండ్ శానిటైజరే కాదు.. సబ్బులు,ఇంటినీ, టాయ్‌లెట్లను శుభ్రపరచటానికి ఉపయోగించే రసాయనాలను అతిగా వాడటం వల్ల సమస్యలు వచ్చి పడతాయట.

కేవలం మెదడుకే కాదు.. శానిటైజర్ అతిగా వాడటం మన ఆరోగ్యానికి చాలా హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శానిటైజర్ తరచుగా వాడినప్పుడు.. చర్మం కందిపోయి దద్దుర్లు వచ్చే అవకాశాలు ఎక్కువ. ఇందులోని ఆల్కహాల్‌తో పాటు ఉండే అనేక రసాయనాలు చర్మపు సహజ నూనెలను హరిస్తాయి. దాంతో చర్మంలోని సహజమైన తేమ తగ్గిపోయి పగుళ్లు ఏర్పడతాయి. ఈ పగుళ్ల ద్వారా బ్యాక్టీరియా చాలా తేలిగ్గా చర్మంలోకి చేరుతుంది.

శానిటైజర్లోని ఆల్కహాల్‌లో ఉండే ఐసోప్రొపనాలియన్ వంటివి చేతుల్లోని కణాలకు హాని కలిగిస్తాయి. దాంతో చర్మం పొడిబారుతుంది. ఇలా జరిగినప్పుడు డెర్మటైసిస్ ఇన్ఫెక్షన్‌లు వచ్చే అకవాశాలు ఎక్కువ. అంతేకాదు శానిటైజర్లలో ఉపయోగించే రసాయనాల పరిమళాలు కొందరికి అలర్జీ కలిగేలా చేస్తాయి. అంతేకాదు దీని వాడకం వల్ల హార్మోన్ల అసమతుల్యతకూ కారణమవుతుంది. అందులో ఉండే ట్రైక్లోసామ్ అనే రసాయనం యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదం చేస్తుంది. అంతేకాకుండా ఈ బ్యాక్టీరియాకు యాంటీబయాటిక్‌లను తట్టుకునే సామర్థ్యమూ పెరుగుతుంది. దీంతో తేలికగా ఇన్ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఎ ఈ ఆహారపదార్థాలతో అజీర్తి, మలబద్ధకం, కడుపు ఉబ్బరానికి చెక్

ఆధునిక జీవనశైలితో మనలో చాలా మంది మలబద్ధకం, అజీర్తి, కడుపుబ్బరం వంటి సమస్యలతో బాధపడుతుంటారు. అయితే ప్రేవుల ఆరోగ్యం పదిలంగా కాపాడుకుంటే ఈ సమస్యలను



అధిగమించవచ్చు. దైనందిన జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లతో ప్రేవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. ప్రేవుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు డైటీషియన్ మన్‌ప్రీత్ కల్రా సులభమైన మార్గాలను సూచిస్తున్నారు.

రాత్రివేళ నాలుగైదు కిస్‌మిస్‌లను నీటిలో నానబెట్టి ఉదయాన్నే వాటిని తీసుకుంటే అందులో ఉండే ఫైబర్, సహజమైన చక్కెరలు జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తాయని ప్రేవుల కదలికలను ప్రేరేపిస్తాయని చెబుతున్నారు. ఇక ప్రతిరోజూ నిర్ణీత సమయంలో భోజనం ముగించేలా చూసుకోవాలి. ప్రతి రోజూ ఒకే సమయంలో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ తీసుకోవడం ద్వారా ప్రేవుల ఆరోగ్యం మెరుగవుతుంది.

శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడంతో పాటు ఫైబర్ తగినంతగా అందేలా మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో గ్లాస్‌లో ఒక టీస్పూన్ చియా సీడ్స్‌తో కూడిన వాటర్‌ను తీసుకోవడం మేలు. చియా గింజల్లో అధిక ఫైబర్‌తో పాటు శరీరానికి అవసరమైన పోషకాలు ప్రేవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇంకా అవిసె గింజలు, పండ్లు, కూరగాయలు, తగినంత నీరు, ప్రొ బయాటిక్ ఫుడ్స్, రాత్రి వేళ నెయ్యి, పాలుతో పాటు పడుకునే ముందు అంజీరా పండ్లు తీసుకుంటే ఇందులో ఉండే ఫైబర్‌తో మలబద్ధకం నివారించవచ్చు.

# ఒకేసారి లీటరు కొబ్బరి నీళ్లు తాగొచ్చా?

ఎండాకాలం దాహం కోసమో, ఆరోగ్యానికి మంచిదనో కొబ్బరి నీళ్లు తాగుతుంటాం. అయితే ఇటీవల బోండాలతోపాటు బాటిళ్లలోనూ కొబ్బరి నీళ్లను అమ్ముతున్నారు. ఇలా ఒకేసారి లీటరు కొబ్బరి నీళ్లు తాగొచ్చా? దీనివల్ల కిడ్నీల మీద ఏమైనా భారం పడుతుందా! అసలు ఒక రోజులో, లేదా వారంలో ఎన్ని కొబ్బరి నీళ్లు తాగొచ్చు తెలియజేయండి?

శరీరంలో ద్రవాల స్థాయిని నియంత్రణలో ఉంచేందుకు, ఎలక్ట్రోలైట్లను సమతౌల్యం చేసేందుకు కొబ్బరి నీళ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. సోడియం, పొటాషియం, మాంగనీసులాంటివి ఇందులో ఎక్కువగా ఉంటాయి. వడదెబ్బకు, డయేరియాకు కొబ్బరినీళ్లు మంచి మందు. పొటాషియం ఎక్కువగా ఉంటుంది కాబట్టి గుండె జబ్బులు, బీపీ ఉన్నవాళ్లకు మంచిది. ఇందులో ఉండే మీడియం చెయిన్ ట్రై గ్లిజరైడ్లు చర్మానికి, జుట్టుకి మేలు చేస్తాయి. జీర్ణశక్తికి కూడా ఉపయోగపడతాయి.



పొటాషియం శరీరంలోని విషతుల్యాలను బయటికి నెట్టేసేందుకు ఉపయోగపడుతుంది. కాబట్టి కిడ్నీలకు కూడా మంచివి. అంతేకాదు కొబ్బరినీళ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు, మినరల్లు పోను 95 శాతం మంచి నీళ్లే ఉంటాయి. 20–40 ఏండ్ల మధ్య వయసున్న వాళ్లు రోజుకు లీటరు కొబ్బరినీళు తాగొచ్చు. యాభై ఏండ్లు పైబడిన వాళ్లు ఏ ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోతే చక్కగా వీటిని తాగొచ్చు. అయితే డయాబెటిస్ ఉన్న వాళు మాత్రం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను బట్టి తీసుకోవాలి. కాబట్టి, న్యూట్రీషనిస్టులను సంప్రదించి దానికి తగ్గట్టు తీసుకోవడం మంచిది.

# పొగ.. వదల్లేకపోతున్నారు! ‘



‘మధ్యలో వచ్చింది మధ్యలోనే పోతుంది’ అని పెద్దల మాట. అలా మధ్యలో వచ్చేది దురలవాటైతే.. వీలైనంత త్వరగా పోవడం మంచిది. కానీ, ఈ తరం మగువలు మధ్యలో వచ్చిన కొన్ని అలవాట్లను అంత త్వరగా వదల్లేకపోతున్నారట. ముఖ్యంగా వ్యసనాల్లో పడితే.. పీకల్లోతుదాకా మునిగిపోతున్నారట. ఆ దురలవాట్ల బారినుంచి పురుషులు బయటపడినంత సులువుగా అతివలు తప్పించుకోలేక పోతున్నారని తాజా పరిశోధన ఒకటి వెల్లడించింది.

మోడ్రన్ కల్చర్‌లో పురుషులతో సమానంగా పొగ తాగుతున్న మహిళలు ధూమపానాన్ని మానేయడానికి డక్కామొక్కీలు పడుతున్నారని కెంటకీ యూనివర్సిటీ (యూఎస్) అధ్యయనంలో తేలింది. మగవాళ్లతో పోలిస్తే స్మోకింగ్ మానేయడం వాళ్లకు కష్టంగా ఉందని ఆ అధ్యయన సారాంశం.

నికోటిన్‌కు అడిక్ట్ కావడానికి మహిళల్లోని సెక్స్ హార్మోన్ ఈస్ట్రోజన్ కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడైంది. ఏదైనా కావాలనుకునే ఆశను వ్యక్తీకరించే మెదడులోని ఒల్ఫాక్టోమెడిన్ ప్రొటీన్ కూడా ఈ వ్యసనానికి కారణమని అధ్యయనంలో తేలింది. కాబట్టి, ఆధునిక మగువలూ.. కొత్త పోకడలకు పోయే ముందు కీడెంచి మేలెంచడం మంచిది!!

# పర్పుల్ ఫుడ్స్‌తో మెరిసే చర్మం మీ సొంతం

%సముశ్రీష్ట్ర ఽఅజాం% ఎ పర్పుల్ కలర్ మీకు ఇష్టమైతే మీ ప్లేట్‌లోనూ అది ఉండేలా చూసుకునే సమయం వచ్చేసింది. సహజంగా పర్పుల్ రంగులో ఉండే పండ్లు, కూరగాయల్లో చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు ఇన్‌ఫ్లమేషన్‌తో పోరాడి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. పర్పుల్ వర్ణంలో ఉండే ఆహార పదార్థాల్లో మొక్కల ఆధారిత యాంటీఆక్సిడెంట్స్ పాలీఫెనాల్స్ అధికంగా ఉంటాయని జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ మెటబాలిజంలో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది.



పాలీఫెనాల్స్ చర్మ క్యాన్సర్ ముప్పును తగ్గించడమే కాకుండా చర్మం కాంతులీనేలా చేస్తాయి. ఇక ద్రాక్ష, కిస్‌మిస్‌లు అధికంగా తీసుకోవడం ద్వారా చర్మాన్ని అల్ట్రావయలెట్ రేడియేషన్‌కు గురికాకుండా నిలువరిస్తాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. ఇక బీట్రూట్ జ్యూస్ తరచూ తీసుకోవడం ద్వారా ఇన్‌ఫ్లమేషన్ తగ్గడంతో పాటు శరీరంలో రక్త సరఫరా మెరుగవుతుందని ఇది చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని వెబ్‌ఎండీ తెలిపింది.

ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కణాలను కాపాడటంలో బీట్రూట్ కీలకంగా పనిచేస్తుందని జర్నల్ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైన పరిశోధన వెల్లడించింది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి క్యాన్సర్ సహా చర్మ వ్యాధులకు దారితీస్తుంది. ఇంకా చర్మ సంరక్షణకు, నునుపైన చర్మం కోసం ప్యాషన్ ఫ్రూట్, పర్పుల్ క్యాబేజ్, వంకాయలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని పరిశోధకలు సూచిస్తున్నారు.

# ముందే తినేయాలి!

రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..



వయసు, లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్నమాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది.

గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి. 2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే%ా% “ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు” అని పరిశోధకులు పేర్కొన్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?.. అయితే మీకు ఈ ముప్పు పొంచిఉన్నట్టే!



ఒక్కోసారి హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.

అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy( Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy